


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 31 మంగళవారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 105

# నింగికి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ సీ60

- అంతరిక్షంలోనే వ్యోమనౌకలను డాకింగ్, అన్ డాకింగ్ చేయగల సాంకేతిక అభివృద్ధే లక్ష్యంగా ప్రయోగం
- ప్రయోగం సక్సెస్ అయితే..ఈ సాంకేతిక కలిగిన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన నాలుగో దేశంగా భారత్
- భూపరిశీలన, సహజ వనరుల పర్యవేక్షణ, పచ్చదనం, రోదసీలో రేడియో ధార్మికతపై అధ్యయనం
- ఈ రాకెట్ ప్రయోగంతో అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి ఇస్రో తొలి అడుగు



**నెల్లూరు-నవభూమిబ్యూరో:** పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్.. నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోట లోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ సీ60ని సోమవారం రాత్రి 10 గంటల 15 సెకన్లకు మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకు వెళ్లింది. అంతరిక్షంలోనే వ్యోమనౌకలను డాకింగ్, అన్ డాకింగ్ చేయగల సాంకేతిక అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టారు. పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమ నౌకలను అంతరిక్షంలోనే ఒకదానితో ఒకటి డాకింగ్ చేయించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఈ ప్రయోగం సక్సెస్ అయితే.. ఈ సాంకేతిక కలిగిన అమెరికా, రష్యా, చైనా దేశాల సరసన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఈ పీఎస్ఎల్వీ సీ 60 ప్రయోగానికి ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది.

# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్
- పేదల నాయకుడిగా,దేశ ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పిన మన్మోహన్‌సింగ్
- ఉపాధి హామీ చట్టం వల్ల పేదలు 3 పూటలా అన్నం తినగలుగుతున్నారు..
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో మన్మోహన్ సింగ్‌కు నివాళి సంతాపతీర్మానం
- సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

పేదల నాయకుడిగా.. దేశ ఆర్థిక వ్యవస్థను మలుపుతిప్పిన మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి. ఇచ్చి తీరాలి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన డిమాండ్ చేశారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారత రత్న పురస్కారాన్ని ఇవ్వాల్సిందే నని ఆయన పట్టుబట్టారు. తాజాగా తెలంగాణ అసెంబ్లీ భేటీ అయింది. కేవలం మన్మోహన్‌సిం గ్‌కు నివాళులర్పించడం.. సంతాప తీర్మానం చేయడం వంటి రెండే అజెండాలతో ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. సోమవారం ఒక్కరోజు మాత్రమే ఈ సభ జరగనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ గొప్పతనాన్ని ఏకరువు పెట్టారు. " పేదల నాయకుడిగా.. దేశ ఆర్థిక వ్యవస్థను మలుపుతిప్పిన మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి. ఇచ్చి తీరాలి. ఈ మేరకు ఈ సభ(అసెంబ్లీ) తీర్మానం చేసి.. కేంద్రానికి పంపించాలి" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించిన వ్యక్తిగా మాజీ ప్రధానిని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా మన్మోహన్ పాలనా కాలంలో తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టం గురించి చాలా సేపు వివరించారు. దీనివల్ల గ్రామీణులకు ఉపాధి లభించి.. మూడు పూటలా అన్నం తినగలుగుతున్నారని చెప్పారు. అదేవిధంగా ఆర్థిక సరళీకరణ విధానాలను తీసుకురావడం వల్లే.. నేడు అనేక సంస్థలు.. విదేశాల నుంచి మన దేశానికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నాయని, దీనివల్ల ప్రభుత్వాలకు ఆదాయం.. నిరుద్యోగుల కు ఉద్యోగాలు, అనేక వర్గాలకు ఉపాధి కూడా లభిస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. "ప్రధానిగా మన్మో హన్ ఆనాడు తీసుకున్న నిర్ణయాలు ఏ ప్రభుత్వమైనా పాటిస్తోంది. పాటించేలా ఆయన వ్యవహరించారు." అని రేవంత్ చెప్పుకొచ్చారు. ఆయన స్మృతికి చిహ్నంగా 'భారత రత్న' ఒక్కటే సరితూగగల పురస్కారమని వెల్లడించారు.

# రాష్ట్రాభివృద్ధికి మైక్రోసాఫ్ట్ చేయూత

- రేవంత్ రెడ్డికి గుడ్‌న్యూస్ చెప్పిన సత్య నాదెళ్ల
- హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ 10,000 మందికి ఉపాధి,ఉద్యోగ అవకాశాలు
- నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడి హైదరాబాద్ ప్రపంచంలోని టాప్ 50 సిటీ
- ఆకాంక్ష వ్యక్తం చేసిన మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ సత్యనాదెళ్ల



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో భాగస్వా మిగా ఉండాలనే తమ నిబద్ధతను కొనసాగి స్తామని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సత్య నాదెళ్ల తెలిపారు. హైదరాబాద్‌లోని సత్య నాదెళ్ల నివాసంలో ఆయనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం భేటీ అయింది. ఈ సందర్భంగా నైపుణ్యాభి వృద్ధి, భవిష్యత్ అవసరాలకు తగినట్లు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతను సత్య నాదెళ్ల ప్రశంసించారు. నైపుణాభివృద్ధి, మెరుగైన మౌలిక వసతులే ఆర్థికాభివృద్ధికి దోహదపడి హైదరాబాద్‌ను ప్రపంచంలోని టాప్ 50 నగరాల్లో ఉంచగలవని సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని తొలి సాంకేతిక సంస్థల్లో మైక్రోసాఫ్ట్ ఒకటని, ప్రస్తుతం 10,000 మందికి ఉపాధి కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్య నాదెళ్లకు తెలిపారు. రాష్ట్రంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ లోనూ మైక్రోసాఫ్ట్ పెట్టుబడి పెట్టిందని, హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెంచుతూ పోతున్నందుకు సత్య

## నిరుద్యోగుల కోసం సర్కార్ శుభవార్త

- ముఖ్యమంత్రి రేవంత్ న్యూఇయర్ కానుక
- విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ప్రైవేటు జాబ్స్
- యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లు..ఉద్యోగాల లభ్యం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

నూతన సంవత్సరం వేళ నిరుద్యోగు లకు ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి గుడ్న్యూస్ చెప్పారు. రాష్ట్రం లో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామ ని ఇప్పటికే ప్రభుత్వం చెప్పింది. చెప్పినట్లుగానే ఆ దిశగా ప్రణాళిక లు రచిస్తున్నది. ఇందులో భాగంగానే.. రాష్ట్ర పరిశ్రమల శాఖ

## తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారుల బదిలీ

- 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన అధికారుల బదిలీ
- కామారెడ్డి ఏఎస్పీగా చైతన్యరెడ్డి నియామకం
- జనగామ ఏఎస్పీగా నియమితులైన చేతన్ నితిన్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన అధికారులను బదిలీ చేసింది. ఉట్నూరు ఏఎస్పీగా కాజల్, ఆసిఫాబాద్ ఏఎస్పీగా ఎస్. చిత్తరంజన్ నియమితులయ్యారు.కామారెడ్డి ఏఎస్పీగా చైతన్యరెడ్డి, జనగామ ఏఎస్పీగా చేతన్ నితిన్, భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత కుమార్ సింగ్, కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా శుభం ప్రకాశ్, నిర్మల్ ఏఎస్పీగా రాజేష్ మీనా, దేవరకొండ ఏఎస్పీగా మౌనిక, భువనగిరి ఏఎస్పీగా రాహుల్ రెడ్డి నియమితులయ్యారు.

## బనకచర్ల ప్రాజెక్టు

# రాష్ట్రానికి గేమ్ చేంజర్

- నీటిలభ్యతను బట్టి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్కు రోజుకు కనీసం 2 టీఎంసీలు తీసుకెళ్లేలా చర్యలు
- బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసందానం పూర్తయినట్లే
- బనకచర్ల ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తి
- రాష్ట్రంలో అదనపు ఆయకట్టు అందుబాటులోకి: ఏపీ సీఎం వెల్లడి




**అమరావతి-నవభూమిబ్యూరో:** తెలుగు రాష్ట్రా ల్లో 90శాతం ప్రాజెక్టులు తెదేపా హయాంలో చేపట్టినవేనని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. దాదాపు అన్ని ప్రాజెక్టులు తెదేపా అధికారంలో ఉన్నప్పుడే. చేపట్టామన్నారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో తెలుగు గంగ ప్రాజెక్టుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో శ్రీశైలం నుంచి కెనాల్ ద్వారా తెలుగుగంగకు నీళ్లు ఇవ్వడానికి ఎన్టీఆర్ సిద్ధమని చెప్పారన్నారు. అలా రాయలసీమకు

## తెలుగు మీడియంలో చదివితే 5% రిజర్వేషన్?

- తెలుగురాష్ట్రాల్లో సైతం తెలుగు భాషపై తగ్గుతున్న మమకారం
- తెలుగు భాషను ప్రోత్సహించేందుకు తెలుగుమీడియం విద్యార్థులకు ఉద్యోగాల్లో 5% రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ తీర్మానం..రాష్ట్ర ప్రభుత్వాలకు పంపే యోచన
- ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహా సభ నిర్ణయం

**విజయవాడ-నవభూమిబ్యూరో:** తెలుగు రాష్ట్రాల్లో సైతం తెలుగు భాషపై మమకారం తగ్గిపోతున్న వేళ, ఆంగ్ల మాధ్యమం చదివితే కానీ ఉద్యోగాలు రావని విద్యార్థులు, వారి తల్లితండ్రులు భావిస్తున్న వేళ విజయవాడలో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహా




## ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరుగుదల



**అమరావతి-నవభూమిబ్యూరో**

వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెరుగుతాయని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఏయే ప్రాంతాల్లో ఎంతెంత పెంచాలి. ఎక్కడ తగ్గించాలి.. అనే అంశాలపై పూర్తి నివేదికను జనవరి 15లోగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖపై తాడేపల్లి ఐజీ కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు."గత ప్రభుత్వం చేసిన విచ్చలవిడి అప్పుల భారం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే రాష్ట్రానికి రెవెన్యూ కూడా అవసరం. ఈ నేపథ్యంలోనే రిజిస్ట్రేషన్ విలువలు పెంచాలని నిర్ణయించాం. అయితే ఎక్కడెక్కడ గ్రోత్ కారిడార్లు ఉన్నాయో. ఎక్కడ భూమి రేట్లు బాగా ఎ పెరిగాయో అక్కడ మాత్రమే రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతాం. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువల పెంపును శాస్త్రీయ పద్ధతిలో చేయలేదు. దీంతో చాలా చోట్ల భూమి విలువ కంటే రిజిస్ట్రేషన్ విలువ అధికంగా ఉన్నట్లు గుర్తించాం. వాటిని సరిచేస్తున్నాం. అలాంటి చోట్ల రిజిస్ట్రేషన్ విలువను తగ్గిస్తాం భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెరిగే చోట సగటున 15 శాతం నుంచి 20 శాతం వరకు పెంపుదల ఉంటుంది" అని తెలిపారు.

# ఉగాది నుంచి ఉచిత బస్సు

- మహిళలకు శుభవార్త చెప్పిన ఏపీ సీఎం చంద్రబాబు
- ఏపీలో కూటమి సర్కార్ సూపర్-6లో భాగంగా హామీని అమలు
- రవాణాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డితో సీఎం చంద్రబాబు
- నేడో రేపో ఉచిత బస్సుపై సర్కార్ ప్రకటన చేసే అవకాశం



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీల్లో కీలకమైన మహిళలకు ఉచి త బస్సు ప్రయాణం హామీ మాత్రం ఇప్పటివర కూ అమలు కాలేదు. దీనిపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి వచ్చా రు. ఆ వివరాలను మరోసారి సీఎం చంద్రబా బుతో అధికారులు చర్చించారు. ఇందులో ఎప్పటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కల్పించాలన్న దానిపై ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. ఏపీలో కూటమి సర్కార్ సూపర్-6లో భాగంగా మరో హామీని అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ అంశంపై ఉన్నతాధికారులు, రవాణా శాఖ మంత్రి మండి పల్లి రామ్ ప్రసాద్ రెడ్డితో సీఎం చంద్రబాబు చర్చించారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పథకంలో మరికొ న్ని అంశాలపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే స మహిళల ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు సాధ్యాసాధ్యాలపై పలుమార్లు చర్చలు నిర్వహించిన సీఎం చంద్రబాబు అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. అయితే ఈ పథకం అమలు చేస్తున్న కర్నాటక, తెలంగాణ, ఢిల్లీలో అమలు విధానంపై పలు అనుమానాలు ఉండటంతో వాటిని నివృత్తి చేసుకుని రావాలని సీఎం చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. అయితే ఉగాది నుంచి అమలుకు మాత్రం సిద్ధం కావాలని చంద్రబాబు ఇవాళ అధికారు లకు తేల్చిచెప్పేశారు. దీంతో అధికారులు ఆ లోపు ఇతర రాష్ట్రాల రిపోర్టు తీసుకుని చంద్రబాబుకు అందించనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం దీనిపై ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల సంఖ్య తక్కువగానే ఉంది. గతంలో వైసీపీ అమలు చేసిన పలు పథకాలకు కూటమి సర్కార్ ఇప్పటికే మంగళం పాడేసింది. ఈ నేపథ్యంలో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు పెద్దగా ఇబ్బందులు ఉండ కపోవచ్చని భావిస్తోంది. ఉగాది నుంచి ఈ పథకం అమలుకు సిద్ధం కావాలని అధికారు లకు సీఎం ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

## రాజమండ్రిలో రేవ్ పార్టీ

**20మంది యువతీ యువకులు అరెస్టు**



**రాజమండ్రి-నవభూమిబ్యూరో**

ప్రశాంతంగా ఉండే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రేవ్ పార్టీ కలకలం రేపింది. తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమండ్రిలో రేవ్ పార్టీ జరుగుతుందన్న సమాచారం రావడంతో పోలీసులు రైడ్ చేశారు. దాదాపు 20 మందికి పైగా యువతీ యువకుల్ని అదుపులోకి తీసుకు న్నారు. అసలు నగరంలో రేవ్ పార్టీ ఎవరు నిర్వహించారు, ఎవరు అనుమతి ఇచ్చారు, ఇందులో ఏమేం వాడారన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో ఈ మధ్య కాలంలో వరుసగా రేవ్ పార్టీలు జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్న నేపథ్యంలో రాజమండ్రి రేవ్ పార్టీ

## జనసేనలో చేరిన వైసీపీ కీలక నేతలు

**మంగళగిరి-నవభూమిప్రతినిధి**


వైసీపీకి వరుస షాకుల మీద షాకులు తగులుతున్నాయి.గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన దగ్గర నుంచి ఆ పార్టీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. వైసీపీని వరుస కష్టాలు వెంటాడుతున్నాయి. కొందరు వైసీపీ నేతలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తుండగా, మరి కొందరు నేతలు వైసీపీలో ఉంటే రాజకీయ భవిష్యత్తు ఉండదని భావించి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేస్తున్నారు. కిలారు రోశయ్య, మద్దాలి గిరి, సిద్దా రాఘవరావు, మాజీ మంత్రి ఆళ్ల నాని , బాలినేని, సామినేని ఉదయభాను గ్రంధి శ్రీనివాస్, అవంతి శ్రీనివాస్ వంటి నేతలు వైసీపీకి రాజీనామా చేశారు.





# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లారా..! డబ్బుల కోసం ఆ పని చేయకండి: సజ్జనార్

**హైదరాబాద్-నవభూమి:** ప్రస్తుతం అంతా సోషల్ మీడియా యుగం. కొందరు తమ టాలెంట్‌తో సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించుకుంటున్నారు. కొత్త తరహా వీడియోలు, కంటెంట్‌తో ఫ్యాన్స్ సంపాదించుకుంటున్నారు. ఆ తర్వాత కాసుల కోసం ఫెయిడ్ ప్రమోషన్స్ చేస్తున్నారు. కొన్ని బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్, గేమ్స్ వంటి వాటికి ప్రమోషన్స్ చేస్తున్నారు. తాము గంటలో ఇన్ని వేలు సంపాదించామని.. రోజుకు లక్షల్లో ఆదాయం వస్తుందని బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నారు. వాటిని నమ్మి చాలా మంది నట్టేట మునుగుతున్నారు. ఇంకొందరైతే ప్రాణాలు సైతం తీసుకుంటున్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు వీడియోల్లో చెప్పిందంతా నిజమని గుడ్డిగా నమ్మి సర్వం కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్.. కీలక సూచనలు చేశారు. మీ స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం సరికాదని అన్నారు. మీ మాటలు నమ్మి చాలా మంది తమ బంగారు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారని.. కాసుల కోసం కక్కుర్తి పడి ఇటువంటి యాప్స్ ప్రమోట్ చేయటం సరైంది కాదని ట్వీట్ చేశారు. 'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లరా!! కాసులకి కక్కుర్తి పడి ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్న బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేయకండి. రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని.. మీరు సోషల్ మీడియాలో వదిలే ఇలాంటి వీడియోల వల్ల అమాయకులు ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి వ్యసనపరులు అవుతున్నారు. బంగారు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. మీ స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం ఎంత వరకు సమంజసం!? సమాజ క్షేమం పట్టని మీ పెడధోరణులు క్షమించరానివి. కష్టపడకుండానే కాసులు పోగేసుకోవాలన్న ఆలోచన అనర్థదాయకమైనదని యువత గుర్తించాలి.



# తెలంగాణ పోలీస్ కొత్త లోగో విడుదల.. పాత దానికి, కొత్త దానికి తేడా ఏంటంటే..?



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. తెలంగాణలో గతంలో ఉన్న అధికారిక పేర్లలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు తెలంగాణ ప్రభుత్వం పోలీస్ లోగోలో మార్పులు చేసింది. ఈ మేరకు కొత్త లోగోను పోలీస్ ట్వీట్ చేసింది. గతంలో తెలంగాణ స్టేట్ పోలీస్ అని ఉండగా ఇప్పుడు తెలంగాణ పోలీస్ అని మార్చింది. లోగో నుంచి స్టేట్ అనే పదాన్ని తొలగించింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా అధికారం సాధించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే తనదైన పాలన సాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకుందని రేవంత్ విమర్శించారు. చివరకు రాష్ట్ర పేరను కూడా మార్చేశారని ఫైరయ్యారు. ఉద్దేశపూర్వకంగా పేరు కలిసేలా %టూ% అనే పేరు పెట్టారని ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర అధికారిక పేరుగా ఉన్న తెలంగాణ స్టేట్‌ను కేవలం తెలంగాణగా మారుస్తూ రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఉన్న స్థానంలో పేరును తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు ఉద్యమ సమయంలో ఉన్న పేరును తిరిగి ఏర్పాటు తీసుకొచ్చారు. ప్రభుత్వ సంస్థలకు పేరును చేర్చారు. ప్రభుత్వ కార్యాలయాలు తమ శాఖలకు ముందు ఉన్న టీఎస్ పేరును తొలగించి, టీజీగా మార్పులు చేశారు. వాహన రిజిస్ట్రేషన్లను కూడా టీజీ పేరుతో చేస్తున్నారు. కొత్తగా వాహనాలు రిజిస్ట్రేషన్ టీజీ పేరుతోనూ చేయాల్సి ఉంటుందని ఆదేశాలు ఇచ్చారు. ఇష్టమైతే పాత వాహనాలు కూడా టీజీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు తెలంగాణ పోలీస్ శాఖ కొత్త లోగోను డిజైన్ చేసింది. ఈ మేరకు పోలీస్ శాఖ లోగోను విడుదలచేసింది. తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ ట్విట్టర్ ఖాతాలో న్యూ లోగోను పోస్ట్ చేసింది. గత లోగోలో ఉన్న తెలంగాణ స్టేట్ పోలీస్ తొలగించి.. తెలంగాణ పోలీస్ అనే పేరుతో కొత్త లోగోను డిజైన్ చేశారు. గత లోగోలో కేవలం స్టేట్ అనే పదాన్ని తొలగించి కొత్త చిహ్నాన్ని ఆవిష్కరించింది. ఆ ఒక్క మార్పు మినహా.. గతంలో ఉన్న లోగోనే విడుదల చేసింది. ఇక నుంచి పోలీస్ శాఖ అధికారిక చిహ్నం తెలంగాణ స్టేట్ పోలీస్ నుంచి తెలంగాణ పోలీస్ గా మారిందని పోలీసు శాఖ వెల్లడించింది.

# లేడీ కానిస్టేబుల్‌తో ఎస్సై వివాహేతర సంబంధం.. షాకింగ్ నిర్ణయం తీసుకున్న ఎస్సై భార్య..!



**హైదరాబాద్-నవభూమి:** ప్రభుత్వ పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తుంటే కొందరు పోలీసులు తమ తీరుతో డిపార్ట్‌మెంట్ పరువు తీసుతున్నారు. తాజాగా నల్గొండ పట్టణంలో ఓ ఎస్సై లేడీ కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. పెళ్లై భార్య, పిల్లలు ఉన్నా.. కానిస్టేబుల్‌తో కాపురం పెట్టాడు. విషయం తెలుసుకున్న భార్య నల్గొండ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగింది. తమపై హత్యాయత్నానికి ప్రయత్నించాడని.. కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని నిరసన చేపట్టింది. తెలంగాణ పోలీసులు దేశంలోనే ది బెస్ట్ అని ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలతో మమేకమై నేరాల కట్టడికి కృషి చేస్తున్నట్లు వెల్లడిస్తోంది. కొత్త రాష్ట్రంలో పోలీసు వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని.. తెలంగాణ పోలీసులు పక్క రాష్ట్రాల వారికి ఆదర్శనంగా నిలుస్తున్నారని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. అయితే కొందరు పోలీసుల తీరుతో పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రతిష్ఠ మసకబారుతోంది. కంచె చేను మేసింది అన్న చందంగా.. నేరాలను అదుపు చేయాల్సిన పోలీసులు వక్రబుద్ధితో తప్పటడుగులు వేస్తున్నారు. ఇల్లీగల్ దందాలు, అక్రమ సంబంధాలతో డిపార్ట్‌మెంట్ పరువు బజారుకీడుస్తున్నారు. ఇటీవల వాజేడు ఎస్సై హరీష్ హనీ ట్రాప్‌లో చిక్కుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అన్నీ తెలిసిన ఎస్సై హరీష్.. ఓ అమ్మాయి వలలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఓ మహిళ వలలో చిక్కుకున్న మెదక్ జిల్లాకు చెందిన సాయిరామ్ అనే హెడ్ కానిస్టేబుల్ పరువు పోతుందని భయపడి ఆదివారం (డిసెంబర్ 29) ఉదయం చెట్టుకు ఉరేసుకొని ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా.. నల్గొండ జిల్లాలో ఓ ఎస్సై తప్పటడుగులు వేశాడు. అప్పటికే పెళ్లై భార్య ఇద్దరు పిల్లలు ఉన్నా.. ఓ లేడీ కానిస్టేబుల్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఆమెతోనే ఉంటూ భార్యకు నరకం చూపిస్తున్నాడు. దీంతో బాధితారులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయటంతో పాటుగా.. నల్గొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగింది. వివరాల్లోకి వెళితే.. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన జాల మహేందర్ టాస్క్‌ఫోర్స్ ఎస్సైగా జిల్లాలోనే విధులు నిర్వహిస్తున్నాడు. మహేందర్‌కు గతంలోనే జ్యోతి అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. సాఫీగా సాగుతున్న సంసారంలోకి ఓ లేడీ కానిస్టేబుల్ ఎంటరైంది. నల్గొండ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓ యువతితో ఎస్సైకి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో భార్యకు తెలియకుండా ఆమెతో కాపురం కూడా పెట్టాడు. లేడీ కానిస్టేబుల్‌కు సైతం గతంలోనే పెళ్లై ముగ్గురు పిల్లలు ఉండగా వారికి దూరంగా ఉంటూ ఎస్సైతో సంబంధం పెట్టుకుంది. చాలా కాలం తర్వాత.. జ్యోతికి విషయం తెలిసింది. దీంతో భర్త, సదరు లేడీ కానిస్టేబుల్‌ను ఆమె నిలదీసింది. దీంతో ఎస్సై మహేందర్ కాళ్లబేరానికి వచ్చాడు. తాను అనుకోని పరిస్థితుల్లో ఈ ఉచ్చులో చిక్కుకున్నానని.. భార్యను నమ్మించే ప్రయత్నం చేశాడు. భార్య జ్యోతి వినిపించుకోకపోటవంతో చంపేస్తానంటూ బెదిరించాడు. లేడీ కానిస్టేబుల్ సైతం జ్యోతిని బెదిరింపులకు గురి చేసింది. దీంతో వారి నుంచి ప్రాణహాని ఉందని జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే సమయంలో షాకింగ్ నిర్ణయం తీసుకుంది. తనను వాళ్లు ఎలాగూ చంపేస్తారని.. అంతకు ముందే తామే చనిపోతామని చెప్పింది. ఈ మేరకు కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని జిల్లా పోలీసులను కోరింది. ఈ మేరకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసనకు దిగింది. తనను మోసం చేసిన భర్త మహేందర్, లేడీ కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కుటుంబంతో కలిసి ఆందోళనకు దిగింది. ఈ వ్యవహారం ప్రస్తుతం నల్గొండ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హాట్ టాఫిక్‌గా మారింది.

# నేనే నిజమైన పుష్ప.. ఎర్రచందనం ఎగుమతి చేశా.. బీజేపీ ఎమ్మెల్యే సంచలనం



**హైదరాబాద్-నవభూమి:** పుష్ప-2 సినిమా దేశమంతా సత్తా చాటుతుంటే.. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోవటంతో హీరో అల్లు అర్జున్ మాత్రం ఇంటికే పరిమితమయ్యారు. అయితే.. ఈ సినిమాలో పుష్పరాజ్ ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే ఓ స్మగ్లర్‌గా కనిపిస్తాడు. అయితే.. అల్లు అర్జున్ కేవలం రీల్ పుష్ప అని.. తాను మాత్రం రియల్ పుష్ప అంటూ తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేసిన కామెంట్లు ఇప్పుడు సర్వత్రా సంచలనంగా మారింది.

**పైడి రాకేష్ రెడ్డి**

పుష్ప-2 సినిమా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కలెక్షన్ల వర్షంతో బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. ఇక్కడా అక్కడా అని కాదు.. అన్ని చోట్లా పుష్ప-2 అస్సలు తగ్గేదేలే అంటూ దూసుకెళ్తోంది. "పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా ఇంటర్నేషనల్" అంటూ.. ఇండియాలోనే కాకుండా విదేశాల్లోనూ దుమ్ములేపుతోంది. అయితే.. ఇంత సత్తా చాటిన పుష్ప-2 హీరో అల్లు అర్జున్‌కు సినిమా విజయాన్ని ఆస్వాధించే అవకాశం లేకుండాపోయింది. ప్రీమియర్ రోజు జరిగిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనతో కేసులు, అరెస్టు, బెయిల్, నోటీసులు, విచారణలంటూ బన్నీ.. విజయోత్సవాలకు పూర్తిగా దూరమయ్యారు. ఇదే విషయం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు కూడా సృష్టించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు చేయటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సోమవారం (డిసెంబర్ 30న) హైదరాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అల్లు అర్జున్ రీల్ పుష్ప మాత్రమేనని.. తానే రియల్ పుష్ప.. అంటూ బీజేపీ ఎమ్మెల్యే ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తాను లీగల్‌గా ఎర్రచందనం ఎగుమతి చేసినట్లు రాకేష్ రెడ్డి తెలిపారు. ఎర్రచందనం అమ్మినోడు.. కొన్నవాడు కూడా పుష్పనే అంటూ వ్యాఖ్యానించారు.

మరోవైపు.. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికపై కూడా రాకేష్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సంక్రాంతి పండగ తరువాత తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు రానున్నట్టు తెలిపారు. అయితే.. బాహుబలి-1లో అధ్యక్షుడికి మూడు ఏళ్లు సమయం ఇస్తామన్నారు. బాహుబలి పార్ట్-1లో మంచిగా పని చేస్తేనే బాహుబలి పార్ట్-2 లోకి తీసుకుంటామంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. బాహుబలి పార్ట్-1లో ఆశించినట్టుగా పనిచేయకపోతే బాహుబలి పార్ట్-2 లో అధ్యక్షున్ని మార్చేస్తామంటూ కీలక వ్యాఖ్యలు. మరోవైపు.. నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు ఎన్నికల సమయంలో తనను ఇంఛార్జ్‌గా నియమించాలని అడుగుతున్నట్లు రాకేష్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఆ 3 జిల్లాల్లో 18 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తానని రాకేష్ రెడ్డి తెలిపారు. మరోవైపు.. అల్లు అర్జున్ కేసు విషయంలో రేవంత్ రెడ్డి సర్కారుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటనలో రేవంత్ రెడ్డి అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు. అల్లు అర్జున్‌కు రేవంత్ రెడ్డికి ఎక్కడో చెడిందని.. అందులో ఇంత రాద్ధాంతం చేశారన్నారు. పుష్ప-2 కలెక్షన్లలో రేవంత్ రెడ్డికి 14 వాటా ముట్టిందన్న అనుమానం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేయటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇదే సమయంలో రాకేష్ రెడ్డి.. తానే రియల్ పుష్ప అంటూ కామెంట్స్ చేయటం మరోసారి ఆస్తకిర చర్చ నడుస్తోంది.

# కేసీఆర్ కాస్త రెస్ట్ తీసుకుంటున్నారు.. ఎప్పుడు బయటకు రావాలో ఆయనకు బాగా తెలుసు: కేటీఆర్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ అసెంబ్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాప తీర్మానం ప్రవేశ పెట్టిన సందర్భంగా సమావేశాలకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. అనంతరం మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా.. కేటీఆర్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 24 ఏళ్లు కష్టపడ్డారని.. ప్రస్తుతం రెస్ట్ తీసుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఎప్పుడు బయటకు రావాలో కేసీఆర్‌కు బాగా తెలుసంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 24 ఏళ్ల పాటు కష్టపడ్డారని.. ప్రస్తుతం కాస్త రెస్ట్ తీసుకుంటున్నారని.. ఎప్పుడు బయటకు రావాలో ఆయనకు బాగా తెలుసంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి హాజరైన కేటీఆర్.. మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతుందోదని కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీలో పీవీ నరసింహ రావుకు మెమోరియల్ కట్టాలని అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయరని ప్రశ్నించారు. మరణంలో కూడా పీవీని కాంగ్రెస్ గౌరవించలేదని ఆరోపించారు. పీవీకి గౌరవం దక్కేవరకు రాజ్యసభలో బీఆర్ఎస్ కొట్లాడుతుందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీలు రక్షణ కవచంగా మారారని కేటీఆర్ ఆరోపించారు. అమృత్, సివిల్ సప్లై స్కాంలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు విచారణ జరపదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఈడీ రైడ్స్ జరిగితే.. కేంద్రమే కాపాడుతుందంటూ కీలక ఆరోపణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కుంభకోణాలకు కేంద్ర ప్రభుత్వమే సహకరిస్తుందన్నారు. 2025లో బీఆర్ఎస్ అధ్యక్షుడి ఎన్నికతో పాటు సంస్థాగతంగా కమిటీలు వేస్తామని తెలిపిన కేటీఆర్.. లోకల్ బాడీస్‌లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అంతకుముందు.. అసెంబ్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలుపుతూ కేటీఆర్ ప్రసంగించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి బీఆర్ఎస్ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్టు ప్రకటించారు. మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలనే ప్రతిపాదనతో సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని తెలిపారు. గొప్ప ఆలోచనకు అరుదైన సందర్భం వచ్చినప్పుడు ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ ఏర్పడిందని గుర్తుచేశారు. కేంద్రంలో ఓబీసీ శాఖను ఏర్పాటు చేయాలని మన్మోహన్ సింగ్‌ను కేసీఆర్ కోరారని తెలిపారు. మన్మోహన్ సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని మొదటిసారిగా గుర్తించింది తెలంగాణ బిడ్డ పీవీ నరసింహా రావు అనేది నిర్వివాదాంశమని కేటీఆర్ చెప్పుకొచ్చారు. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఎన్నికైన తర్వాత లాటరీ ఎంట్రీ ద్వారా రాజకీయాలతో సంబంధంలేని ఒక ఆర్థిక వేత్తను ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారన్నారు. కేవలం 15 రోజులు ఫారెక్స్ నిల్వలు ఉన్న నాటి రోజు నుంచి.. ప్రపంచమంతా ఆశ్చర్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థిక సంస్కరణల శీలి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా.. సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్ సింగ్ తన ప్రయాణాన్ని కొనసాగించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలోనే కేసీఆర్.. ఏడాదిన్నర పాటు కేంద్ర మంత్రిగా పనిచేసినట్టుగా కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ ఆయనకు అర్థమయ్యాయి కాబట్టే అనివార్య పరిస్థితుల్లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడిందని.. దాన్ని తాము మర్చిపోమని చెప్పుకొచ్చారు. ఎన్నో అడ్డంకులు, ఎన్నో అభ్యంతరాలున్నా మన్మోహన్ సింగ్ మాత్రం ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడ్డారని కేటీఆర్ గుర్తుచేశారు. ఎన్నడూ కూడా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదన్నారు. మన్మోహన్ సింగ్‌ను సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడ్రన్ ఇండియా అని పిలువొచ్చన్నారు. అవమానం చేస్తే ఆకాశం స్థాయి తగ్గదని.. ఎన్ని నిందలు వేసినా మహోన్నతులు వణకరు, బెనకరని.. అలాంటి స్థితప్రజ్ఞతను మన్మోహన్ సింగ్‌లో చూశామని కేటీఆర్ కొనియాడారు.

# బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి గేమ్ చేంజర్

(1వపేజీ తరువాయి)తెలుగుగంగ నీళ్లు తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.

"వెలిగొండ, తోటపల్లి ప్రాజెక్టులు నేనే ప్రారంభించాను. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి కొరత, వర్ష పాతం ఎక్కువ. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కరవు వల్ల సాగు దెబ్బతింటోంది. నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమను రత్నాలసీమగా చేయవచ్చు. గతంలో అనంతపురంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉండేది. ఉద్యాన పంటలతో ఆ జిల్లాలో తలసరి ఆదాయం 4-5 శాతానికి చేరింది. పట్టిసీమ చేపట్టిన తర్వాత సరైన సమయానికి పంటలు చేతికి అందే పరిస్థితి వచ్చింది. కృష్ణాలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో నీటి ప్రవాహం ఉంది. కృష్ణానది నుంచి 2,989 టీఎంసీల వరద ప్రవాహం సముద్రంలోకి వెళ్తాంది. నదుల అనుసంధానంతో కరవు, వరద పరిస్థితులు ఎదుర్కోవచ్చు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి నుంచి కృష్ణాకు కనీసం 200 టీఎంసీలు, తీసుకురావాలి.

**బనకచర్ల గేమ్ చేంజర్**

నీటిలభ్యతను బట్టి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్కు రోజుకు కనీసం 2 టీఎంసీలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం గోదావరి బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి 'గేమ్ చేంజర్' అవుతుంది. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లే ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుంది.

రాష్ట్రంలో అదనపు ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. గోదావరి- బనకచర్ల పూర్తయితే తెలుగుతల్లికి జలహారతి ఇచ్చినట్లే. ఈ ఏడాది 4,114 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్లాయి. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం రిజర్వాయర్లలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి 1 నాటికి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండటం రికార్డు. ఖరీఫ్ పంటలకు ముందస్తుగా నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. వరదలు, తుపానుల కంటే ముందుగా పంట చేతికి వచ్చే వీలుంది" అని చంద్రబాబు తెలిపారు.

**మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు**

మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టాం. పోలవరం నుంచి కృష్ణా నదికి నీరు మళ్లించడం మొదటి దశ రెండో దశలో బొల్లాపల్లి జలాశయం నిర్మించి నీళ్లు తరలిస్తాం. మూడోదశలో బొల్లాపల్లి నుంచి బనకచర్లకు నీటిని మళ్లిస్తాం. రాయలసీమకు బనకచర్ల గేట్వే కానుంది. ఈ ప్రాజెక్టుతో సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేస్తే రాష్ట్రానికి ఎంతో ఆదాయం వస్తుంది. డబ్బుంటే 3 ఏళ్లలో గోదావరి -బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయొచ్చు. ఇది దేశంలోనే అతి పెద్ద సాగునీటి మౌలిక వసతి అవుతుంది. ప్రధాని మోదీకి ఈ ప్రాజెక్టు నివేదిక పంపిస్తున్నాం. ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రితో మాట్లాడాం కేంద్రమే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని భరించలేదు. హైబ్రిడ్ మోడల్ నిధుల సమీకరణకు ఆలోచిస్తున్నాం.

**7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు**

గోదావరి-బనకచర్లతో 80 లక్షల మందికి తాగునీరు అందుతుంది. 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు 48వేల ఎకరాల భూసేకరణ అవసరం. ఇది చరిత్రను తిరగరాయబోయే ప్రాజెక్టు. చాలా సీరియస్ గా తీసుకున్నాం గోదావరి- బనకచర్లతో బావితరాలకు నీటి సమస్య ఉండదు. ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో కూడా చర్చ జరగాలి.

## ఏపీ పంట పండింది... మరో వరం ప్రకటించిన నరేంద్రమోడీ

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

కేంద్రంలో, రాష్ట్రంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వాలే ఉండటంతో అభివృద్ధి సజావుగా జరుగుతుందని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పలు పథకాలకు సంబంధించి ఏపీని ఎంపిక చేయడంతోపాటు వివిధ పనులకు సంబంధించిన నిధులను కూడా శరవేగంగా విడుదల చేస్తోంది. అలాగే రైల్వేలకు సంబంధించి కూడా ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తోంది. ఇందులో భాగంగా అమరావతి రైల్వే లైను పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు రైల్వే ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న వందేభారత్ స్లీపర్ రైలును ఏపీకి కేటాయించబోతున్నారు. విశాఖకు స్లీపర్ రావాలంటే 6 నెలల సమయం విశాఖపట్నం నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు నడిపించాలంటూ ప్రభుత్వం నుంచి కేంద్రానికి వినతులు వెళ్లాయి.

# నింగికి దూసుకెళ్లిన పీఎస్ఎల్వీ సీ60

(1వపేజీ తరువాయి)మరోవైపు ఎస్ఎల్వీ సీ 60 ప్రయోగం విజయవంతం కావడం.. టార్గెట్, చేజర్ ఉపగ్రహాలను కక్ష్యలో వాహక నౌక ప్రవేశపెట్టడంతో.. షార్‌లో సంబరాలు మిన్నంటాయి.

పీఎస్ఎల్వీ సీ 60 రాకెట్ బరువు 229 టన్నులు, ఎత్తు 44.5 కిలోలు. 440 కిలోల బరువు ఉండే ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలతో పాటు, 24 బుల్లి ఉపగ్రహాలని నింగిలోకి పీఎస్ఎల్వీసీ - 60 రాకెట్ చేర్చనుంది. ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలు రెండేళ్ల పాటు సేవలు అందించనున్నాయి. డాకింగ్ సంక్లిష్ట సాంకేతిక పరిజ్ఞానంతో రోధసీలో ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలని అనుసంధానం చేసేలా శాస్త్రవేత్తలు వీటిని డిజైన్ చేశారు. అనుసంధానం అనంతరం విడిపోయి భూపరిశీలన, సహజ వనరుల పర్యవేక్షణ, పచ్చదనం, రోదసీలో రేడియో ధార్మికతపై అధ్యయనం చేయనున్నాయి. అలాగే మానవ సహిత ప్రయోగాలకు డేటాను ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలు అందివ్వనున్నాయి. ఈ రాకెట్ ప్రయోగంతో అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి ఇస్రో తొలి అడుగు వేసినట్లు అవుతుంది.

# రాష్ట్రాభివృద్ధికి మైక్రోసాఫ్ట్ చేయూత

(1వపేజీ తరువాయి)నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ డొమైన్‌లో ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా నిలిపివేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారిస్తున్న ఏఐ, Gen AI, క్లౌడ్‌తో సహా వివిధ సాంకేతిక అవసరాలకు అనుగుణమైన వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు మైక్రోసాఫ్ట్ మద్దతుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సత్య నాదెళ్లకు విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఫ్యూచర్ సిటీ, కొత్త మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల అభివృద్ధి, రాష్ట్రంలో మౌలిక వసతులు కల్పనకు అమలు చేస్తున్న ప్రణాళికలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా పరిశ్రమ లకు అవసరమైన ప్రతిభావంతులను అందుబా టులో ఉంచేందుకు తాము చేస్తున్న కృషిని సత్య నాదెళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరిం చారు. సమావేశంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగుల కోసం సర్కార్ శుభవార్త

(1వపేజీ తరువాయి)ఆధ్వర్యంలో ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ కొత్తగా ఏఐ ఆధారిత డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నిరుద్యోగులకు, సదరు కంపెనీలకు మధ్య వారధిగా డీఈఈటీని రాష్ట్ర సర్కార్ సిద్ధం చేసింది. నిరుద్యోగ యువతకు ఉన్న నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ ప్రత్యేక డిజిటల్ ప్లాట్ఫాన్ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం యాప్‌ను తీసుకురానుంది.

# రాజమండ్రిలో రేవ్ పార్టీ

(1వపేజీ తరువాయి)కలకలం రేపుతోంది. రాజమండ్రిలోని కొరుకొండ జంక్షన్ బూరుగుపూడి వద్ద ఉన్న నాగసాయి ఫంక్షన్ హాల్లో ఈ రేవ్ పార్టీ నిర్వహించారు. ఇప్పటివరకూ రేవ్ పార్టీలు శివార్లలో ఉండే రిసార్ట్స్ లలోనే జరుగుతుండగా తొలిసారి ఈ రేవ్ పార్టీ మాత్రం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లోనే నిర్వహించారు. పెద్ద పెద్ద డీజే సౌండ్లతో, మద్యం తాగుతూ వీరు రేవ్ పార్టీ చేసుకుంటుండగా గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వెంటనే రంగంలోకి దిగారు. ఫంక్షన్ హాల్ కు చేరుకుని అక్కడ ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సమాచారం సేకరించేందుకు ప్రయతిస్తున్నారు. నగరంలోని ఎరువుల కంపెనీల యజమానులు ఈ పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. విషయం తెలియగానే స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఈ రేవ్ పార్టీపై దాడి చేశారు. ఇందులో అక్కడికక్కడే 13 మంది యువకులు, ఐదుగురు యువతులతో పాటు మరికొందరు బయటి వ్యక్తుల్ని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే మూడు కార్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. అయిత్ రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడలేదని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చెప్తున్నారు.. ఇందులో పాల్గొన్న వారు మద్యం మాత్రమే సేవించినట్లు తెలుస్తోంది. అయితే ఇంత బహిరంగంగా ఫంక్షన్ హాల్లోనే ఈ పార్టీ నిర్వహించడం వెనుక కారణాలపై ఆరా తీస్తున్నారు.

# జనసేనలో చేరిన వైసీపీ కీలక నేతలు

(1వపేజీ తరువాయి)మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య వంటి రాజ్యసభ సభ్యులు పదవితో పాటు వైసీపీకి రాజీనామా చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన కొందరు కీలక నేతలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో చేరారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ, ఆప్కో మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి వంటి నేతలు జనసేన గూటికి చేరారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో వీరు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువా వేసి జనసేనలోకి ఆహ్వానించారు పవన్ కల్యాణ్. కైకలూరు నియోజకవర్గానికి చెందిన జయమంగళ వెంకటరమణ ఈ మధ్యే వైసీపీకి రాజీనామా చేశారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన గంజి చిరంజీవి, శ్రీమతి రాధని కూడా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు పవన్ కల్యాణ్. గతంలో ఆయన టీడీపీలో పని చేశారు. 2019 ఎన్నికల ఫలితాల అనంతరం గంజి చిరంజీవి వైసీపీలో చేరారు. ఒకనొక దశలో గంజి చిరంజీవి మంగళగిరి నుంచి వైసీపీ తరుపున పోటీ చేస్తున్నారనే ప్రచారం జరిగింది. కానీ జగన్ మరొకరికి టికెట్ కేటాయించడం, పార్టీ ఓడిపోవడంతో ఆయన వైసీపీకి రాజీనామా చేశారు.

# న్యూ ఇయర్ వేడుకలు.. ఓఆర్ఆర్‌పై నో ఎంట్రీ

**హైదరాబాద్-నవభూమి:** కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్), పీవీఆర్ ఎక్స్‌ప్రెసవేపై వాహనాలను అనుమతించబోమని పోలీసులు వెల్లడించారు. విమాన ప్రయాణికులు మాత్రం టికెట్‌ను చూపించి, ఔటర్‌పై వెళ్లొచ్చని స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఇక హైదరాబాద్‌లోని బేగంపేట, లంగర్‌హౌస్ ఫ్లైఓవర్లు మినహా.. మిగతా వాటిని మూసివేస్తామని సిటీ పోలీసులు తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, మింట్‌కాంపౌండ్ రోడ్డు, అప్పర్ ట్యాంక్‌బండ్‌పైనా రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు వాహనాలకు అనుమతి ఉండదన్నారు.



## మహా కుంభమేళాకు.. రూ.7,500 కోట్లు



**హైదరాబాద్-నవభూమి:** పన్నెండేళ్లకోసారి జరిగే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. 45 రోజులపాటు ఉత్సవంలా సాగే ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరగనుంది. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మందికిపైగా వస్తారని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీన్ని ఘనంగా నిర్వహించేందుకు భారీ ప్రణాళికతో సిద్ధమవుతోంది. భద్రత విషయంలో రాజీ పడకుండా 50 వేల మంది సిబ్బందిని మోహరించనుంది. నిరంతర నిఘా కోసం తొలిసారిగా నీటిలోపల 100 మీటర్ల లోతులోని వస్తువులను సైతం గుర్తించే సామర్థ్యం కలిగిన అండర్ వాటర్ (జలాంతర) డ్రోన్లను ఉపయోగించనున్నారు. కుంభమేళా కోసం కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన 2,700 సీసీ కెమెరాలతో 24 గంటలూ రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించేలా అత్యాధునిక మల్టీ డిజాస్టర్ రెస్పాన్స్ వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు. మరోవైపు, 'నేత్ర కుంభ్' శిబిరం ద్వారా 5 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 3 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహా కుంభమేళాకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక అనుభూతిని అందించేందుకు యూపీ ప్రభుత్వం 2వేలకు పైగా డ్రోన్లతో భారీ డ్రోన్ షోను కూడా ఏర్పాటు చేస్తోంది. మరోవైపు, కుంభమేళా యాత్రికుల కోసం మరో 12 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. 2025 జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22 తేదీల్లో తిరుపతి- బనారస్ (07107), ఫిబ్రవరి 20, 10, 17, 24 తేదీల్లో బనారస్- విజయవాడ (07108) రైళ్లను నడుపనున్నారు. '

## మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి.. తమిళనాడు గవర్నర్‌కు నటుడు విజయ్ వినతి



**చెన్నై- నవభూమి:** తమిళనాడులో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని, శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్ర?భుత్వంపై ఉన్నదని టీవీకే పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తాము ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఆయన చెప్పారు. ఈ మేరకు తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవికి విజయ్ ఒక వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా తమిళనాడులో ఇటీవల తీవ్ర ప్రభావం చూపిన ఫెంగాల్ తుఫాను అంశాన్ని కూడా నటుడు విజయ్ తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ఫెంగాల్ తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్రంగా ప్రభావితమైన వారికి ఇప్పటికీ సరైన రిలీఫ్ అందలేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రిలీఫ్ ఫండ్‌ను రిలీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని నటుడు గవర్నర్‌ను కోరారు.

## 'మాపై లాఠీచార్జి జరిగినప్పుడు మీరెక్కడ?'.. ప్రశాంత్ కిషోర్‌ను నిలదీసిన అభ్యర్థులు



**పాట్నా-నవభూమి:** బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో రాజకీయ దుమారం చెలరేగింది. పాట్నాలోని గార్దానీబాగ్‌లో ఆదివారం సమావేశానికి పిలుపునిచ్చిన రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయవేత్తగా మారిన ప్రశాంత్ కిషోర్‌పై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. లాఠీచార్జి తర్వాత పరామర్శకు వచ్చిన ఆయనతో వారు వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో అక్కడి నుంచి వెళ్లిపోవడాన్ని నిలదీశారు. 'మీకు దుప్పట్లు ఇచ్చాను. నన్నే విమర్శిస్తున్నారు' అన్న ప్రశాంత్ కిషోర్‌పై అభ్యర్థులు మండిపట్టారు. 'మీరు మాకు దుప్పట్లు ఇచ్చారు. ఆ తర్వాత మీ వైఖరిని చూపించారు' అని విమర్శించారు. పోలీసుల లాఠీఛార్జి సమయంలో ప్రశాంత్ కిషోర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. 'ప్రశాంత్ కిషోర్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఆర్జేడీ కూడా ఆయన తీరును విమర్శించింది. కాగా, నిరసనకు తరలివచ్చిన అభ్యర్థులు వెళ్లిపోవాలని సూచించిన తర్వాతే తాను అక్కడి నుంచి వెళ్లినట్లు జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడైన ప్రశాంత్ కిషోర్ వివరించారు. తాను వెళ్లిన 45 నిమిషాల తర్వాత వారిపై లాఠీచార్జి జరిగిందని తెలిపారు. పోలీసుల చర్యను ఆయన ఖండించారు. పాట్నా పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం కోర్టుతోపాటు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు. మరోవైపు బీపీఎస్సీ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న అభ్యర్థుల సమస్య పరిష్కారానికి ప్రతినిధుల సమావేశంలో తీర్మానం చేయాలని ప్రశాంత్ కిషోర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనవరి 2 నుంచి అభ్యర్థుల నిరసనలో తాను కూడా పాల్గొంటానని ఆయన హెచ్చరించారు.

## సీఎం ఆదిత్యనాథ్ నివాసం కింద శివలింగం ఉంది: అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికార నివాసం కింద శివలింగం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ కూడా తవ్వకాలు జరుపాలని ఆయన డిమాండ్ చేశారు. కొన్ని రోజుల కిందట సంభాల్‌లో మొఘల్ కాలం నాటి మసీదు సర్వే నేపథ్యంలో అల్లర్లు జరిగాయి. ఈ ఘర్షణలో పలువురు మరణించగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత సంభాల్‌లో పలు చోట్ల తవ్వకాలతోపాటు ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కాగా, అఖిలేష్ యాదవ్ సోమవారం దీని గురించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం తన వైఫల్యాలు కప్పిపుచ్చడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతోందని ఆయన విమర్శించారు. అమాయకుల ఇళ్లను బుల్డోజర్లతో అక్రమంగా కూల్చివేస్తున్నారని ఆరోపించారు. 'సీఎం అధికార నివాసం కింద కూడా శివుడి రూపాన్ని సూచించే స్థూపాకార శివలింగం ఉందని మేం భావిస్తున్నాం. అక్కడ కూడా తవ్వకాలు జరుపాలి' అని అన్నారు. మరోవైపు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం శివలింగం గురించి ఇలా మాట్లాడటం సిగ్గుచేటని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.

## అర్చకులకు రూ.18 వేల గౌరవవేతనం.. రేపటినుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియ : కేజ్రీవాల్ ప్రకటన

**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజలను ఆకట్టుకునేందుకు కీలక హామీలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం కీలక ప్రకటన చేశారు. ఆలయాలు, గురుద్వారాల్లో పనిచేసే పూజారులు గ్రంథీలకు కేజ్రీ వరాల జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే.. వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందజేస్తామని ప్రకటించారు. సోమవారం కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ.. 'పురోహితులు, గ్రంథీలు మన ఆచారాలను భవిష్యత్తు తరాలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సమాజానికి వారు నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తు వారి ఆర్థిక శ్రేయస్సును ఎవరూ పట్టించుకోవడం లేదు. మేం అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ.18 వేలు గౌరవ వేతనం అందిస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ రేపటి నుంచే ప్రారంభం అవుతుందని కేజ్రీ వెల్లడించారు. హనుమాన్ ఆలయంలో తానే స్వయంగా ఈ ప్రక్రియను ప్రారంభిస్తానని తెలిపారు.

## బైకర్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన బీజేపీ స్టిక్కరున్న వాహనం.. తర్వాత ఏం జరిగిందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** బైకర్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన బీజేపీ స్టిక్కరున్న వాహనం.. తర్వాత ఏం జరిగిందంటే? లక్నో: బీజేపీ స్టిక్కర్ ఉన్న వాహనం ఒక బైక్‌ను ఢీకొట్టింది. వాహనం ముందు భాగంలో చిక్కుకున్న ఆ బైక్‌ను రెండు కిలోమీటర్ల వరకు అది ఈడ్చుకెళ్లింది. దీంతో రోడ్డుపై రాపిడికి నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. తీవ్రంగా గాయపడిన బైకర్ మరణించాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మొరాదాబాద్‌లోని షాజాద్‌ఖేరా గ్రామానికి చెందిన సుఖ్‌బీర్ ఆదివారం సాయంత్రం బస్లా గ్రామంలోని అత్తమామల ఇంటి నుంచి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. సంభాల్ జిల్లా సదర్ కొత్వాలి పరిధిలోని అస్మోలి బైపాస్‌లో వేగంగా వెళ్తున్న బొలెరో అతడి బైక్‌ను ఢీకొట్టింది. వాహనం కింద చిక్కుకున్న ఆ బైక్‌ను వాజిద్‌పురం సమీపంలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం వరకు రోడ్డుపై ఈడ్చుకెళ్లింది. దీంతో రోడ్డుపై బైక్ రాపిడికి నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి.

కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుఖ్‌బీర్‌ను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం అతడు మరణించాడు.

మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీ స్టిక్కర్‌తోపాటు 'గ్రామ ప్రధాన్' అని ఉన్న ఆ వాహనం స్థానిక గ్రామ సర్పంచ్‌కు చెందినదిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, మరో వాహనంలోని వ్యక్తి రికార్డ్ చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## 160,000 టెంట్లు, 150,000 టాయిలెట్లు, 1,250 కిలోమీ పైప్‌లైన్.. మహాకుంభ్‌కు అంతా సిద్ధం



**మహాకుంభ్‌నగర్:నవభూమి:** జనవరి 13వ తేదీ నుంచి ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా జరగనున్నది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. గంగా, యమునా, సరస్వతీ నదీ సంగమ ప్రదేశంలో జరిగే మహాకుంభ్‌కు లక్షల సంఖ్యలో జనం హాజరుకానున్నారు. పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. రోడ్లు వెడల్పు చేసి, ఘాట్లను సమం చేసి, నది వద్ద టెంట్లు ఏర్పాటు చేసే అంశంలో కార్మికులు ఓ సైన్యంలా పనిచేస్తున్నారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌లో దీనిపై మాట్లాడారు. ఐకమత్యానికి మహాకుంభ్ అని మోదీ ఆ ఈవెంట్‌ను వర్ణించారు. మహాకుంభ్ నుంచి తిరిగి వెళ్తూ.. ద్వేష, విభజన భావాన్ని వీడాలని సందేశం ఇచ్చారు. మహాకుంభ్ కా సందేశ్.. ఏక్ హో పూరా దేశ్ అని మోదీ అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభ్.. వచ్చే ఏడాది జనవరి 13వ తేదీన పౌశ పున్నమి రోజున ప్రారంభంకానున్నది. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో మహాకుంభ్ ముగుస్తుంది. ఆ పవిత్ర సమయంలో నదీ స్నానం చేసేందుకు దేశం నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు ప్రయాగ సంగమం వద్దకు చేరుకుంటారు. ఈ ఏడాది మహాకుంభ్ సమయంలో సుమారు 40 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. సుమారు లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు. సులభ స్నానాల కోసం తొమ్మిది పేవ్మెంట్ ఘాట్లు, ఏడు రివర్‌ఫ్రెంట్ రోడ్డు, 12 కిలోమీటర్ల తాత్కాలిక ఘాట్లను నిర్మిస్తున్నారు. ఏడు బస్టాండ్లను నిర్మిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా తీర్చేందుకు స్ట్రీట్ పెయింటింగ్స్ చేస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ప్రయాగ్‌రాజ్‌లో నదీ పరివాహక ప్రాంతం తగ్గిపోయింది. సుమారు 3200 ఎకరాల నదీ స్థలం ఆక్రమణకు గురైంది. కానీ ఆ స్థలాన్ని తిరిగి చేజిక్కించుకున్న ప్రభుత్వం దాదాపు 4 వేల హెక్టార్లలో ఏర్పాట్లు చేస్తున్నది. ఆర్థిక లావాదేవీలు స్మూత్‌గా సాగేందుకు అనేక ప్రాంతాల్లో బ్యాంకులు, ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నారు. హెల్త్‌కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేస్తున్నారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. మతపరమైన అకాడాలకు కూడా ప్రత్యేక టెంట్లను కేటాయించారు.

## అమెరికా వాసులకు యుద్ధ భయం.. అణు బంకర్లకు భలే గిరాకీ



**న్యూఢిల్లీ-నవభూమి::** అమెరికా ప్రజలను మూడో ప్రపంచ యుద్ధం భయపెడుతున్నది. దీంతో అణు యుద్ధం వచ్చినా సురక్షితంగా ప్రాణాలను రక్షించే బంకర్లకు డిమాండ్ పెరిగిపోతున్నది. ఇప్పటికే అవసరమైతే అణ్వాయుధాలు ప్రయోగిస్తామని రష్యా చేస్తున్న ప్రకటన, మరో వైపు ఉత్తర కొరియా, చైనా దేశాలు అణ్వాయుధ సంపత్తిని పెంచుకుపోవడం, పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు.. ఈ అన్ని కారణాలూ అమెరికా వాసులను బంకర్ల కొనుగోలుకు ప్రేరేపిస్తున్నాయి. దీంతో చాలా అమెరికా కుటుంబాలు అణు బంకర్లను కొనుగోలు చేస్తున్నాయి. వీటిని సుమారు 50,000 డాలర్ల వరకు పెట్టి కొంటున్నారని వాటిని తయారు చేసే సంస్థ డెయిలీ మెయిల్‌కు వెల్లడించింది. మునుపెన్నడూ లేనివిధంగా గత ఏడాది వీటి అమ్మకాలు తారస్థాయికి చేరుకున్నట్టు తెలిపింది.

**బంకర్లలో అన్ని వసతులు**


అమెరికాలోని ఓహియో కేంద్రంగా ఉన్న ఒక బంకర్ యజమాని టాడ్ స్టంప్ మాట్లాడుతూ తూర్పు ప్రాంతంలోని పెన్సిల్వేనియా, పశ్చిమ ప్రాంతంలోని కాలిఫోర్నియాలో వందలాది బంకర్‌లను అమ్మినట్టు చెప్పారు. బంకర్లంటే ఏదో చీకటిగా ఉండే ప్రదేశాలని భావించనక్కర్లేదు. సాధారణ గృహాల్లో ఉండే సదుపాయాలన్నీ ఇందులో ఉంటాయి. ఇక లగ్జరీ బంకర్లలో అయితే వంటగదులు, బెడ్‌రూమ్‌లతో పాటు కృత్రిమ కిటికీలు కూడా ఉండి మనం భూమి ఉపరితలంపైనే ఉన్న భావన కలిగిస్తాయి. ముందుగా నిర్మించి ఉన్న బంకర్లయితే పావు అంగుళం స్టీల్ ప్లేట్లతో తయారు చేస్తారు. అలా కాకుండా కావాల్సిన సైజులో షెల్టర్లు కావాల్సి వస్తే భారీ ఆర్‌సీపీ గోడలతో 8 నుంచి 20 అడుగుల పాటు వెయ్యి చదరపు అడుగులు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తారు. కొందరైతే కొన్ని నెలల పాటు నివసించగలిగేలా బంకర్లలో సౌకర్యాలు కోరుతున్నారు.

**వారి భయమే.. మా వ్యాపారం**

కొంతమంది ప్రజలు నిత్యం ప్రపంచంలో జరిగే పరిణామాల పట్ల ఆందోళన చెందుతుంటారని, నిజంగా అది తమకే జరిగితే ఎలా అని భయపడుతుంటారని, అలాంటి వారే తమకు కస్టమర్లుగా మారుతారని బంకర్ యజమాని టాడ్ స్టంప్ తెలిపారు. ఒకవేళ అణుయుద్ధమే సంభవిస్తే ప్రాణాలతో బయటపడటానికి మధ్యతరగతి వారికి కూడా అందుబాటులో బంకర్లను నిర్మించినట్టు తెలిపాడు.

## భారీగా కురుస్తున్న మంచు..

### పరీక్షలు వాయిదా



**న్యూఢిల్లీ-నవభూమి:** కొత్త సంవత్సరానికి ముందు జమ్మూ కశ్మీర్‌లో మంచు భారీగా కురుస్తోంది. ఈ ప్రభావం జనవరి 1, 2 తేదీల్లో కూడా ఉంటుందని, కొన్ని కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు కూడా ఉన్నాయని వెదర్ రిపోర్ట్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత జనవరి 3, 6 తేదీల మధ్య కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ హిమపాతం ఉండవచ్చని వెల్లడించారు. దీంతో జమ్మూ డివిజన్‌లోని అనేక ప్రాంతాలు కూడా ప్రభావితం కానున్నాయి.

**మంచు తొలగింపు**

వాతావరణం అధ్వాన్నంగా ఉన్న నేపథ్యంలో ఆదివారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హిమపాతం కురిసింది. ఆ క్రమంలో మంచు తొలగింపు తర్వాత రెండో రోజు జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. దీంతోపాటు దారిలో నిలిచిన వాహనాలను గమ్యస్థానం వైపు పంపించారు. బనిహాల్, ఖాజిగుండ్ మధ్య రోడ్లు జారడం కారణంగా, డ్రైవర్లు నెమ్మదిగా నడపాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**ఈ సేవలు రద్దు**

ఇదే సమయంలో సింథాన్ రోడ్, సోన్‌మార్గ్-కార్గిల్ రోడ్, భదేర్వా-చంబా రోడ్‌తో పాటు జిల్లా రాజోరి, పూంచ్ నుంచి షోపియాన్ (కశ్మీర్) వరకు కలిపే మొఘల్ రోడ్‌లు ఇంకా మంచుతోనే ఉన్నాయి. వీటిని ఇంకా తెరువలేదు. వాతావరణం మెరుగుపడిన తరువాత శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలు పునఃప్రారంభించబడ్డాయి. పర్యాటకులు, ప్రయాణికులు ట్రాఫిక్ విభాగం సలహా ప్రకారం ప్రయాణించాలని సూచించారు. అలాగే నేటి నుంచి రైలు సర్వీసులను కూడా పునరుద్ధరించారు. అయితే ఈ రోజు విస్టాడోమ్ సేవలు రద్దు చేయబడ్డాయి.

**ఉష్ణోగ్రతలు ఎలా ఉన్నాయంటే..**

ఈ క్రమంలో లోయలోని చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 నుంచి 6 డిగ్రీలు తక్కువగా ఉంది. ఆదివారం రాజధాని శ్రీనగర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 4.7 డిగ్రీల నుంచి 4.2 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. పహల్గామ్‌లో 5.8 డిగ్రీలు, గుల్‌మార్గ్‌లో 5.3 డిగ్రీల నుంచి మైనస్ 2.0 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. జమ్మూలో గరిష్ట ఉష్ణోగ్రత 20.5 కాగా, కనిష్ట ఉష్ణోగ్రత 6.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బనిహాల్‌లో 6.1 డిగ్రీల సెల్సియస్, బాటోట్‌లో 7.9, కత్రాలో 18.0, భదర్వాలో 10.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. లేహ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 0.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గుల్మార్గ్‌లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సున్నా కంటే తక్కువగా ఉండటం విశేషం.

**పరీక్షలు వాయిదా**

ఈ మంచు కురిసే వెదర్ నేపథ్యంలో డిసెంబర్ 30న జరగాల్సిన కాశ్మీర్ యూనివర్సిటీ పరీక్షలన్నీ వాయిదా పడ్డాయి. కాశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో విపరీతమైన మంచు కురుస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మజిద్ జమాన్ తెలిపారు. పరీక్షలను సకాలంలో నిర్వహిస్తామన్నారు. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీలు విడిగా జారీ చేయబడతాయన్నారు.

## అన్నా యూనివర్సిటీ లైంగిక దాడి ఘటన.. తమిళనాడు గవర్నర్‌తో నటుడు విజయ్ భేటీ



**న్యూఢిల్లీ-నవభూమి:** అన్నా యూనివర్సిటీ లో విద్యార్థినిపై లైంగిక దాడి ఘటన తమిళనాడు లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. వివిధ పార్టీలు, సంఘాలు అన్నా యూనివర్సిటీ ముందు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఘటనకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ తమిళగ వెట్రి కజగమ్ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ని కలిశారు. రాష్ట్రంలోని పరిస్థితుల నేపథ్యంలో లైంగిక దాడి ఘటనపై మాట్లాడేందుకే విజయ్ గవర్నర్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అయితే నటుడు విజయ్ ఈ లైంగిక దాడి ఘటనపై ఇప్పటికే స్పందించారు. అన్నా యూనివర్సిటీ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, చాలా బాధించిందని నటుడు విజయ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారని, నిందితుడిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాను ప్రభుత్వాన్ని కోరానని, ఈ ఘటనలో ఇంకా ఎవరి హస్తమున్నా తగిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశానని ఆయన తన పోస్టులో తెలిపారు.

## కాళ్లు పట్టుకుంటే పనులు జరగవు.. వినూత్న బోర్డు పెట్టిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రజలకు కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ కీలక విజ్ఞప్తి చేశారు. పాదాలను తాకడంపై నిషేధం ఉందని.. అలా చేసిన వారికి పనులు అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మధ్యప్రదేశ్ లోని తికమ్‌గఢ్ లోగల తన కార్యాలయం వద్ద వినూత్న బోర్డు ఏర్పాటు చేశారు. 'పాదాలను తాకడంపై నిషేధం ఉంది. అలా చేసిన వారికి ఎటువంటి పనులూ అప్పగించేది లేదు' అంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇది చూసిన స్థానిక ప్రజలు, రాజకీయ నేతలు షాక్ అవుతున్నారు. కార్యాలయం వద్దకు వచ్చిన వారంతా ఈ బోర్డును ఆసక్తిగా తిలకిస్తున్నారు. కేంద్ర మంత్రి చేసిన ఈ పనిని ప్రశంసిస్తున్నారు. కాగా, వీరేంద్ర కుమార్‌కు స్థానికంగా ఓటమి ఎరుగని నాయకుడిగా పేరుంది. ఆయన 1996లో తొలిసారి సాగర్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇక తికమ్‌గఢ్ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం నుంచి 2009లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లో ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు 2024లోనూ అదే విజయ పరంపర కొనసాగించారు. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్నారు.

## రైతుల ఆందోళనతో స్తంభించిన పంజాబ్.. 163 రైళ్లు రద్దు




**న్యూఢిల్లీ-నవభూమి:** రైతు డిమాండ్ల పరిష్కారంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతు సంఘాలు సోమవారం పంజాబ్ బంద్‌కుపిలుపునిచ్చాయి. అన్నదాతల డిమాండ్లను నెరవేర్చాలంటూ పంజాబ్ వ్యాప్తంగా కిసాన్ మజ్దూర్ మోర్చా సంయుక్త కిసాన్ మోర్చా బంద్ చేపట్టింది. ఈ బంద్‌తో రాష్ట్రం మొత్తం స్తంభించిపోయింది. రైతులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి బంద్‌లో పాల్గొన్నారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మూతపడ్డాయి. రోడ్డు, రైలు మార్గాలను రైతులు దిగ్బంధించారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ గేట్, బటిండాలోని రాంపురా ఫుల్, మొహాలీలోని ఐఐఎస్ఈఆర్ చౌక్ వద్ద ఎయిర్‌పోర్ట్ రోడ్డు, కురాలి రోడ్ టోల్ ప్లాజా, లాల్రూ సమీపంలోని అంబాలా %-% ఢిల్లీ హైవే, ఖరార్ మొరిండా హైవే సహా కీలక మార్గాలను రైతులు దిగ్బంధించారు. పంజాబ్ అంతటా ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు మూతపడ్డాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200కిపైగా రోడ్లను రైతులు బ్లాక్ చేశారు. దీంతో రవాణా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు రైతుల బంద్ రైళ్ల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ %-% పంజాబ్ మధ్య రాకపోకలు సాగించే దాదాపు 163 రైల్వే సర్వీసులకు రద్దయ్యాయి. విమానాలు, వైద్య, పెళ్లి, ఉద్యోగ ఇంటర్వ్యూ సహా అత్యవసర సేవలను బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. రైతుల బంద్ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. మోహాలి జిల్లా అంతటా దాదాపు 600 మంది పోలీసు సిబ్బంది మోహరించారు. సీనియర్ పోలీస్ అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ బంద్ కొనసాగనున్నట్లు రైతు సంఘాలు ప్రకటించాయి.



## మరో రెండు విమానాలకు తప్పిన ముప్పు

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రయాణికులతో వెళుతున్న రెండు వేర్వేరు విదేశీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలు శనివారం త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఉదయం విమాన ప్రమాదం సంభవించి 179 మంది ప్రయాణికులు మరణించిన ఘటన జరగడానికి కొన్ని గంటల ముందు చోటుచేసుకున్న ఈ రెండు ఘటనలు విమాన ప్రయాణికుల భద్రతపై సందేహాలు లేవనెత్తుతున్నాయి. న్యూఫౌండ్‌ల్యాండ్ దీవిలోని సెయింట్ జాన్స్ నగరం నుంచి నోవా స్కాటియా ప్రావిన్సులోని గాఫ్స్‌లో హాలిఫాక్స్ విమానాశ్రయానికి వస్తున్న ఎయిర్ కెనడాకు చెందిన విమానం శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ల్యాండింగ్ అవుతున్న సమయంలో అదుపుతప్పి మంటల్లో చిక్కుకుంది. ల్యాండ్ అవుతుండగా టైర్లు రన్‌వేపై సరిగ్గా దిగకపోవడంతో విమానం ఒక పక్కకు ఒరిగిపోయి ముందుకు దూసుకెళ్లినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రన్‌వేను దాటేసిన విమానం సురక్షిత ప్రదేశంలో నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. విమానం ఎడమ భాగంలో మంటలు కనిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించినట్టు అధికారులు తెలిపారు.నార్వేలోని ఓస్లో నుంచి నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్ వెళుతున్న కెఎల్‌ఎం డచ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే హైడ్రాలిక్ ఫెయిల్యూర్ ఎదుర్కొంది. దీంతో టార్ప్ శాండెఫ్‌జార్డ్ ఎయిర్‌పోర్టుకు విమానాన్ని మళ్లించారు.



## వేల కోట్ల అవినీతిపై చర్యలు ఉండవా?

అవినీతి.. నిర్లక్ష్యం వేరు వేరు పదాలైనప్పటికీ ఆ పదాల పర్యవసానం మాత్రం ఎంతో విలువైన ప్రజాధనాన్ని ప్రజలకు అందకుండా చేయడమే. అవినీతి ధనం వ్యక్తులకు చేరుతుందిబీ నిర్లక్ష్యం, కక్షపూరిత ధోరణి వల్ల ఎంతో విలువైన ప్రజాధనం వృథా అవుతోంది. గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి రావడంతోనే కోట్ల రూపాయల విలువైన ప్రజావేదికను కూల్చివేశారు. దాని నిర్మాణానికి ఉపయోగించిన సొమ్ము ప్రజాధనమే, కూల్చడానికి వినియోగించిన సొమ్ము ప్రజాధనమే. పదవీకాలం ముగిసే సమయానికి వ్యక్తిగత కాంక్షతో విశాఖపట్నం రుషికొండపై అమెరికా అధ్యక్షుని వైట్‌హౌస్‌ని మించిన సదుపాయాలతో నిర్మించిన ప్యాలెస్‌కి వినియోగించిన 680 కోట్ల రూపాయలు ప్రజాధనమే. ఈ రెంటి మధ్య జరిగిన వేల కోట్ల అవినీతి, వేల కోట్ల విలువైన నిర్లక్ష్యం గురించి ఎంతచెప్పినా తక్కువే. తాజాగా వెలుగులోకి వచ్చిన అవినీతి అదానీతో విద్యుత్ ఒప్పందం సందర్భంగా 1750 కోట్ల రూపాయల ముడుపులు పుచ్చుకోవడం.నూతన ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడం మొదలుకొని, ఆ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాలకు జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రత్యక్ష సాక్షి. కానీ తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత అవేవీ తనకు తెలియనట్టుగా మూడు రాజధానులను ముందుకు తీసుకువచ్చారు. రాజధాని అమరావతిలో పిచ్చిచెట్లు, ముళ్లకంపలతో శ్మశానం ఉందని ఎద్దేవా చేశారు. అమరావతిలో ఎటువంటి నిర్మాణాలు జరగలేదని, కేవలం గ్రాఫిక్‌లు మాత్రమేనని ప్రచారం చేసి, వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణాలను పాడుపెట్టారు. పరోక్షంగా వేల కోట్ల రూపాయల నష్టం కలిగించారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో ఎవరైనా ప్రభుత్వ అధికారి నిర్లక్ష్యం వహించి ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఆ అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. కేవలం రాజకీయ దుర్బుద్ధి, స్వార్థంతో వేల కోట్ల రూపాయల నష్టానికి కారణమైన రాజకీయ నాయకులపై ఎటువంటి చర్యలు తీసుకోరా? రాజకీయ నేతలకు ఒక రూల్.. ప్రభుత్వ అధికారులకు మరో రూలా?అమరావతిలో అభివృద్ధి పనులకు సంబంధించిన సందడి ప్రారంభమైంది. రాజధాని అమరావతి గ్రామాలలో ఎక్కడ చూసినా ఉత్సాహం ఉరకలు వేస్తోంది. అన్ని రకాల వృత్తుల వారికి పనులు లభిస్తున్నాయి. కార్మికుల కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. నిర్మాణ కార్మికులు, రాడ్ బెండింగ్, విద్యుత్, కార్పెంటరీ, ప్లంబింగ్ కార్మికులకు ఉపాధి లభిస్తోంది. అమరావతి పరిధిలో ఒక పండుగ వాతావరణం నెలకొంది. మొత్తం 18 పనులకు సంబంధించి 11,471 కోట్ల రూపాయల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. నిజానికి ఈ పనులను గత ప్రభుత్వం సకాలంలో పూర్తిచేసి ఉంటే 7,431 కోట్ల రూపాయలకే పనులు పూర్తయ్యేవి. గడచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల ధరల పెరుగుదల, కాలయాపన నేపథ్యంలో దాదాపు 30 శాతం మేరకు నిధులు అదనంగా ఖర్చుచేయాల్సి వస్తోంది. ఈ పనులకు సంబంధించి జాప్యం, జగన్ నిర్లక్ష్యం ఖరీదు అపారం. జగన్ అధికారంలోకి రాకముందు గెజిటెడ్ అధికారుల టైప్-1, టైప్-2 క్వార్టర్లతో పాటు 4వ తరగతి ఉద్యోగులకు సంబంధించి అపార్టుమెంట్ల నిర్మాణం పనులు దాదాపు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయి. కానీ, అయిదు సంవత్సరాల పాటు ఎటువంటి నిర్వహణ లేకపోవడం వల్ల అపార్టుమెంట్లు పాడుపడినట్లుగా తయారయ్యాయి.ఇంజనీరింగ్ నిపుణులు పరీక్షించిన తర్వాత అపార్టుమెంట్లు నిర్మాణపరంగా బాగానే ఉన్నాయని తెలపడంతో, మిగిలిన పనులు పూర్తిచేయడం నిమిత్తం 594.54 కోట్ల రూపాయలను సీఆర్‌డీఏ మంజూరు చేసింది. ఇదే సమయంలో చంద్రబాబు హయాంలో హ్యాపీనెస్ట్ పథకం కింద నిర్మించతలపెట్టిన ఫ్లాట్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తులు కోరినప్పుడు గంట వ్యవధిలో లక్ష్యం పూర్తి అయింది. అటువంటి హ్యాపీనెస్ట్‌ను జగన్ ప్రభుత్వం వదిలేయడం వల్ల నేటి ప్రభుత్వం దాదాపు 900 కోట్ల రూపాయల మేరకు నష్టం భరించాల్సి వస్తోంది. మళ్లీ రాజధానిలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి సందడి ప్రారంభం కావడం సంతోషమే.. మరి అధికారం ముసుగులో స్వార్థం, కక్షతో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉండవా?అవినీతి పనులన్నీ తెరవెనుక జరుగుతాయి, వాటికి సాక్ష్యం ఉండదు. కానీ స్వార్థంతో వేల కోట్ల రూపాయల ఆస్తులను ధ్వంసం చేయడం మన కంటి ముందు జరిగింది. కోట్ల రూపాయల విలువైన ప్రజావేదిక కూల్చడానికి కారణం ఏమిటి? రాజధానిగా అమరావతికి అసెంబ్లీలో ఆమోదం తెలిపి, ఆ తర్వాత మూడు రాజధానుల పేరుతో వేల కోట్ల ఆస్తులను పాడుపెడితే చర్యలు ఉండవా? తాజాగా వెలుగులోకి వచ్చిన విద్యుత్ కుంభకోణంలో అదాని నుంచి 1750 కోట్ల రూపాయల ముడుపులు తీసుకున్నట్టు అమెరికాలోని నిఘా సంస్థ అన్ని ఆధారాలను సేకరించింది. కానీ చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారో ప్రజలకు అర్థం కావడం లేదు.వేల కోట్ల రూపాయల వ్యయంతో రాజధాని అమరావతి పరిధిలో నిర్మించిన భవనాలను పాడుపెడతారని, సొంత విలాసాల కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తారని ప్రజలకు ముందుగా తెలిసి వుంటే జగన్‌కు ఆనాడు అధికారం కట్టబెట్టేవారు కాదు. మంచి పనులు చేస్తారనే ఉద్దేశ్యంతో అప్పుడు ఓట్లు వేసిన ప్రజలు, అదే ఓటుతో జగన్మోహన్‌రెడ్డిని ఘోరంగా ఓడించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసిన గత పాలకులపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వానిదే.

# 2024 .. విషాదం మిగిల్చిన విమాన ప్రమాదాలు..



2024 ముగింపు దశకు చేరింది. 2025 ఏడాదికి స్వాగతం పలికేందుకు యావత్తు ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. కొత్త ఆశలతో నూతన ఏడాదిని ఆహ్వానించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. అదే సమయంలో ఈ ఏడాది మిగిల్చిన చేదు జ్ఞపకాలను కూడా నెమరువేసుకుంటున్నారు. ముఖ్యంగా 2024 ఏడాది ఎన్నో విషాదాలను మిగిల్చింది. అత్యాచార ఘటనలు, రోడ్డుప్రమాదాలు, ఉగ్రదాడులు, ప్రకృతి విపత్తులు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేశాయి.

వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది విమాన ప్రమాదాలే. ఏడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకూ పదుల సంఖ్యలో విమాన ప్రమాదాలు చోటుచేసుకోగా.. ఆయా ప్రమాదాల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా డిసెంబర్‌లో ఏడు విమాన ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కనెలలోనే విమానాల ప్రమాదాల కారణంగా 240 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఏడాది ముగింపు వేళ చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గానిలిచింది. మొత్తంగా ఈ ఏడాది విమాన ప్రమాదాల్లోనే 430 మందికిపైగా మరణించారు. ఈ ఏడాది ఆరంభం నుంచి జరిగిన విమాన ప్రమాదాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**కోస్టు గార్డు ప్లేన్‌ను ఢీ కొట్టిన విమానం..**

ఈ ఏడాది ఆరంభంలోనే జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ప్రమాదానికి గురైంది. జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జేఏల్ 516 విమానం టోక్యో విమానాశ్రయంలో ఆగి ఉన్న కోస్టు గార్డు ప్లేన్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో భారీ స్థాయిలో మంటలు వ్యాపించాయి. మండుతున్న విమానం నుంచి కొందరు ప్రయాణికులు ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. హనెడా విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు బయటపడగా.. కోస్ట్ గార్డ్ విమానంలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

ఖైదీలతో వెళ్తున్న విమానం కూలి..అదే నెల 24న (జనవరి) ఉక్రెయిన్ సరిహద్దుల్లో ఖైదీలతో వెళ్తున్న రష్యా విమానం కుప్పకూలి 74 మంది దుర్మరణం చెందారు. అందులో 65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు కాగా.. తొమ్మిది మంది సిబ్బంది. ఉక్రెయిన్ సమీపంలోని బెల్గొరాడ్‌లో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

**సైనిక విమానం కూలి 15 మంది మృతి**

మార్చి 12న రష్యాలో సైనిక విమానం కుప్పకూలిపోయింది. రష్యా సైన్యానికి చెందిన ఐఎల్-76 రవాణా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రష్యా రాజధాని మాస్కోకు 125 మైళ్ల దూరంలోగల ఇవనోవోలో కూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 15 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 8 మంది విమాన సిబ్బంది కాగా, మరో ఏడుగురు ప్రయాణికులు.

**విమాన ప్రమాదంలో రైసీ మృతి**

ఈ ఏడాది మేలో జరిగిన ఓ విమాన ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు దుర్మరణం చెందారు. మే 19న ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. అజర్‌బైజాన్ సరిహద్దులో ఇరు దేశాలు సంయుక్తంగా నిర్మించిన డ్యామ్ ప్రారంభోత్సవానికి వెళ్లిన అధ్యక్షుడు, తిరుగు ప్రయాణంలో తబ్రిజ్ నగరానికి వెళ్తుండగా ఆయన వెళ్తున్న హెలికాప్టర్ కూలిపోయింది. ఈ దుర్ఘటనలో రైసీ సహా మొత్తం 8 మంది దుర్మరణం పాలయ్యారు.

మలావీ ఉపాధ్యక్షుడు సహా 10 మంది దుర్మరణం

జూన్‌లో ఆఫ్రికా దేశమైన మలావీలో జరిగిన విమాన ప్రమాదంలో ఆ దేశ ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం జూన్ 10న అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా విమానం ల్యాండింగ్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతి నిరాకరించింది. తిరిగి వెళ్లిపోవాలని సూచించింది. ఈ క్రమంలో కొద్దిసేపటికే రాడార్‌తో ఆ విమానానికి సంబంధాలు తెగిపోయాయి. జూన్ 11న ఆ విమానం కూలిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఉపాధ్యక్షుడు సహా అందులోని వారంతా మరణించినట్లు ధృవీకరించారు.

నేపాల్ దుర్ఘటన..జులై 24న నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. రాజధాని కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శౌర్య ఎయిర్‌లైన్స్)కు చెందిన విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో అదుపుతప్పి కూలిపోయింది ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

**బ్రెజిల్ ప్రమాదంలో 62 మంది మృతి**

బ్రెజిల్‌లో ఆగస్టు 10వ తేదీన బ్రెజిల్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 62 మంది మరణించారు. వోపాస్ లిన్హాస్ ఏరియాస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం పరన రాష్ట్రంలోని కాస్కవెల్ నుంచి సావో పౌలోలోని గువారుల్హోస్ వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. అప్పట్లో ఈ ఘటన బ్రెజిల్‌లో జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాల్లో ఒకటిగా నిలిచింది.'చీకటి నెల' డిసెంబర్..ఇక చివరి నెల అయిన డిసెం బర్‌ను వరుస విమాన ప్రమాదాలు పలకరించాయి. ఏకంగా ఏడు ఘటనలు చోటు చేసుకోగా అందులో 240 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఏడాది ముగింపు వేళ చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది.దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపో వడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు.డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి:డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది.

ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు.

డిసెంబర్ 24న అర్జెంటీనాలో బార్డియర్ ఛాలెంజర్ 300 విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. డిసెంబర్ 17న హవాయిలోని హొనోలులులోని ఇనౌయే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఓ విమానం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. విమానం లిఫ్ట్‌ఆఫ్ అయిన వెంటనే నియంత్రణ కోల్పోయి భవనాన్ని ఢీట్టింది.

# మొదటి ప్రాధాన్యత విద్యే!



*ఇచ్చునదె విద్య, రణమున*
*జొచ్చునదె మగతనంబు,*
*సుకవీశ్వరులున్,*
*మెచ్చునదె నేర్పు, వాదుకు*
*వచ్చినదే కీడు సుమ్ము వసుధను*
*సుమతీ.*



దీని అర్థం: లోకములో విద్యతో కూడిన ధనమును సంపాదించాలి, యుద్ధంలో పౌరుషముతో పోరాడుతూ విజయం సాధించాలి, కవులు మెచ్చుకునేలా నేర్పు గల కవిత్వం రాయాలి. తగవునకు వచ్చు వాక్యములే హాని కలిగిస్తాయి. అందుకే, విద్య, ధనము, ప్రతాపము, మేధాశక్తి, సమయోచిత మాటలు చాలా ముఖ్యమంటూ ఆనాడే కవి బద్దెన గారు చాల స్పష్టంగా వివరించారు. అవును, విద్యను మించిన సంపద మరోది లేదు. విద్యకు విద్యేసాటి. దానిని రుచిచూసిన వారికే తెలుస్తుంది. అది ఎంత ఉత్తమంగా, రుచిగా ఉంటుందోనని. విద్యపై పెట్టే పెట్టుబడి తరతరాల వరకు ఫలితాలనిస్తుంది. చిన్న కథ: పూర్వం ఒక రాజు, నిండు సభలో, రాజ్యాన్ని మరింత ప్రగతి పథంలో తీసుకెళ్లాలంటే ఏం చేయాలో సలహాలివ్వ మంటాడు. ఒకరు- కొత్త పన్నులను వేయడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చుంటాడు. మరొకరు- ఇంకో రాజ్యంపై దండెత్తి, వారి సంపదనంతా తెద్దాం అంటాడు. ఇంకొకరు- ప్రజలందరికీ చదువు నేర్పిద్దాం, వారి తలరాతలను మారుద్దాం, అభివృద్ధి కచ్చితంగా గమనిం చబడు తుందంటాడు. అవును, అందుకే, తమసోమా జ్యోతిర్గమయ గా చెప్ప బడింది, నిరంతరం జ్ఞానాన్ని సమపార్జిస్తూ దానిని పూర్తిగా అవగతం చేసుకుంటూ జీవితాన్ని మరింత అర్థవంతంగా చేసుకోవడమే. విద్యకు విద్యే సాటి. ఇంకో సందర్భంలో మన వద్ద ఒక సంవత్సర ప్లాన్ ఉంటే పొలంలో మంచి రాబడి నిచ్చే పంట వేయాలి. మన వద్ద పది సంవత్సరాల ప్లాన్ ఉంటే పొలంలో మంచి ఫలాల నిచ్చే చెట్లను పెంచాలి. మన వద్ద వంద సంవత్సరాల ప్లాన్ ఉంటే ఇక అందరికీ విద్యనందిస్తే చాలు! అభివృద్ధి గమనించబడి తీరుతుంది. అందుకే, చదువు ( విద్య ) తరతరాలకు తరగని నిధిగా ఉంటుంది. ఈ విషయాన్ని అరిస్టాటిల్ ఏనాడో స్పష్టం చేశారు.విద్య అనే మహా వృక్షం వేళ్ళు చేదుగా ఉన్న, అది అందించే ఫలాలు మాత్రం అతి మధురంగా ఉంటాయన్నారు. అందుకే, విద్యను నిర్వచించడం అంత తేలికైన పని కాదు. సరైన రీతుల్లో అందరినీ సంతృప్తిపర్చే నిర్వచనం ఇవ్వడం అంటే కష్టమే. కొందరు జ్ఞానపరిధుల్ని విస్తరించడమే విద్య అంటే, ఇంకొందరు ప్రశ్నించడమే విద్య అన్నారు. మరికొందరు ప్రవర్తనను మార్చునదే విద్య అన్నారు. అన్నీ కరెక్టే, నా మట్టుకైతే బ్రతుకులను మార్చేదే విద్య.

దీనికి అనేక మంది మహానుభావుల జీవిత చరిత్రలను నా బ్రతుకు నే మార్చింది విద్య గనుక ఉదాహరణగా చెప్పవచ్చు. తెలియని విషయాలను తెలుసుకోవడమే విద్య. అజ్ఞానం అనే చీకటిని పార ద్రోలునదే విద్య అనే వెలుగు. అందుచేతనే, క్లుప్తంగా ఒక వాక్యంలో విద్యకు విద్యే సాటి అని స్పష్టమవుతోంది. ఇక విద్యకు గల సంకుచిత అర్థం గూర్చి క్లుప్తంగా తెలుసుకుంటే- విద్య అంటే ఎంపిక చేయబడిన పాఠశాల, కళాశాల అనే నియంత్రిత వ్యవస్థలో, వ్యక్తిగతాభివృద్ధికి, సామాజిక సమర్థతకు అవసరమగు కావలసినంత విజ్ఞానాన్ని పొందడమే. సేకరించిన, సముపార్జించిన విలువలను, నైపుణ్యాలను ఒక తరం నుండి మరో తరానికి అందజేయడంలో పాఠశాలలు, కళాశాలలు ఉపయోగపడుతుంటాయి. అంటే పాఠశాలల్లో ఉపాధ్యాయుల ద్వారా ఈ విధంగా పొందే శిక్షణనే స్కూలింగ్ అంటారు. అంటే రోజూ బడికి వెళ్తూ నేర్చుకునేదే విద్య. ఈ వ్యవస్థలో ఉపాధ్యాయుడే ( బోధకుడు) కీలకం.

ఎందుకంటే వైద్యుని నిర్లక్ష్యంతో రోగి ఇబ్బంది పడవచ్చు. ఇంజనీరు నిర్లక్ష్యంతో కట్టడం దెబ్బ తినవచ్చు. న్యాయవాది నిర్లక్ష్యంతో నిర్దోషి ఇబ్బంది పడవచ్చు. అధికారి నిర్లక్ష్యంతో ఫైలునకు మోక్షం రాకపోవచ్చు. కానీ, ఉపాధ్యాయిని నిర్లక్ష్యంతో ఒక తరమే ఇబ్బంది పడవచ్చు. అందుకే, ఉపాధ్యాయుడంటే వెలుగు నిచ్చేవారుగా, ఘనమైన వారుగా చెప్పబడ్డారు. అలాగే ఉండాలి కూడా! ఇక విద్య యొక్క విస్తృత అర్థం విషయంలో వ్యక్తి మనస్సును, శీలమును, ప్రభావితం చేసే ఏ చర్య అయినా విద్యగానే భావించబడింది. ఇది జీవితాంతం కొనసాగే ప్రక్రియ గా ఉంటుంది. అంటే వ్యక్తి పుట్టుక నుంచి మరణించే వరకు కొనసాగుతుంది. అందుకే విద్య చైతన్యమైనదిగా ఉంటూ, వ్యక్తిని, సమాజాన్ని, వ్యవస్థనే మార్చివేస్తుంది. దీనికి అంతం అనేది లేదు, ఉండదు. అందుకే, విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడాలి. విద్య గనక వ్యక్తి జీవితంలో చోటు చేసుకుంటే సదరు వ్యక్తి జీవితం విరాజిల్లుతుంది. అభివృద్ధి పథం లో పయనిస్తుంది. కనుక, విద్యకు గల ప్రాధాన్యతను గ్రహిస్తూ అందరూ సమచిత రీతుల్లో ప్రాధాన్యతను కల్పిస్తే, సగరు వ్యవస్థలో అభివృద్ధి గమనించబడితీరుతుంది. ఎందుకంటే, విద్య అనేది ఒక నిత్య చైతన్యం వంతమైన ప్రక్రియ. అందుకే, దానికి మొదట ప్రాధాన్యత ఇస్తే, తర తరాల వరకు దాన్ని ప్రభావాన్ని చూపిస్తూనే ఉంటుంది. అవును, విద్యకు విద్యే సాటి!

**డాక్టర్ యం. ప్రభు దయాల్**
**మాజీ సెనెట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ,**
**జీవిత సభ్యుడు ఐఏటిఈ,**
**మండల విద్యాశాఖాధికారి - కొత్తగూడెం.**

# కాలంతో పోటీ పడదాం.!



మానవ జీవితం చాలా అమూల్యమైనది. అది ఎప్పుడు, ఎక్కడ, ఎలా ముగిసితుందో ఎవరికీ తెలియదు. అదొక దైవ రహస్యం. దాన్ని ఛేదించే శక్తి దైవం ఎవ్వరికీ ప్రసాదించలేదు. జీవితకాలాన్ని సద్వినియోగం చేసుకోవడం పైన్నే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో మనం ఏదైనా సాధించవచ్చు.. ఛేదించవచ్చు. డబ్బు.., గౌరవం.., ఉద్యోగం.., అధికారం.., హోదా.. ఏదైనా కావచ్చు, అదిసాధ్యమే.. కాని కాలాన్నిమాత్రం ఎంత ధనం ధారపోసినా, ఎంతపలుకుబడి ఉపయోగించినా సాధించలేము. గడిచినకాలం - అది రెప్ప పాటైనా సరే - కోట్లు కుమ్మరించినా మనకు లభించదు. ఇది కాలం చెప్పే సత్యం. మనం దాని విలువను గుర్తించకపోతే అది మనకోసం ఆగదు. సమయాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోగలిగినప్పుడే అదిమనకు ఉపకరిస్తుంది. లేకపోతే అదిమనల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి ముందుకు సాగిపోతుంది. అందుకని మనం ఏవిషయంలో అయినా సకాలంలో స్పందించ గలగాలి. సమయం మించి పోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మనకోసం నిరీక్షిస్తూఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మనవద్దకు రావాలని ఆశించడం సరికాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని దరి చేరనీయకూడదు. ఎందుకంటే,






ఈరోజు చేయవలసిన కార్యాన్ని రేపటికి వాయిదా వేశామంటే కాలానికి మనం విలువ ఇవ్వనట్లే లెక్క. ఈనాటి కొద్దిపాటి అలక్ష్యం రేపటి బాధ్యతను రెట్టింపుచేస్తుంది. ఒకటికి రెండుతోడై, బాధ్యతలు పేరుకు పోతాయి. ఇక ఆతరువాత బాధ్యతల నిర్వహణ తలకు మించిన భారంగా మారి, పలాయనవాదాన్ని ఆశ్రయించే దుస్థితి వస్తుంది. అద్భుతమైన విజయాలను సాధించినవారి జీవితాలను పరిశీలిస్తే, వారు కాలాన్ని (సమయాన్ని) ఎలా తమకు అనుకూలంగా మలచుకొని, సద్వినియోగం చేసుకొని, కొత్త అవకాశాలను సృష్టించుకున్నారో, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ఎలా నాంది పలికారో మనకు అర్థమవుతుంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ తన జీవితకాలంలో వెయ్యికంటే ఎక్కువ నూతన ఆవిష్కరణలకు నాంది పలికాడు. వాటిలో గ్రామ్ ఫోన్ , విద్యుత్తుబల్బు అతని ఆవిష్కరణలే. ఇది ఎలాసాధ్యమైంది? అతను కాలం నాడిని ఒడిసిపట్టి, దాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. కాలక్షేపం కోసం కాలాన్ని దుర్వినియోగం చేయలేదు. సరదాలు, షికార్లు, సొల్లు కబుర్లకోసం సమయాన్ని నిర్లక్ష్యం చేయలేదు. నేటి యువతకులాగా (అందరూ కాదు సుమా) స్మార్ట్ ఫోనుకే అతుక్కుపోయి, యూట్యూబు, ఫేస్ బుక్కు, వాట్సాపు చాటింగుల్లో సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లుగా, ఆనాడతను సమయాన్ని దుర్వినియోగం చెయ్యలేదు. తన ప్రయోగశాలనే వినోదశాలగా మార్చుకున్నాడు. చేస్తున్న పనిలోనే ఆనందాన్ని, వినోదాన్ని అనుభవించాడు. కాలం విలువను గుర్తించబట్టే, విద్యుత్ బల్బును కనుగొనే సమయంలో ఏకధాటిగా పన్నెండు, పదమూడు రోజులు ప్రయోగశాలలోనే నిద్రలేని రాత్రులు గడిపాడు. అనుకున్నది సాధించాడు. అందుకని కాలం విలువను గుర్తించాలి. దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకొని విజయ తీరాలకు చేరినవారి గాథల్ని అధ్యయనం చెయ్యాలి. స్ఫూర్తిపొందాలి. అపజయాలు మూటగట్టుకొని కాలగతిలో కలిసిపోయిన వారి గాథల్ని గుణపాఠాలుగా తీసుకోవాలి. కాలం / సమయం మనకు అనేక నిజాలు చెబుతోంది. బుద్ధిజీవి అయిన మానవుడు వాటిని అవలోకన చేసుకుంటూ, నీతిగా, నిజాయితీగా, విలువలతో కూడిన జీవితం గడుపుతూ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు. గమ్యాన్ని ముద్దాడవచ్చు. దేవుడు మనందరికీ ఈకొత్త సంవత్సరంలో సకల శుభాలూ, సంతోషాలు కలుగ జేయాలని, గతం నుండి గుణ పాఠాలు నేర్చుకుంటూ వెలుగులవైపు నడిపించాలని కోరుకుందాం.!

**నూతన సంవత్సర శుభాకాంక్షలతో...**
**- యండి. ఉస్మాన్ ఖాన్**
**సీనియర్ జర్నలిస్ట్**

## 'సక్యులెంట్స్'తో సరికొత్తగా...



'సక్యులెంట్స్'తో సరికొత్తగా...
అందమైన ఆకులతో కనువిందు చేసే మొక్కలే 'సక్యులెంట్స్'. ఇవి ఎడారి మొక్కలు. దళసరి ఆకులతో సహజసిద్ధంగా ఉంటూ చూడడానికి పగడపు దిబ్బలు, ఆక్టోపస్ లాంటి సముద్ర జీవుల ఆకృతులను పోలి ఉంటాయి. చిన్న కుండీల్లో సైతం చక్కగా పెరుగుతాయి. సంరక్షణ కూడా పెద్దగా అవసరం ఉండదు. ప్రస్తుతం ఇంటి అలంకరణలో ప్రత్యేక స్థానం వీటిదే. కార్యాలయాల్లో కూడా విరివిగానే పెంచుతున్నారు. పలు సందర్భాల్లో ఈ మొక్కలను కానుకగా ఇచ్చి పుచ్చుకుంటున్నారు. ఇంట్లో అందంగా పెరిగే

సక్యులెంట్స్ ఇవే...
జేడ్..
దీనిని మోహిని మొక్క అని కూడా అంటారు. మందపాటి చిన్న ఆకులతో గుబురుగా పెరుగుతుంది. దీనికి నీరు ఎక్కువగా అవసరం లేదు. కుండీలోని మట్టి పూర్తిగా పొడిగా అయితేనే నీళ్లు పోయాలి. రోజుకి కనీసం నాలుగు గంటలు మొక్కకి ఎండ తగిలేలా చూసుకోవాలి. ఈ మొక్క ఇంటి లోపలి గాలిని శుభ్రం చేస్తుంది. కుండీని గదిలో ఆగ్నేయం మూలలో లేదా తూర్పు వైపున పెట్టుకుంటే అదృష్టం కలిసి వస్తుందనీ ఆర్థిక ప్రయోజనాలు సమకూరుతాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు.

ఇకివేరియా.. ఈ మొక్క చూడడానికి పెద్ద గులాబీ పువ్వులా ఉంటుంది. చక్కని రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కొంచెం నీరు పోస్తే చాలు వేగంగా పెరుగుతుంది. ఎండిన ఆకులతో తయారు చేసే ఎరువు దీనికి సరిపోతుంది. వేడిని, చలిని తట్టుకుంటుంది.

సెడమ్..ఈ మొక్క గుబురుగా పైకి పెరుగుతుంది. దీని ఆకులు చిన్నగా మందంగా ఉంటాయి. ఇది ఎండ తగలకపోయినా కూడా చక్కగా పెరుగుతుంది. చిన్న కుండీల్లో ఈ మొక్క అద్భుతంగా కనిపిస్తుంది.

# పార్లర్‌కు వెళుతున్నారా?









పెడిక్యూర్ కోసం బ్యూటీ పార్లర్‌ల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఫేస్‌మాస్క్ కోసం బోలెడు డబ్బులు వెచ్చించాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే, తీరిక సమయాల్లోనే... సౌందర్యపోషణ పనిని సులభతరం చేసేందుకు కొన్ని బ్యూటీ గ్యాడ్జెట్స్ ఉన్నాయి. వాటి విశేషాలే ఇవి...

**నెయిల్‌పాలిష్... హుష్‌కాకి...**

నెయిల్‌పాలిష్ వేసుకోవడం సులువే కానీ, దాన్ని తొలిగించడంలోనే ఉంటుంది అసలు చిక్కంతా. అందుకోసం 'నెయిల్‌పాలిష్ రిమూవర్ క్లిప్స్' చక్కగా సహాయ పడతాయి. కాటన్ ప్యాడ్ తీసుకొని, రెండు చుక్కల నెయిల్‌పాలిష్ రిమూవర్ వేసి, దానిని గోళ్లపై ఉంచి ఈ క్లిప్స్ పెడితే సరి. పది నిమిషాల తర్వాత వీటిని తొలగించి కాటన్ ప్యాడ్‌తో నెయిల్‌పాలిష్‌ను ఒక్కసారి రుద్దితే చాలు... చిటికెలో శుభ్రం అవుతుంది. ఈ గ్యాడ్జెట్ ఉంటే దుస్తుల మ్యాచింగ్‌కి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు నెయిల్‌పాలిష్‌ను మార్చుకోవచ్చు.

నిమిషాల్లో ఫేస్‌మాస్క్

'ఫేస్‌మాస్క్ మేకర్' ఉంటే.. పార్లర్ కోసం పైసా ఖర్చుపెట్టాల్సిన పనిలేదు. ఇంట్లోనే కావాల్సిన మాస్కులను సులువుగా తయారుచేసుకోవచ్చు. ఎన్ని నీళ్లు పోయాలి, ఏయే పదార్థాలు ఎంతెంత మోతాదులో కలపాలి.. లాంటి సూచనలను వాయిస్ మోడ్‌లో ఇస్తుంటుందీ మేకర్. కావాల్సిన విధంగా కూరగాయలు, పండ్లు, విటమిన్ టాబ్లెట్స్, తగినంత నీరు ఇందులో వేసుకొని, బటన్‌ని నొక్కితే సరి. రెండు నిమిషాల్లో పేస్ట్ రెడీ అయిపోతుంది. ఆపై మరొక్కసారి అదే బటన్ నొక్కితే పేస్ట్ అంతా కిందనున్న మాస్క్ ప్లేట్‌లోకి జారుతుంది. అప్పుడు మాస్క్‌ని సులువుగా ముఖంపై పరుచుకోవచ్చు. సెల్ఫ్ క్లీనింగ్ మోడ్ ఆన్ చేస్తే పది సెకన్లలో మెషీన్ శుభ్రమైపోతుంది.

**మస్కారా.. మరింత సులువుగా...**

మస్కారా అప్లై చేసుకునే క్రమంలో పక్కలకు అంటుకోవడం చాలామందికి అనుభవమే. అలాగని అదేపనిగా చెరిపేసి వేసుకుంటే ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. ఈ సమస్య లేకుండా మస్కారాను చక్కగా, సులువుగా తీర్చిదిద్దుకోవడానికి 'స్టెన్సిల్స్' ఉన్నాయి. వీటిని కళ్ల కింద, రెప్పల పైన అమర్చుకొని మస్కారాను పెట్టుకోవచ్చు. వీటిని ఉపయోగించడం వల్ల ఏవీ కూడా కళ్లలోకి వెళ్లకుండా, పక్కలకు అంటుకోకుండా జాగ్రత్తపడొచ్చు.

ఫేస్ స్టీమర్

'ఫేషియల్ స్టీమర్'తో ఆవిరి పడితే క్షణాల్లో ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. ముఖంపై ముడతలు, మచ్చలు, పిగ్మెంటేషన్ వంటి సమస్యలు తగ్గుతాయి. 360 డిగ్రీలలో తిరిగే రొటేటబుల్ స్ప్రేయర్ నాజిల్‌తో కూడిన ఈ స్టీమర్‌ను అవసరానికి తగ్గట్టుగా దాని పొడవు పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. వీలుని బట్టి కూర్చుని లేదా పడుకుని కూడా డీప్ క్లీనింగ్ చేసుకోవచ్చు. ఎక్కడికైనా సులభంగా తీసుకుని వెళ్లొచ్చు.

పాదాల మెరుపు

ఇకపై పెడిక్యూర్ కోసం పార్లర్ చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ఎంచక్కా ఈ 'ఎలక్ట్రిక్ కాలస్ రిమూవర్' సహాయంతో నిమిషాల్లో పాదాలు మెరిసిపోతాయి. మల్టీఫంక్షనల్ పెడిక్యూర్ కిట్ ఇది. డెడ్ స్కిన్ రిమూవల్ హెడ్, నెయిల్ బఫర్ హెడ్, పాలిషింగ్ హెడ్.. అనే మూడు రోలర్ హెడ్స్‌తో ఉంటుంది. పవర్ బటన్ నొక్కితే పైన అమర్చిన హెడ్ గుండ్రంగా తిరుగుతూ పనిచేస్తుంది. ఇది మృతకణాలను తొలగించి పాదాలను మృదువుగా మార్చడమే కాకుండా బ్యాక్టీరియా పెరుగుదలనూ నిరోధిస్తుంది. దీనిలో లోస్పీడ్, హైస్పీడ్ అనే రెండు ఆప్షన్స్ ఉంటాయి.

# కల్తీ లేని నెయ్యి దొరుకుతుందా?

మంది ఎంత పెరిగినా, బజార్లో దొరికే నేతి మిఠాయిలకు కొదవుండదు. ఇక్కడే నెయ్యి తాజాదనం గురించి తార్కికంగా ఆలోచించాలి. స్వచ్ఛమైన నెయ్యిని పొందడం కోసం కల్తీలను పసిగట్టడంతో పాటు, ఇంట్లో స్వయంగా నేతిని తయారుచేసుకోగలిగే మెలకువల గురించి తెలుసుకోవాలి.

**కల్తీ లేని నెయ్యి దొరుకుతుందా?**

మంది ఎంత పెరిగినా, బజార్లో దొరికే నేతి మిఠాయిలకు కొదవుండదు. ఇక్కడే నెయ్యి తాజాదనం గురించి తార్కికంగా ఆలోచించాలి. స్వచ్ఛమైన నెయ్యిని పొందడం కోసం కల్తీలను పసిగట్టడంతో పాటు, ఇంట్లో స్వయంగా నేతిని తయారుచేసుకోగలిగే మెలకువల గురించి తెలుసుకోవాలి.మనం కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచుకుంటాం. పప్పుధాన్యాలు పండించుకుంటాం. కోళ్లు, మేకలను పెంచుకుంటాం! తిరగళ్లతో పిండ్లు ఇసురుకుం టాం! కానీ ఘన, ద్రవ రూపాల్లోని కొవ్వులను మాత్రం బయటి నుంచే కొనుక్కుంటూ ఉంటాం! వంటల కోసం, రుచి కోసం ఉపయోగించే నూనెలు, నెయ్యిలను ఇళ్లలో తయారు చేసుకునే సంప్రదాయం క్రమేపీ అడుగంటింది. అవసరం పెరగడం, ఉత్పత్తులు తగ్గడం వల్ల కల్తీలు సర్వత్రా సర్వసామాన్యపోయాయి. నెయ్యిలోని పోషక విలువల గురించి అవగాహన పెరిగిన తర్వాత, తాజా నెయ్యి కోసం వెంపర్లాట ఊపందుకుంది. కానీ కల్తీ లేని నెయ్యి బజార్లో దొరుకుతుందా? నిజానికి ఎంత ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నా, నూరు శాతం స్వచ్ఛమైన నెయ్యి దొరకని పరిస్థితి నెలకొని ఉంది. అయినా పిండి వంటల తయారీ కోసం, భోజనంలో రుచిని పెంచుకోవడం కోసం తరచూ నెయ్యి మీద ఆధారపడక తప్పడం లేదు. దాంతో మార్కెట్లో దొరికే బ్రాండెడ్ ఘీల మీద ఆధార పడుతున్నాం. లేదంటే గ్రామాల్లో గాలించి తెచ్చుకుంటు న్నాం. అయితే ఇలా మనం స్వచ్ఛమైన నెయ్యినే కొంటున్నామా?

కల్తీ నెయ్యిని ఇలా కనిపెట్టాలి

నెయ్యి విషయంలో కళ్లు, ముక్కు మనల్ని మోసం చేయలేవు.



ఘుమఘుమలాడుతూ, లేత బంగారు రంగులో కనిపించేది మాత్రమే స్వచ్ఛమైన నెయ్యి. రంగు, వాసనలు, గాఢతలో తేడాలు కనిపిస్తే, కొన్ని తేలికపాటి పరీక్షలతో నెయ్యిలో జరిగిన కల్తీని సునాయాసంగా కనిపెట్టవచ్చు.

అదెలాగంటే...పాల అవక్షేప పరీక్ష: తెల్ల పేపర్ లేదా ప్లేటు మీద ఒక స్పూను నెయ్యిని వేసి, కొన్ని గంటల పాటు అలాగే వదిలే యాలి. తర్వాత పేపర్, లేదా ప్లేటు మీద ఏవైనా మలినాలు, అవక్షేపాలు కనిపిస్తే ఆ నెయ్యి కల్తీదని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నెయ్యితో ఎలాంటి మరకలు ఏర్పడవు.

స్పష్టత, ఆకృతి: స్వచ్ఛమైన నెయ్యి పారదర్శకంగా ఉంటుంది. నున్నని టెక్స్‌చర్‌ను కలిగి ఉంటుంది. మసకగా ఉన్నా, కణుపులు కనిపించినా, ముద్దగా ఉన్నా దాన్లో కల్తీ జరిగిందని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నేయి, గది ఉష్ణోగ్రతలో ద్రవ రూపంలో ఉంటుంది.

బర్న్ టెస్ట్: ఒక టీ స్పూను నెయ్యిని ప్యాన్‌లో వేడి చేసి అది కల్తీదో కాదో కనిపెట్టవచ్చు. స్వచ్ఛమైన వేడి తగిలిన వెంటనే ఎలాంటి పొగలు, మాడు వాసనలను వెలువరించకుండా క్షణాల్లో కరిగిపోతుంది. మలినాలు కలిసిన నెయ్యి పొగలు, దుర్వాసనలను వెలువరిస్తుంది.నీళ్ల పరీక్ష: గోరువెచ్చని నీళ్లలో కొద్ది పాటి నెయ్యిని వేయాలి. నెయ్యి స్వచ్ఛమైనదైతే వెంటనే నీళ్లలో కరిగిపోతుంది. నీళ్లు కూడా స్పష్టంగా ఉంటాయి. ఒకవేళ ఏదానా మడ్డి, మలినాలు నెయ్యి నుంచి వేరుపడితే, అది కల్తీదని అర్థం చేసుకోవాలి.ఫ్రిజ్ పరీక్ష: నెయ్యిని కొన్ని గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. స్వచ్ఛమైన నెయ్యి హెచ్చుతగ్గులు లేకుండా సమంగా గడ్డకడుతుంది. దీన్లో వేర్వేరు పొరలు, స్ఫటికాలూ కనిపించవు. హెచ్చుతగ్గులతో కూడిన పొరలు, స్ఫటికాలూ కనిపిస్తే అది కల్తీ నెయ్యిని అర్థం.రుచి పరీక్ష: స్వచ్ఛమైన నెయ్యి నోట్లో వేసుకున్నప్పుడు వెన్నలా తగులుతుంది. కల్తీ నెయ్యి తేలికగా గొంతులోకి జారకుండా, దంతాలకూ, నాలుకకూ అంటుకుంటుంది.మరక పరీక్ష: స్వచ్ఛమైన నెయ్యి ఎలాంటి మరకలనూ ఏర్పరచదు. వస్త్రం మీద నెయ్యి మరక ఏర్పడినా, ఏవైనా అవక్షేపాలు మిగిలిపోయినా ఆ నెయ్యి కచ్చితంగా కల్తీదే!

# ఒబెసిటీ.. అధిక బరువే కాదు అంతకు మించి



ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న సమస్య ఒబెసిటీ. వ్యక్తుల ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం వంటి అనేక కారణాలతో ఇప్పుడు ఇదొక జీవనశైలికి సంబంధించిన అంశంగా మారింది. అందరూ దీనిని కేవలం అధిక బరువుతోనే కొలుస్తుంటారు. అయితే ఇది అంతకు మించిన తీవ్రమైన పరిస్థితిగా పరిగణించి పూర్తి స్థాయి చికిత్స చేయాలి అంటున్నారు కేర్ ఆసుపత్రికి చెందిన డా.బిపిన్ సేథీ. రోజువారీ జీవనం మీద ఒబెసిటీ ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. హృద్రోగం, డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్, కీళ్ల నొప్పులు.. ఇంకా అనేక ఇతర తీవ్రమైన అనారోగ్యాలతో పాటు కొన్ని రకాల కేన్సర్‌లకూ కారణమవుతుంది. కేవలం శారీరకమైనవే కాకుండా డిప్రెషన్, న్యూనతాభావం తదితర మానసిక సమస్యలకూ ఇది దోహదం చేస్తుంది.

సరైన కారణం గుర్తించాలి

ఒబెసిటీ విషయంలో వ్యక్తిగత బాధ్యతా రాహిత్యం, విల్‌పవర్ లోపించడం.. వంటివి చూపిస్తూ బాధితులపైనే పూర్తిగా నెపం వేస్తుంటారు. అలాగే కేవలం ఎక్కువ తినడం, వ్యాయామం లేకపోవడం వంటివి మాత్రమే ఒబెసిటీకి కారణం కావనేది అర్థం చేసుకోవాలి. దీనికి జన్యుపరమైన సమస్యలతో పాటు పరిసరాలు, వాతావరణం, ప్రవర్తన... ఇవన్నీ కూడా కారణాల్లో ఉండొచ్చు.. ఒబెసిటీ కారణాల గురించి మనకు తక్కువ అవగాహన ఉంది. హార్మోనల్ కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఏదేమైనా దీనిని సరైన రీతిలో అర్థం చేసుకునే దశలోనే మనం ఉన్నాం. కాబట్టి త్వరపడి ఏదోఒక కారణాన్ని నిర్ధారించుకుని చికిత్స సరికాదు.

**చికిత్సకు నిర్ణీత వ్యవధి**

ఒబెసిటీ బాధితులు కూడా తామేదో హార్మోనల్ సమస్య అని భావిస్తూ సరైన క్రమపద్ధతిలో కాకుండా త్వరితంగా సమస్య నుంచి బయటపడే మార్గాలు వెతుకుతుంటారు. అది సరైంది కాదు ఈ సమస్య నుంచి కోలుకోవడానికి జీవిత కాలపు ఆరోగ్య నిపుణుల అవసరం ఉంటుంది. వ్యక్తులకు సంబంధించిన డైట్ మాత్రమే కాకుండా తినే ఆహారం, అలాగే వ్యాయామాలను పరిశీలించాల్సి ఉంది. నెగిటివ్ కేలరీ బ్యాలెన్స్‌తో పాటు ఇదొక దీర్ఘకాలికం కొనసాగాల్సిన ప్రక్రియ, అంతే తప్ప శరవేగంగా ఫలితాలను ఆశించడం, వెంటనే బరువు తగ్గాలని కోరుకోవడం, పెళ్లి వంటి వేడుకల కోసం హడావుడిగా సర్జరీ ప్లాన్స్ ఎంచుకోవడం వల్ల సరైన ఫలితం రాదు.

**తీవ్రతకు తగ్గ చికిత్స**

వ్యక్తిగత ఒబెసిటీ తీవ్రతపై ఆధారపడి దీనికి చికిత్స ఉండాలి. అలాగే వ్యక్తిగత ఆరోగ్య ప్రమాదాలు, మానసిక ప్రవర్తన శైలులు, మెటబాలిక్ క్యారెక్టరిస్టిక్స్‌లతో పాటు గతంలోని అధిక బరువు తగ్గించుకునే యత్నాలు వాటి ఫలితాలు కూడా దీనిలో పరిగణనలోకి తీసుకోవాలి. వ్యక్తిగత చికిత్సా పద్ధతులు అనుసరిస్తూ మల్టీ లెవల్ ఒబెసిటీ మేనేజ్‌మెంట్ నెట్‌వర్క్‌తో సమన్వయంతో పనిచేస్తే లక్ష్యం చేరుకోవడానికి వీలవుతుంది. ఒబెసిటీ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యం కలిగిన బృందం పనిచేయాలి.

చికిత్సలో భాగంగా అన్ని రకాల ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. రోగి జీవనశైలికి, ప్రాధామ్యాలకు నప్పేలా దీనిని డిజైన్ చేస్తారు. మందుల వాడకాన్ని సమీక్షించడం, మార్పు చేర్పులు, పోషకాల సహకారం, శారీరక కార్యకలాపాలు పెంచడం, కౌన్సిలింగ్, రోగికి నప్పేదైతే బేరియాట్రిక్ సర్జరీ.. వంటివన్నీ ఇందులో భాగంగా ఉంటాయి. పలువురు భావిస్తున్నట్టు ఇది ఒంటరిగా పోరాడే పరిస్థితి కాదు. వైద్య నిపుణుల పర్యవేక్షణ సహకారం అవసరం.

# ముఖానికి మీగడ రాస్తే...

చలికాలంలో ముఖం మీద చర్మం పొడిగా మారి పగులుతుంది. చిన్న పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. దీనికి మన పెద్దలు చెప్పిన పరిష్కారం పాల మీగడ రాయడమే. పాలను బాగా కాచి చల్లార్చిన తరవాత దానిపై ఒక పొర ఏర్పడుతుంది. దీనినే మీగడ అంటారు. దీనిని ఎక్కువగా స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటారు. శీతాకాలంలో చర్మ సంరక్షణకు మీగడను మించింది లేదు.

**ఎలా రాయాలంటే...**

ముందుగా ముఖాన్ని సున్నిపిండితో రుద్ది శుభ్రం చేసుకోవాలి. తరవాత కొద్దిగా పాల మీగడను తీసుకుని ముఖానికి రాసి వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావు గంట తరవాత మీగడ పూర్తిగా చర్మంలోకి ఇంకిపోతుంది. గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకుని మెత్తని టవల్‌తో అద్దుకోవాలి. సాధ్యమైనంత వరకు సబ్బులు వాడకపోవడం మంచిది.

మీగడ రాయడం వల్ల...

ముఖానికి, చేతులకు మీగడ రాసుకోవడం వల్ల చర్మం మీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి. మీగడలోని లాక్టిక్ యాసిడ్ చర్మం మీద ఉన్న ఎపిడెర్మల్, డెర్మల్ పొరల్లో కొత్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల చర్మం మృదువుగా కొత్తకాంతితో మెరిపిసోతుంది.

చలి గాలుల వల్ల చర్మం తేమను కోల్పోతుంది. ఇలాంటపుడు మీగడను తరచూ రాస్తూ ఉంటే చర్మానికి తేమ అంది పగుళ్లు ఏర్పడవు. చిన్న పిల్లల చర్మం కోమలంగా ఉంటుంది. రసాయనాలతో కూడిన క్రీమ్‌లు రాయడం అంత మంచిది కాదు. వీరికి పాల మీగడ అద్భుతంగా పనిచేస్తుంది. మీగడలోని కొవ్వు పదార్థం చర్మానికి పోషణను అందిస్తుంది.

ముఖానికి మీగడ రాసి మర్దన చేయడం వల్ల చర్మ రంధ్రాలన్నీ తెరచుకుంటాయి. వాటిలో చేరిన మురికి, ఇతర వ్యర్థ పదార్థాలన్నీ తొలగిపోతాయి. చర్మం శుభ్రపడడం వల్ల మొటిమలు, గుల్లలు రావు. బయటికి వెళ్లే ముందు ముఖానికి కొద్దిగా పాల మీగడ రాసుకుంటే ఎండ వల్ల చర్మం నల్లబడకుండా ఉంటుంది. సూర్యరశ్మిలోని ప్రమాదకర కిరణాలనుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది.



మీగడలో కొద్దిగా ఓట్స్ పొడి లేదా పంచదార కలిపి దానితో ముఖాన్ని మెల్లగా రుద్దితే చర్మం మృదువుగా మారుతుంది. మీగడలోని పోషకాలు చర్మంలోకి చేరి ముడతలు రాకుండా కాపాడతాయి. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. మీగడను చేతులకు రాసుకున్నా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

కొంతమందికి ఎండ తగలగానే ముఖం ఎర్రగా కందిపోతుంది. ఇటువంటి వారికి పాల మీగడ బాగా పనిచేస్తుంది. ఎండ వల్ల కలిగే సురుకుపోటును నివారిస్తుంది.

# వృద్ధాప్య లక్షణాలకు చెక్ !

వయసు పెరుగుతున్నా కొద్దీ సహజసిద్ధంగా వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తుంటాయి. అయితే కొంతమంది వయసులో ఉండగానే ఈ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఇంట్లోనే ఈ ఏజింగ్ లక్షణాలకు చెక్ చెప్పొచ్చు.



కొద్దిగా నిమ్మరసాన్ని తీసుకొని ముఖంపై ఏజింగ్ లక్షణాలు కనిపిస్తున్న దగ్గర రాయాలి. కొద్దిసేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ చిట్కా పాటిస్తున్నప్పుడు ఎండకు వెళ్లకూడదు.

-ఆపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఏజ్ స్పాట్స్ వద్ద కొంచెం ఎక్కువగా రాయాలి. 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి.

-ఏజింగ్ లక్షణాలను తగ్గించడానికి ఆముదం మంచిగా పనిచేస్తుంది. కొదిగా ఆముదాన్ని ముఖానికి రాసి, మరనా చేయాలి. తరాత రోజూ వాడే సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. పాలను ముఖానికి పట్టించి, మర్దన చేస్తే.. సున్నితంగా మారుతుంది. మృతకణాలను తొలిగించడంలో పాలు మేలు చేస్తాయి. పాలలో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మ రక్షణకు ఉపయోగపడుతుంది.తాజా టమోట ముక్కలతో ముఖాన్ని మర్దన చేయాలి. రసం ముఖానికి పట్టేంత వరకూ ఆగాలి. తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.పసుపులో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి.. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఇలా ప్రతిరోజూ చేస్తుంటే ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## న్యూ ఇయర్ ముందు మళ్లీ పెరిగిన బంగారం, వెండి రేట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** వెండికొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే ఈరోజు బంగారం రేట్లను ఓసారి తనిఖీ చేయండి మరి. ఎందుకంటే కొత్త సంవత్సరానికి ముందు బంగారం, వెండి ధరలు మళ్లీ స్వల్పంగా పెరిగాయి. ఈ క్రమంలో ఈరోజు (డిసెంబర్ 30న) ఉదయం 6.15 గంటల నాటికి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,490కు చేరుకోగా, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.77,980గా ఉంది. ఇది నిన్న 24 క్యారెట్ల బంగారం ధరతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. ఇక వెండి ధరల గురించి మాట్లాడితే నేడు కిలో వెండి ధర రూ.92,300కి చేరుకుంది. ఇది నిన్నటితో పోల్చితే వెయ్యికిపైగా పెరిగింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 77,840కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 71,325కు చేరుకుంది. ఇక ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,980కి చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,500కి చేరింది.మరోవైపు యూపీ రాజధాని లక్నోలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,490కి చేరగా, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.77,980 స్థాయిలో ఉంది. ఆగ్రాలోలో కూడా 22 క్యారెట్ గోల్డ్ రేటు రూ. 71,490 కాగా, 24 క్యారెట్ పసిడి రూ. 77,980గా ఉంది. అయితే రానున్న రోజుల్లో ఈ బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## ఎల్పీజీ ధరల నుంచి పెన్షన్ వరకూ.. కొత్త వసంతంలో మధ్యతరగతిపై ప్రభావం చూపే అంశాలివే..!



**ముంబై-నవభూమి:**మరో రెండు రోజుల్లో కొత్త వసంతంలో అడుగు పెట్టబోతున్నాం. కొత్త వసంతం తీసుకొచ్చే ఉత్సాహంతోపాటు పలు ఆర్థికపరమైన మార్పులు కూడా చోటుచేసుకోనున్నాయి. ఎల్పీజీ గ్యాస్ ధరలు మొదలు జీఎస్టీ వ్యవస్థలో కొత్త నిబంధనల వరకూ నేరుగా మధ్య తరగతి ప్రజలపైనే ప్రభావం చూపుతాయి. వాటిని గురించి తెలుసుకుందామా..?!

**పెరగనున్న గ్యాస్ సిలిండర్ల ధరలు.. విమాన యానం కాస్ట్లీ**

గృహ వినియోగ, వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరలు జనవరి ఒకటో తేదీ నుంచి పెరగనున్నాయి. ఇటీవలి కాలంలో 14 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరలు స్థిరంగా కొనసాగుతున్నా, 19 కిలోల వాణిజ్య సిలిండర్ల ధరలు హెచ్చు తగ్గులకు గురవుతున్నాయి. గృహ వినియోగ, కమర్షియల్ సిలిండర్ల ధరలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యుయల్ (ఏటీఎఫ్) ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఏటీఎఫ్ ధరలకు అనుగుణంగా విమాన టికెట్ల ధరలూ పెరుగుతాయి.

**ఈపీఎస్ పెన్షన్ విత్ డ్రా ప్రక్రియ సరళతరం**

ఉద్యోగు భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పెన్షనర్లు జనవరి ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఏ బ్యాంకు నుంచైనా పెన్షన్ విత్ డ్రా చేసుకునేందుకు అనుమతి ఇస్తూ ఈపీఎఫ్ఓ కొత్త నిబంధన తెచ్చింది. దీనివల్ల పెన్షనర్లకు పెన్షన్ విత్ డ్రా మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందుకోసం అదనపు ధృవీకరణ అవసరమే లేదు. దీనివల్ల పెన్షనర్ల పెన్షన్ విత్ డ్రాయల్ ప్రక్రియ తేలికవుతుంది.

**ఫీచర్ ఫోన్లలో యూపీఐ లావాదేవీల పరిమితి పెంపు**

స్మార్ట్ ఫోన్లతోపాటు ఫీచర్ ఫోన్లలోనూ యూపీఐ చెల్లింపుల విధానం అమల్లోకి తెచ్చింది ఆర్బీఐ. ఈ ఫీచర్ ఫోన్ల ద్వారా రోజూ రూ.5,000 నుంచి రూ.10 వేల వరకూ పేమెంట్స్ చేయొచ్చు. 2025 జనవరి ఒకటో తేదీ నుంచి ఈ విధానం అమల్లోకి రానున్నది. అలాగే ఫీచర్ ఫోన్ల నుంచి ఆన్ లైన్ చెల్లింపులు కూడా చేయొచ్చు.

**రైతు రుణ పరిమితి పెంచిన ఆర్బీఐ**

వ్యవసాయ రంగానికి మద్దతుగా ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకున్నది. ఎటువంటి గ్యారంటీ లేకుండా రైతులు ఎకరం భూమిపై రూ.2 లక్షల వరకూ రుణం తీసుకోవచ్చు. ఇంతకు ముందు ఎకరానికి రూ.1.6 లక్షల పరిమితి మాత్రమే ఉండేది. వ్యవసాయ కార్యకలాపాలు, దిగుబడి పెంపు, మెరుగైన జీవన విధానం కోసం ఈ రుణాలు వాడొచ్చు.

**జీఎస్టీలో నూతన మార్పులు**

జనవరి ఒకటో తేదీ నుంచి జీఎస్టీ పోర్టల్ యాక్సెస్ చేయడానికి వ్యాపారులు మల్టీ ఫ్యాక్టర్ అథంటికేషన్ (ఎంఎఫ్ఏ) విధానం అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఓటీపీ వంటి అదనపు ధృవీకరణ చర్యల కోసం ఈ సెక్యూరిటీ లేయర్ తీసుకొచ్చారు. చివరి 180 రోజులకు మాత్రమే ఇక నుంచి ఈ-వే బిల్లులకు సంబంధించిన డాక్యుమెంట్లు జనరేట్ అవుతాయి. కనుక కంపెనీలు, వ్యాపారులు తమ కాంటాక్ట్ వివరాలు అప్ డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే మల్టీ ఫ్యాక్టర్ అథంటికేషన్ కోసం తమ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

**మార్కెట్ ఇండెక్స్ ఎక్స్ పైరీ తేదీల్లో మార్పులు**

సెన్సెక్స్, సెన్సెక్స్-50, బ్యాంకెక్స్ ఎక్స్ పైరీ తేదీల్లో ప్రధాన మార్పు రానున్నది. సంప్రదాయంగా ఈ ఇండెక్సులు శుక్రవారాల్లో ఎక్స్ పైరీ అవుతాయి. జనవరి ఒకటో తేదీ నుంచి మంగళవారాల్లోనే ఎక్స్ పైరీ అవుతాయి. దీనికి తోడు త్రైమాసికం, అర్ధ సంవత్సర కాంట్రాక్టులు తదుపరి నెల చివరి మంగళవారం ఎక్స్ పైరీ అవుతాయి. ఇక నిఫ్టీ-50లో మంత్లీ కాంట్రాక్ట్స్ గురువారం ఎక్స్ పైరీ అవుతాయి.

## పరివర్తన దశలో మార్కెట్లు.. ఆదాయాల మందగమనం మధ్య మితమైన రాబడి అంచనాలు పీఎల్ అసెట్ మేనేజ్‌మెంట్

**ముంబై-నవభూమి:** ప్రభుదాస్ లీలాధర్ పీఎల్ క్యాపిటల్ గ్రూప్ అసెట్ మేనేజ్‌మెంట్ విభాగం, భారతదేశంలోని అత్యంత విశ్వసనీయ ఆర్థిక సేవల సంస్థల్లో ఒకటైన పీఎల్ అసెట్ మేనేజ్‌మెంట్ తన తాజా 'పీఎంఎస్ స్ట్రాటజీ అప్‌డేట్స్ అండ్ ఇన్‌సైట్స్' నివేదికను విడుదల చేసింది. మార్కెట్ ప్రస్తుతం తక్కువ అస్థిరతతో పరివర్తన దశను ఎదుర్కొంటోందని మరియు మొమెంటం కారకాలు ప్రతి ఒక్కటి గత మూడు నెలల్లో సుమారు 6% క్షీణిస్తున్నాయని ఈ నివేదిక పేర్కొంది.

గత మూడు నెలల్లో వరుసగా 6% 7% క్షీణతను చూపినప్పటికీ, నాణ్యత అనేది అవుట్ పర్ఫా ర్మ్డ్ విలువను కొద్దిగా అధిగమించింది. మదుపరుల ఎలివేటెడ్ వాల్యు యేషన్‌లు, చక్రీయ దిద్దుబాట్లు మరియు నిదానమైన ఆదాయాల పెరుగుదల కారణంగా పెట్టుబడి శైలులలో ఈ విస్తృతమైన క్షీణత అనేది మార్కెట్ యొక్క కొనసాగుతున్న సర్దుబాట్లను నొక్కి చెబుతుంది. ఏ ఒక్క శైలి కూడా స్పష్టమైన లీడర్ గా ఉద్భవించనప్పటికీ, ఈ దశ స్థిరీకరణ మరియు సంభావ్య రీబౌండ్ కోసం అవకాశాలను అందిస్తుంది.పీఎల్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రొప్రైటరీ క్వాంట్ మోడల్స్ ప్రకారం, విస్తృత ఈక్విటీ మార్కెట్‌లు ఖరీ దైనవిగా కనిపిస్తాయి కానీ గణనీయంగా ఓవర్ వాల్యూతో ఉండవు, దాదాపు 50% స్టాక్‌లు వాటి 3-సంవత్స రాల సగటు ధర-బుక్ రేషియో కంటే ఎక్కువగా ట్రేడవుతున్నాయి. నిఫ్టీ 50 యొక్క వెనుకంజలో ఉన్న దాని 3-సంవత్సరాల సగటుతో సమలేఖనం అయింది, లార్జ్-క్యాప్ స్టాక్‌లు దిద్దుబాట్లను ఎదుర్కొన్నాయి, ప్రధానంగా అవుట్‌ఫ్లోలు మరియు చైనా వైపు తిరిగి కేటాయించడం కారణంగా. మరోవైపు, స్మాల్-క్యాప్, మిడ్-క్యాప్ సూచీలు 35.5% 43.8% నిష్పత్తుల వెనుకబాటుతో ట్రేడింగ్ అవుతున్నాయి, ఇది వాటి సంబంధిత 3 సంవత్సరాల సగటు కంటే సుమారు 18% 32% ప్రీమియంలను ప్రతిబింబిస్తుంది.




నవంబర్‌లో నిఫ్టీ 50, బిఎస్ఇ సెన్సెక్స్ 0.31% క్షీణించినందున, రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ నవంబర్‌లో కొనసాగింది. పేలవమైన క్యూ2 ఆదాయాల సీజన్‌లో ఓవర్ స్ట్రెచ్డ్ వాల్యుయేషన్‌ల కారణంగా ఈ ఆందోళనలు ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ ఆదాయాలు జూన్ 2020 నుండి నెమ్మదిగా వాటి వృద్ధిని నమోదు చేశాయి. భారతదేశ జీడీపీ వృద్ధి కూడా జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4%కి తగ్గింది, ఇది %ు3 ఖీ%23 నుండి బలహీనమైనది, తయారీ మైనింగ్‌లో నెమ్మదైన పనితీరుతో నడిచింది. ఇది, యూఎస్ బాండ్ రాబడులు పెరగడం బలమైన డాలర్‌తో కలిసినవంబర్‌లో ఎఫ్ఐఐ అవుట్‌ఫ్లో 45,974 కోట్లు గా ఉండేందుకు దారితీసింది.

నవంబర్‌లో, అస్థిరత మధ్య 1.4% క్షీణించింది. జూన్ రీబ్యాలెన్స్ నుండి, నాణ్యమైన, తక్కువ-అస్థిరత వ్యూహంపై దృష్టి సారించింది. విస్తృత మార్కెట్ ట్రెండ్‌లతో సమలేఖనం చేస్తూ ప్రతికూల ప్రమాదాన్ని సమర్థ వంతంగా తగ్గించింది. వాల్యూ-మొమెంటం టిల్ట్ నుండి దూరంగా మారడం అస్థిరతను మరింత తగ్గించింది.అక్టోబర్ రీబ్యాలెన్స్‌కు అనుగుణంగా, ఆటో రంగానికి ఎక్స్‌పోజర్‌ని తగ్గించింది మరియు ఇప్పుడు పోర్ట్‌ఫోలియోలో 65% కలిగి ఉన్న హెల్త్‌కేర్, ఐటీ, కన్స్యూమర్ గూడ్స్ వంటి నాన్-సైక్లికల్ రంగాలకు కేటా యింపులను పెంచింది. అదనంగా, పీఎంఎస్ ఫండ్, పోర్ట్‌ఫోలియో బీటాను తగ్గించడానికి మరియు పెరుగు తున్న అస్థిరతను నిర్వహించడానికి డిఫెన్సివ్ ఫైనాన్షియల్స్ కు 13% కేటాయింపును నిర్వహిస్తుంది.AQUA అనేది భారతదేశ మార్గదర్శక స్టైల్-అడాప్టివ్ స్టైల్-అగ్నోస్టిక్ వ్యూహం. ఇది మార్కెట్ చక్రాలలో స్థిరమైన మరియు అదరపు రిస్క్ లేకుండా అధిక రాబడులను పొందడానికి రూపొందించబడింది. ప్రారంభం నుండి, AQUA 44% వార్షిక రాబడిని అందించింది, అదే కాలంలో 28.3% లాభపడిన బెంచ్ మార్క్‌ను అధిగమించింది.ప్రభుదాస్ లీలాధర్ పీఎల్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, పీఎల్ అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్, క్వాంట్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీస్ హెడ్ శ్రీ సిద్ధార్థ్ వోరా ఈ సందర్భంగా మాట్లాడుతూ, "యుఎస్-చైనా ఉద్రిక్తతలు మరియు అధికారం చేపట్టిన తర్వాత చైనా వస్తువులపై 10% సుంకాలను ట్రంప్ ప్రతిపాదించడంతో ప్రపంచవ్యాప్తంగా కొందరు ఇన్వెస్టర్లు తమ భారతదేశ కేటాయింపులను పెంచుతూనే చైనాకు ఎక్స్పోజర్‌ని తగ్గిస్తున్నారు. దీంతో అవుట్‌ఫ్లోలు తగ్గడం ప్రారంభించాయి (అక్టోబర్ నాటి అవుట్‌ఫ్లోలు 115,000 కోట్లతో పోలిస్తే). రాబోయే కాలానికి చూస్తే, ప్రధాన ట్రిగ్గర్లు లేనప్పుడు విస్తృత మార్కెట్లు శ్రేణికి కట్టుబడి ఉండవచ్చు. అయితే, వినియోగదారుల సెంటిమెంట్‌ను మెరుగుపరచడం, ఎఫ్ఐఐ అవుట్‌ఫ్లోలను సడలించడం స్వల్పకాలిక మెరుగుదలని అందిస్తుంది. మదుపరులు తమ అంచనాలను నియంత్రించాలి.

## బ్యాంకింగ్ ఆటో స్టాక్స్ ఎఫెక్ట్.. నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఇవీ డిటెయిల్స్..!



**ముంబై-నవభూమి:**అంతర్జాతీయ బలహీన సంకేతాల నేపథ్యంలో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ -30 ఇండెక్స్ సెన్సెక్స్ 450.94 పాయింట్లు పతనమై 78,248.13 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 79,092.70 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 78,077.13 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 168.50 పాయింట్లు నష్టంతో 23,644.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో నిఫ్టీ 23,915.35 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 23,618.90 పాయింట్ల మధ్య ట్రేడయింది. బ్యాంకింగ్, ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్డీఎఫ్సీ బ్యాంకు స్టాక్స్‌తో సూచీలు పతనం అయ్యాయి. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో టాటా మోటార్స్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) షేర్లు పతనం అయ్యాయి. మరోవైపు, జొమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్ ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు లబ్ధి పొందాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ నాలుగు పైసలు నష్టంతో రూ.85.52 వద్ద స్థిర పడింది. మరోవైపు, అంతర్జాతీయంగా క్రూడాయిల్ బ్యారెల్ 73.98 డాలర్లు, ఔన్స్ బంగారం 2625 డాలర్లు పలికింది.బేర్' చూపులతో ఎన్ఎస్ఈ-50లోని 50 స్టాక్స్ లో 38 నష్టాల్లోనే ముగిశాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందాల్కో, టాటా మోటార్స్, ట్రెంట్, విప్రో తదితర సంస్థలు 2.32 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు అదానీ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, శ్రీరాం ఫైనాన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్ సహా 11 స్టాక్స్ 7.26 శాతం వరకూ లాభ పడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం లబ్ధి పొందగా, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 ఇండెక్స్ 0.62 శాతం పతనమైంది. వివిధ సెక్టార్ల ఇండెక్సుల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఫైనాన్షియల్స్, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్స్, నిఫ్టీ రియాల్టీ తదితర ఇండెక్స్‌లు 1.87 శాతం వంకూ నష్టపోగా, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్ కేర్, నిఫ్టీ టెలికం ఇండెక్స్‌లు 1.62 శాతం వరకూ లాభ పడ్డాయి.

## పది నిమిషాలకో లగ్జరీ కారు సేల్.. ప్రీమియం కార్లపై పెరుగుతున్న మోజు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** కరోనా మహమ్మారి తర్వాత ప్రతి ఒక్కరూ పర్సనల్ మొబిలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందునా స్పేసియస్‌గా ఉండే ఎస్ యూవీ కార్లతోపాటు లగ్జరీ కార్ల పైనా మోజు పారేసుకుంటున్నారు. 2024లో ప్రతి గంటకు ఆరు రూ.50 లక్షలపై చిలుకు ధర గల లగ్జరీ కార్లు కొనుగోలు చేశారు. ఐదేండ్ల క్రితం గంటకు రెండు లగ్జరీ కార్లు మాత్రమే అమ్ముడయ్యేవి. సంపన్న వినియోగదారుల పునాది క్రమంగా పెరుగుతుండటంతో ప్రీమియం కార్లకు గిరాకీ పెరుగుతోంది. లగ్జరీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను గమనించిన కార్ల తయారీ సంస్థలు 2025లో రెండు డజన్లకు పైగా కొత్త మోడల్ కార్లను ఆవిష్కరించేందుకు సిద్ధం చేసుకుంటున్నాయి. బేస్ పెరుగుతున్నా కొద్దీ.. 50 వేల కార్లు అమ్ముడవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.లగ్జరీ కార్లలో ఒకటైన ఆడీ ఇండియా అధిపతి బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రీమియం కార్లకు గిరాకీ పెరిగిందన్నారు. 2025లో లగ్జరీ కార్ల మార్కెట్ 8-10 శాతం పెరుగుతుందని అంచనా వేశారు. మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ కం సీఈఓ సంతోష్ అయ్యర్ మాట్లాడుతూ స్థిరమైన ఆర్థిక ఫలితాలతోపాటు వినియోగదారుల సానుకూల సెంటిమెంట్ వల్ల లగ్జరీ కార్ల మార్కెట్ పెరుగుతుందన్నారు.దేశీయంగా లగ్జరీ కార్ల విక్రయాల్లో మెర్సిడెజ్-బెంజ్ ముందు వరుసలో నిలిచింది. 2024లో దాదాపు 20 వేల యూనిట్ల కార్లు అమ్ముడవుతాయని కంపెనీ యాజమాన్యం భావిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 13 శాతం వృద్ధిరేటు ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 14,379 యూనిట్లు అమ్ముడయ్యాయి. పెరుగుతున్న గిరాకికి అనుగుణంగా 2025లో కొత్త కార్ల ఆవిష్కరణతోపాటు మార్కెట్ విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది.బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఐదు శాతం సేల్స్ పెంచుకున్నది. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 10,556 కార్లు విక్రయించింది. ఆడి ఇండియా సేల్స్ 16 శాతం తగ్గాయి. సప్లయ్ చైన్‌లో ఇబ్బందుల వల్లే ఈ పరిస్థితి నెలకొందని, 2025లో రికవరీకి కొత్త ఉత్పత్తులను ఆవిష్కరిస్తామని ఆడి ఇండియా చెబుతోంది. గతేడాదితో పోలిస్తే లగ్జరీ కార్ల విక్రయాలు పెరిగినా.. మొత్తం కార్ల విక్రయాల్లో వీటి వాటా ఒక శాతం పై చిలుకే. ప్రధాన గ్లోబల్ ఎకానమీల్లో భారత్‌లో లగ్జరీ కార్ల విక్రయాలు తక్కువ.నైట్ ఫ్రాంక్ వెల్త్ రిపోర్ట్ -2024 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా భారత్‌లోనే అత్యధిక నికర సంపద పెంచుకున్న బిలియనీర్ల సంఖ్య పెరుగుతోంది. 2023లో భారత బిలియనీర్ల సంఖ్య 13,263 నుంచి 2024లో 50 శాతం పెరిగి 19,908లకు చేరుకుంది. చైనా, తుర్కియే, మలేషియాలను కూడా భారత్ దాటేసింది. సంపన్న వర్గం పెరిగినా కొద్దీ లగ్జరీ కార్లకు గిరాకీ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2020లో 20,500 లగ్జరీ కార్లు అమ్ముడైతే, 2021లో 28,600, 2022లో 38 వేలు, 2023లో 48 వేల లగ్జరీ కార్లు అమ్ముడయ్యాయి. 2024లో 50 వేల కార్లు అమ్ముడవుతాయని నిర్ధారించగా, వచ్చే ఏడాది 53,000-54,000 కార్ల అమ్మకాలకు అవకాశం ఉందని తెలుస్తున్నది.

## బీమా సేవలు బాగోలేవా.. అయితే పోర్టబిలిటీతో మరో పాలసీ తీసుకోండిలా..




**ముంబై-నవభూమి:**బీమాతో వచ్చే భరోసానే వేరు. ప్రధానంగా ఓ మంచి ఆరోగ్య బీమా పాలసీ.. అత్యవసర సమయాల్లో కొండంత అండగా నిలుస్తుంది. అయితే అదే పాలసీ.. సరైన కవరేజీ ఇవ్వకున్నా, సదరు బీమా సంస్థ సేవలు అసంతృప్తికరంగా ఉన్నా అనవసరపు భారమే అవుతుంది. అందుకే మన అంచనాలకు తగువిధంగా లేని ఆరోగ్య బీమా పాలసీలను పోర్టబిలిటీ ద్వారా మార్చుకునే సౌలభ్యం ఇప్పుడున్నది. అది ఎలాగో మీకు తెలుసా?

ఆరోగ్య బీమా పోర్టబిలిటీ అంటే?

ఆరోగ్య బీమా పోర్టబిలిటీ.. పాలసీదారులకు తమ ప్రస్తుత హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని బీమా ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతినకుండా మరో కొత్త ఇన్సూరర్‌కు మార్చుకునేలా సహాయపడుతుంది. నో-క్లెయిం బోనస్, వెయిటింగ్ పీరియడ్ క్రెడిట్, ఇతర లాభాలను యథతథంగా ఉండేలా చేస్తుంది. ఉదాహరణకు మీకు ఓ రూ.10 లక్షల ఆరోగ్య బీమా ఉన్నది. ఎన్నో ఏండ్లుగా దీనికి ప్రీమియంలు చెల్లిస్తూనే ఉన్నారు. క్రమేణా ఆ ప్రీమియంలు పెరుగుతున్నా.. మీకు మీ బీమా సంస్థ క్లెయింలను సెటిల్మెంట్ చేస్తున్న తీరు మాత్రం నచ్చడం లేదు. ఈ సమయంలోనే రూ.15 లక్షల కవరేజీతో మరో బీమా సంస్థలో ఓ పాలసీ మీ దృష్టికొచ్చింది. పైగా దీనికి ఇప్పుడున్న ప్రీమియంల కంటే తక్కువే. దాంతో కొత్త పాలసీకి మారాలనుకున్నారు. అప్పుడు పోర్టబిలిటీ సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. దీనివల్ల మీ బీమా కవరేజీ రూ.10 లక్షల నుంచి 15 లక్షలకు పెరుగుతుంది. పాత పాలసీలో ఏవైనా నో-క్లెయిం బోనస్‌లున్నా అవీ వర్తిస్తాయి. అలాగే ప్రీమియంలూ తగ్గుతాయి. నెట్‌వర్క్ హాస్పిటల్స్, మెటర్నిటీ లేదా తీవ్ర అనారోగ్య సమస్యల కవరేజీ కూడా బాగుంటుంది.

గుర్తుంచుకోండి..

ప్రస్తుత పాలసీ గడువు ముగియడానికి కనీసం 45 రోజుల ముందుగానే మీరు కోరుకున్న కొత్త సంస్థకు బీమా పోర్టబిలిటీ విజ్ఞప్తిని చేసుకోవడం మంచిది.

పోర్టబిలిటీ ద్వారా ఆన్‌లైన్‌లో ఆరోగ్య బీమాను తీసుకోవాలనుకుంటే ప్రీమియం రేట్లు, కవరేజీ, నెట్‌వర్క్ హాస్పిటల్స్, క్లెయిం సెటిల్మెంట్ రేషియో వంటివి వివిధ సంస్థల్లో ఎలా ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించండి. ఇందుకోసం ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్స్‌ను వాడుకోండి.పోర్టబిలిటీ ఫారంలో మీ ఆరోగ్య సమస్యల వివరాలు, ప్రస్తుత పాలసీ, గత క్లెయింలు తదితర సమాచారాన్ని దాచకుండా ఇవ్వండి.సంప్రదాయ పద్ధతిలో మీ ప్రస్తుత బీమా పాలసీని ఇతర సంస్థల్లోకి మార్చుకోవాలనుకుంటే ఆయా కంపెనీల ఆఫీసులను సంప్రదించడం ఉత్తమం.

## రాజకీయ సుస్థిరత.. సమర్థ వృద్ధిరేటు.. రియాల్టీలో పెరుగుతున్న సంస్థాగత పెట్టుబడులు..!




**ముంబై-నవభూమి:**గతంతో పోలిస్తే రియాల్టీ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. సొంతిండ్లకు, గోదాములకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతన్నది. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ సంస్థల్లో సంస్థాగత పెట్టుబడులు క్రమంగా పుంజుకుంటున్నాయి. 2023తో పోలిస్తే దేశీయ రియాల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడులు 51 శాతం వృద్ధి చెందాయని ప్రముఖ రియాల్టీ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. 2023లో రియాల్టీ సంస్థల్లో సంస్థాగత ఇన్వెస్టర్లు 5.878 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడితే, ఈ ఏడాది 8.878 బిలియన్ డాలర్లకు పెరిగింది.

ఇక విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు కూడా 63 శాతం పుంజుకున్నాయి. రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లోకి 45 శాతం, ఆఫీసు భవనాల నిర్మాణంలో 28 శాతం, గోదాముల నిర్మాణంలోకి 23 శాతం పెట్టుబడులు వచ్చి చేరాయి. 'రియాల్టీ రంగంలో 2024 ఒక మైలురాయిగా నిలువనున్నది. ఇన్వెస్టర్లకు రియాల్టీ సంస్థల మధ్య జరిగిన 78 ఒప్పందాల్లో రియల్ ఎస్టేట్ రంగంలోకి 8.9 బిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చి చేరాయి. 2007 తర్వాత రియాల్టీ రంగంలో రికార్డు స్థాయిలో సంస్థాగత పెట్టుబడులు రావడం ఇదే ప్రథమం. 2007లో రియాల్టీ రంగంలోకి 8.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చి చేరాయి. రియాల్టీ రంగ పెట్టుబడుల్లో ప్రధాన వాటా రెసిడెన్షియల్ సెగ్మెంట్‌దే.

2023తో పోలిస్తే ఆఫీసు భవనాల సెగ్మెంట్ పెట్టుబడులు మాత్రం 17 శాతం తగ్గుముఖం పట్టాయని జేఎల్ఎల్ ఇండియా పేర్కొంది. జేఎల్ఎల్ ఇండియా సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ క్యాపిటల్ మార్కెట్స్ లతా పిళ్లై మాట్లాడుతూ.. 'సమర్థవంతమైన వృద్ధి, రాజకీయ సుస్థిరత వంటి కారణాలతో అంతర్జాతీయ ఆర్థిక రంగం నేపథ్యంలో భారత్‌లో వైవిధ్య భరితమైన పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. 2023 నుంచి దేశీయంగా రియాల్టీ రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు 2024లోనూ కొనసాగాయని గుర్తు చేశారు. 2019-22 మధ్య సగటున రియాల్టీ రంగంలో 19 శాతం సంస్థాగత పెట్టుబడులు ఉంటే, ఈ ఏడాది అది 37 శాతానికి పెరిగిందన్నారు.

## ఒకవైపు టారిఫ్ పెంపు.. మరోవైపు శాటిలైట్ బ్రాడ్ బాండ్.. టెలికం కంపెనీలకు జంట సవాళ్లు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్.. ఫోన్ వాడాలన్నా.. అందులో యూ-ట్యూబ్‌లు వీక్షించాలన్నా.. వాట్సాప్ చాటింగ్ చేయాలన్నా.. వార్తలు చూడాలన్నా డేటా కావాలి.. డేటా కోసం రీచార్జ్ చేసుకోవాలి. దేశంలో ప్రస్తుతం 5జీ సేవలు విస్తరిస్తున్న వేళ.. ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు ఆయా సేవల కోసం మౌలిక వసతులు, రేడియో వేవ్ స్పెక్ట్రం కోసం భారీగానే పెట్టుబడులు పెట్టాయి. అలా పెట్టిన పెట్టుబడులను రికవరీ చేయాలంటే ఆయా డేటా ప్లాన్లకు అనుగుణంగా చార్జీలు విధిస్తాయి. అయితే కొత్త వసంతం 2025లో దేశీయ టెలికం సంస్థలకు జంట సవాళ్లు ఎదురు కానున్నాయి. పెట్టుబడుల రికవరీకి టారిఫ్ పెంపు, ఎలన్ మస్క్ వంటి బిలియనీర్ల స్టార్ లింక్ వంటి శాటిలైట్ ప్లేయర్ల నుంచి వస్తున్న పోటీని దీటుగా ఎదుర్కొనే సత్తా కలిగి ఉండాలి.

**రెండు కోట్ల యూజర్ల నెట్ వర్క్ షిఫ్ట్**

2024 పొడవునా దేశవ్యాప్తంగా 5జీ సేవల విస్తరణకు ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు సుమారు రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయి. ఆ పెట్టుబడులతోపాటు తమ లాభాలను యధాతథంగా కాపాడుకునేందుకు జూన్ నెలలో పెంచిన రీచార్జీ ప్లాన్ల ధరలు ఎదురు తిరగడం టెలికం ఆపరేటర్లకు కొత్త సంవత్సరంలో సవాల్‌గా పరిణమించింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా సంస్థలు 10-26 శాతం మధ్య డేటా ప్లాన్ల చార్జీలు పెంచేశాయి. ఫలితంగా ఈ మూడు సంస్థలకు చెందిన రెండు కోట్ల మంది సబ్ స్క్రైబర్లు తమ నెట్ వర్క్‌ను మార్చేసుకున్నారు. ఫలితంగా జియో, ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా సంయుక్తంగా 2.6 కోట్ల మంది సబ్ స్క్రైబర్లను కోల్పోయాయి.

**టెలికం కంపెనీల చార్జీల పెంపు సబబేనన్న సింధియా**

అంతే కాదు ఇప్పటికీ 3జీ సర్వీసులు అందిస్తూ.. ప్రస్తుతం 4జీ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించడానికి సాగుతున్న బీఎస్ఎన్ఎల్ వైపు 68 శాతం కస్టమర్లు షిఫ్ట్ అయిపోయారు. సబ్‌స్క్రైబర్లను కోల్పోయినా ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు తమ పెట్టుబడులను రికవరీ చేసుకోవాల్సిన అవసరం ఉంది. దాంతోపాటు భవిష్యత్ వృద్ధి కోసం 5జీ సేవల కోసం మరికొంత పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సైతం ప్రైవేట్ టెలికం ఆపరేటర్ల చార్జీల పెంపును సమర్థించారు. పెట్టుబడులు రికవరీ చేసుకోవడం తప్పేమీ లేదన్నారు.

**శాటిలైట్ బ్రాడ్ బాండ్ ప్రొవైడర్ల నుంచి పోటీ ఇలా**

ఇదిలా ఉంటే, శాటిలైట్ బ్రాడ్ బాండ్ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి దేశీయ ప్రైవేట్ టెలికం ఆపరేటర్లకు కొత్త ముప్పు ఎదురు కానున్నది. సబ్ స్క్రైబర్లను కోల్పోవడం 5జీ విస్తరణకు భారీ పెట్టుబడులు పెట్టడంతోపాటు ఆరోగ్య కరమైన లాభాల సాధన ఒక్కటే సమస్య కాదు.. ఎలన్ మస్క్ సారథ్యంలోని స్టార్ లింక్ వంటి శాటిలైట్ బ్రాడ్ బాండ్ సర్వీస్ ప్రొవైడర్లకు వేలం లేకుండా అడ్మినిస్ట్రేటివ్ స్పెక్ట్రం కేటాయింపును ముకేశ్ అంబానీ రిలయన్స్ జియో సారథ్యంలో ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. వేలం లేకుండా స్పెక్ట్రం కేటాయించడం వల్ల 2జీ గేట్ లో రూ.1.76 లక్షల కోట్ల నిధులు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిన సంగతి జ్యోతిరాదిత్య సింధియా గుర్తు చేశారు. అయితే స్టార్ లింక్ వంటి సంస్థలు తమకు స్పెక్ట్రం కేటాయింపు కోసం కేంద్రం వద్ద గట్టిగానే లాబీయింగ్ చేస్తున్నాయి.





# మళ్లీ కయ్యానికి కాలు దువ్వుతున్న చైనా

**న్యూఢిల్లీ-నవభూమి:** చైనా మరోసారి భారత్‌తో కయ్యానికి కాలు దువ్వుతోంది. తాజాగా సరిహద్దులో రెండు పెద్ద గ్రామాలను నిర్మించింది. వాటిలో ఒకటి అక్సాయ్ చిన్‌లో భారత భూభాగాన్ని ఆక్రమించిన ప్రాంతంలో నిర్మించింది. భారత సరిహద్దుల్లో చైనా కొత్తగా హియాన్, హెకాంగ్ అనే రెండు కొత్త గ్రామాలను నిర్మించినట్టు చైనా ప్రభుత్వ అధికార వార్తాసంస్థ జిన్హువా వారం క్రితం ప్రచురించింది. ఈ గ్రామాల పరిపాలన కేంద్రాల్లో నిర్మించిన టౌన్‌షిపలకు హాంగ్లీయూ, సెయిదుల అనే పేర్లు పెట్టారు. అక్సాయ్‌చిన్‌లో నిర్మించిన గ్రామం పేరు హియాన్. తాజా పరిణామం భారత ప్రభుత్వం దృష్టికి కూడా వచ్చింది. అయితే, ఇప్పటి వరకు దీనిపై భారత్ అధికారికంగా స్పందించలేదు. కాగా, సరిహద్దు వివాదం పరిష్కారానికి ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న ద్వైపాక్షిక చర్చలపై చైనా ఏకపక్షంగా చేస్తున్న ఇటువంటి చర్యలు ప్రభావం చూపబోదని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద టిబెటన్ బౌద్ధుల స్టడీ సెంటర్ 'లరుంగ్ గర్ బుద్ధిస్ట్ అకాడమీ' వద్ద సుమారు 400 దళాలను, అనేక హెలికాప్టర్లను చైనా మోహరించింది. మతపరమైన కార్యకలాపాలపై గట్టి నిఘా కోసమే ఈ మోహరింపులు చేపట్టినట్టు సీటీఏ(సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్) శుక్రవారం తెలిపింది. అలాగే, సెర్థార్ ప్రాంతంలోని బౌద్ధ మఠం వద్ద వచ్చే ఏడాది కఠిన నిబంధనల అమలుకు చైనా ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే అక్కడున్న చైనా విద్యార్థులను ఆ ప్రాంతం వదిలి వెళ్లాలని ఆదేశించింది. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించింది.

# కేరళ మినీ పాకిస్థాన్... అందుకే వాళ్లిద్దరూ ఎంపీలయ్యారు



**న్యూఢిల్లీ-నవభూమి:** బీజేపీ నేత, మహారాష్ట్ర మత్స్య శాఖ మంత్రి నితీష్ రాణే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేరళను "మినీ పాకిస్థాన్"గా ఆయన అభివర్ణించారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఆయన సోదరి ప్రియాంక గాంధీ ఎన్నికల్లో గెలవడానికి కారణం అదేనని అన్నారు. రాణే వ్యాఖ్యలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది."కేరళ మినీ పాకిస్థాన్‌కు ఏమాత్రం తీసిపోదు. అందువల్లే అక్కడ రాహుల్, ఆయన సోదరి గెలిచారు. టెర్రరిస్టులంతా వారికి ఓటేశారు. నేను నిజమే మాట్లాడుతున్నారు. టెర్రరిస్టుల మద్దతుతోనే వీళ్లు ఎంపీలయ్యారు" అని రాణే ఘాటుగా స్పందించారు. 2019 రాహుల్‌గాంధీ వయనాడ్ నుంచి గెలిచి, అమేథీలో ఓడిపోయారు. తిరిగి 2024లో రాహుల్ వయనాడ్, రాయబరేలిలో గెలిచారు. వయనాడ్ సీటును ఆయన వదులుకోవడంతో అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ వాద్రా గెలిచారు.

కాగా, అఫ్జల్‌ఖాన్‌పై ఛత్రపతి శివాజీ చారిత్రక విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో రాణే తాజా వ్యాఖ్యలు చేశారు. దీనిపై కాంగ్రెస్ నేత పవన్ ఖేర విమర్శలు గుప్పించారు. "కేరళ నుంచి వచ్చే ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందో లేదో మీ (బీజేపీ) అధ్యక్షుడు జేపీ నడ్డాను అడగండి. రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం బీజేపీ నేతలకు బాగా అలవాటుగా మారింది" అని వ్యాఖ్యానించారు. రాణే వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుంటారో లేదో చెప్పాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ను శరద్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ) సైతం నిలదీసింది.

# వేతనాల గురించి సీఎం కీలక ప్రకటన.. వీరికి గుడ్ న్యూస్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కీలక ప్రకటన చేశారు. ఈ ప్రకటన అనేక పూజారులు, గురుద్వారా గ్రంథీలకు గౌరవ వేతనం అందించడానికి రూపొందించిన "పూజారి గ్రంథి సమ్మాన్ యోజన" పై ఆధారపడి ఉంది. ఈ పథకం ద్వారా దేశంలో తొలిసారి ప్రభుత్వం ద్వారా పూజారుల్లు, గురుద్వారా గ్రంథీలకు నెలకు రూ. 18 వేల వేతనం అందించినట్లు ప్రకటించడం విశేషం.ఏ ప్రభుత్వం కూడా..ఈ సందర్భంగా కేజ్రీవాల్ పూజారుల స్థితిగతులపై మాట్లాడారు. తరతరాలుగా ఆచారాలను ముందుకు తీసుకువెళ్తున్న పూజారులను, గురుద్వారా గ్రంథీలను ఇప్పటివరకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం పూజారి వృత్తికి ప్రాధాన్యం ఇస్తుందని, వారి సేవను తిరిగి గుర్తిస్తుందని అన్నారు. దీంతోపాటు ఇది సమాజంలో పూజారుల పాత్రను మరింత ఆపాదించడానికి ఒక చైతన్యం సృష్టిస్తుందని పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు రేపటి నుంచి ఢిల్లీలో ప్రారంభమవుతాయన్నారు. కన్నాట్ ప్లేస్ లోని హనుమాన్ మందిరిలో కేజ్రీవాల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

అడ్డుకుంటే మాత్రం..బీజేపీ, కాంగ్రెస్ పార్టీ పూజారుల రిజిస్ట్రేషన్లను అడ్డుకుంటే వారికి పాపం తగులుతుందని కేజ్రీవాల్ హెచ్చరించారు. మరో పథకం అయిన మహిళా సమ్మాన్ నిధి పథకానికి సంబంధించి కూడా వివరాలను వెల్లడించారు. మహిళల కోసం ఈ పథకం రూపొందించబడింది. ఢిల్లీ రాష్ట్రంలో ఈ పథకాల అమలకు డబ్బులకు కొదువలేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ పథకం కేవలం ఆర్థిక పరంగా కాకుండా, సామాజిక హక్కుల పరిరక్షణగా కూడా చూడవచ్చన్నారు. పూజారులు, గురుద్వారా గ్రంథీలకు మద్దతు ఇచ్చే అవకాశాలను పెరుగుతాయని సీఎం పేర్కొన్నారు.

రాజకీయ వర్గాల్లో..ఈ పథకం ధ్యాసలో తన పాత్రను పెంచుకోవడం లక్ష్యంగా కేజ్రీవాల్ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కేజ్రీవాల్ ఇచ్చిన ఈ ప్రకటనతో ఢిల్లీ రాజకీయాలలో కొత్త మార్గదర్శకత్వానికి, మత సంబంధిత వ్యవహారాలలోనూ కొత్త నిర్ణయంగా నిలుస్తుందని అనుకుంటున్నారు. రాజకీయ దృష్టికోణంలో ఇది ఆప్‌కు ఒక కొత్త మైలురాయిగా భావించవచ్చు. ఈ పథకం ద్వారా పూజారులకు మంచి గుర్తింపుతోపాటు వేతనం లభిస్తుంది. కేజ్రీవాల్ చేసిన ఈ ప్రకటన మత ప్రాధాన్యతను పెంచనుంది. దీంతోపాటు ఆచార వ్యవహారాల కార్యక్రమాల్లో కూడా ఆయనకు ప్రాధాన్యం పెరుగుతుందని ఆప్ పార్టీ నేతలు భావిస్తున్నారు.

# పరీక్ష రద్దు చేయాలని విద్యార్థుల ఆందోళన.. కీలక నేత అరెస్ట్

**న్యూఢిల్లీ-నవభూమి:** డిసెంబరు 13న జరిగిన బీహార్(పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయాలనే డిమాండ్‌తో పాట్నాలో తీవ్ర అలజడి నెలకొంది. విద్యార్థులు డిసెంబర్ 30న బీహార్ బంద్‌కు పిలుపునిచ్చారు. విద్యార్థులకు మద్దతుగా బంద్ ప్రకటించింది. బీపీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా డిసెంబర్ 30న బీహార్ అంతటా దిగ్బంధనం చేస్తామని లెఫ్ట్ పార్టీ నేత మాలే తెలిపారు. ఈ క్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు నిరసన తెలుపుతుండగా, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ క్యాన్లు స్ప్రే చేసి, లాఠీచార్జ్ చేశారు. విద్యార్థులు ముఖ్యమంత్రి నివాసం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అయితే కమిషన్ మాత్రం ఈ డిమాండ్‌ను పూర్తిగా తిరస్కరించింది.అంతకుముందు, పాట్నాలోని గాంధీ మైదాన్‌లో విద్యార్థులు గుమిగూడారు. అక్కడ జన్ సూరజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ కూడా విద్యార్థులను కలవడానికి వచ్చారు. దీంతో ప్రశాంత్ కిషోర్ విద్యార్థులతో వాగ్వాదానికి దిగారు. దీనికి సంబంధించిన వీడియోను ఎంపీ పప్పు యాదవ్ షేర్ చేశారు. అంతే కాదు అదే సమయంలో ప్రశాంత్ కిషోర్‌పై కేసు కూడా నమోదైంది.ప్రశాంత్ కిషోర్ కూడా ఆందోళన చేస్తున్న విద్యార్థులను కలవడానికి వచ్చాడు. కానీ ఆ తర్వాత విద్యార్థులతో వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. వారంతా కొత్త నాయకులుగా మారుతున్నారని ప్రశాంత్ కిషోర్ వీడియోలో చెబుతున్నారు. ఆ తర్వాత ప్రశాంత్ కిషోర్, విద్యార్థుల మధ్య సంభాషణ చాలా జరిగింది. ఈ నిరసన నేపథ్యంలో జాన్ సూరజ్ వ్యవస్థాపకుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# వివాదంలో బాలీవుడ్ తొలి సూపర్‌స్టార్.. కోర్టుకెక్కిన లివింగ్ పార్ట్‌నర్..



**న్యూఢిల్లీ-నవభూమి:** హిందీ చిత్రపరిశ్రమలో మొట్టమొదటి సూపర్‌స్టార్‌గా ఓ వెలుగు వెలిగారు రాజేష్‌ఖన్నా. ఆకర్షించే అందం, అద్భుత అభినయంతో పాటు వ్యక్తిగత వివాదాలతోనూ ఎప్పుడూ లైమ్‌లైట్‌లో ఉండేవాడు. చనిపోయి 12 ఏళు గడుస్తున్నా.. వ్యక్తిగత జీవితం, ఆస్తి తగాదాలతో మళ్లీ బీటౌన్‌లో చర్చనీయాంశంగా మారింది రాజేష్‌ఖన్నా పేరు. 2012లో చనిపోయే ముందు వీలునామాలో తన ఆస్తి మొత్తాన్ని భార్య డింపుల్ కపాడియాను మినహాయించి కుమార్తెలు ట్వింకిల్, రింకేలకు పంచిపెట్టడంపై.. పుష్కర కాలం గడిచాక రాజేష్‌ఖన్నా లివింగ్ పార్ట్‌నర్, నటి అనితా అద్వానీ కోర్టుమెట్లెక్కింది. 10 ఏళ్లకు పైగా రాజేష్ ఖన్నా బాగోగులు చూసుకున్నందుకు చట్టపరమైన పరిహారం అందించాలని ఇప్పుడు కోరడం వివాదానికి దారి తీసింది.1969-71 మధ్య వరసగా 15 బ్లాక్‌బస్టర్‌లతో భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేశారు రాజేష్‌ఖన్నా. సన్నిహితులు ఆయనని ప్రేమగా కాకా అని పిలుస్తుంటారు. విపరీతమైన ఫ్యాన్‌ఫాలోయింగ్‌తో బాలీవుడ్ తొలి సూపర్‌స్టార్‌గా ఖ్యాతికెక్కిన ఖన్నా.. వృత్తిపరంగా, వ్యక్తిగత వివాదాలతోనూ సంచలనం సృష్టించాడు. తర్వాత 15ఏళ్ల వయసున్న డింపుల్ కపాడియాను పెళ్లి చేసుకోవడం అప్పట్లో ఓ సంచలనం. పరిశ్రమలో అడుగుపెట్టిన తొలినాళ్లలోనే స్టార్‌డమ్ అందుకున్న ఈ బాలీవుడ్ సూపర్‌స్టార్.. తర్వాత వరస ఫ్లాపులు, వ్యక్తిగత వివాదాలతో పతనమవడం అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. చివరిదశలో నటి అనితా అద్వానీతో సహజీవనం చేయడం చాలామందికి తెలిసిందే.2012లో మరణానికి ఒక నెల ముందు తన ఐకానిక్ బంగ్లా, ఇతర ఆస్తులను కుమార్తెలు ట్వింకిల్, రింకేలకు పేరిట వీలునామాలో రాశారు రాజేష్‌ఖన్న. ఇందులో భార్య డింపుల్ కపాడియా, లివింగ్ పార్ట్‌నర్ అనితా అద్వానీల పేరు చేర్చలేదు. అయినా, అప్పట్లో ఈ విషయంపై ఎక్కడా మాట్లడలేదు అనితా. కానీ, దాదాపు 12 ఏళ్లు గడిచాక తన హక్కులను క్లెయిమ్ చేస్తూ అతడి కుటుంబానికి లీగల్ నోటీసులు అందించడం బీటౌన్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అనితా అద్వానీ ఇలా చెప్పారు. 'రాజేష్‌ఖన్నాపై ప్రేమతో ఒంటరిగా జీవిస్తున్న ఆయనకు చివరిరోజుల వరకూ తోడుగా ఉండి బాగోగులు చూసుకున్నాను. అంత్యక్రియల సమయంలో రాజేష్ కుటుంబం దూరంగా పెట్టినా, డబ్బు పరంగా ఎలాంటి సాయం అందకపోయినా అప్పట్లో పట్టించుకోలేదు. ఆశీర్వాద్ బంగ్లాను మ్యూజియంగా మార్చాలనేది ఆయన కల. ఈ విషయం విస్మరించినందుకే ఆయన కుటుంబానికి 12 ఏళ్ల తర్వాత ఎస్టేట్ హక్కుల కోసం లీగల్ నోటీసులు పంపాను'.భారతీయ చలనచిత్ర చరిత్రలో గొప్ప నటులలో ఒకరిగా పరిగణించబడుతున్న రాజేష్ ఖన్నా 'ఆరాధన', 'ఆనంద్', 'అమర్ ప్రేమ్' 'ఇన్సాఫ్ మెయిన్ కరూంగా', 'అగర్ తుమ్ నా హోతే', 'అవతార్', 'డిస్కో డాన్సర్', 'దర్ద్' వంటి చిత్రాలలో అనేక చిరస్మరణీయ పాత్రలకు ప్రాణం పోశారు. భారతీయ సినిమాకు నటుడిగా ఎనలేని కృషి అభిమానుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారు.

# భారత ఎన్నికల సంఘం కీలక జాబితా విడుదల.. విషయం ఏంటంటే..




**హైదరాబాద్-నవభూమి:** లోక్ సభ-2024 సార్వత్రిక ఎన్నికల్లో అతి తక్కువ ఓట్లు పోలైన నియోజకవర్గాల జాబితాను భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) తాజాగా విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్ నియోజకవర్గం 3వ స్థానంలో నిలవగా, సికింద్రాబాద్ నియోజకవర్గం 6వ స్థానంలో నిలిచింది. ఈసీఐ తాజా గణాంకాల నివేదిక ప్రకారం అతి తక్కువ ఓట్లు పోలై బీహార్‌లోని నవాడా మొదటి స్థానంలో ఉండగా, పాట్నా సాహిబ్ రెండో స్థానంలో నిలిచింది. భారతదేశం మొత్తం మీద 2024 లోక్‌సభ ఎన్నికలలో 50 శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాలు తొమ్మిది ఉన్నట్లు ఈసీఐ వెల్లడించింది.

నియోజకవర్గాల వారీ వివరాలు ఇవే..

బిహార్ రాష్ట్రం నవాడా నియోజకవర్గంలో మొత్తం 20,10,286 ఓట్లు ఉండగా.. 2024 ఎన్నికల్లో కేవలం 8,71,838 ఓట్లు మాత్రమే పోలై అతి తక్కువగా 43.37 పోలింగ్ శాతం నమోదు అయ్యింది. పాట్నా సాహిబ్(బిహార్) నియోజకవర్గంలో 22,95,527 ఓటర్లు ఉండగా.. 10,75,992 మంది ఓట్లు వేసి 46.87 శాతాన్ని నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 22,17,305 ఉండగా.. 10,81,878 మంది మాత్రమే ఓటు హక్కును వియోగించుకుని 48.79 ఓటింగ్ శాతాన్ని నమోదు చేశారు. అల్మోరాలో(ఉత్తరాఖండ్) 13,68,432 ఓటర్లు ఉండగా.. 6,75,014 మాత్రమే ఓటు వేసి 49.33 శాతం నమోదు చేశారు.

మధుర (ఉత్తర ప్రదేశ్)లో 19,39,130 ఓట్లు ఉండగా.. 9,57,463 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుని 49.38 శాతం నమోదు చేశారు. సికింద్రాబాద్(తెలంగాణ)లో 21,20,550 మంది ఉండగా.. 10,48,604 మంది ఓటు వేసి 49.45 శాతం నమోదు చేశారు. రేవా(మధ్యప్రదేశ్)లో 18,59,439 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 9,20,062 మంది మాత్రమే వయోజన ఓటు హక్కును వినియోగించుకుని 49.48 ఓటింగ్ శాతాన్ని నమోదు చేశారు. ఘజియాబాద్ (ఉత్తర ప్రదేశ్)లో 29,48,720 ఓట్లు ఉండగా.. 14,70,740 ఓట్లు పోలై 49.88 శాతం నమోదు అయ్యింది. నలంద(బిహార్) నియోజకవర్గంలో 22,93,994 మంది ఉండగా.. 11,44,956 మంది ఓటు హక్కు వినియోగించుకుని 49.91 శాతాన్ని నమోదు చేశారు.

**రికార్డు బద్దలు..**

హైదరాబాద్ నియోజకవర్గంలో లోక్‌సభ-2024 ఎన్నికల్లో ఏఐఎంఐఎం తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేయగా.. బీజేపీ తమ అభ్యర్థి మాధవిలతను నిలబెట్టింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 22,17,305 మంది ఓటర్లు ఉండగా.. 10,81,878 ఓట్లు పోలయ్యాయి. వీటిలో మాధవిలతకు 3,23,894 ఓట్లు రాగా.. అసదుద్దీన్ ఒవైసీ 6,61,981 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో అసదుద్దీన్ 3,38,087 ఓట్ల భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగించారు. దీంతో అత్యధిక ఓట్లు సాధించి ఓవైసీ తన పాత రికార్డును తానే బద్దలు కొట్టారు

# మరో రెండు విమానాలకు తప్పిన ప్రమాదం



**న్యూఢిల్లీ-నవభూమి:** దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగిన కొన్ని గంటల తర్వాత మరో రెండు విమానాలు వేర్వేరు ప్రాంతాల్లో అదే తరహా ప్రమాదాలకు గురై త్రుటిలో తప్పించుకున్నాయి. ఎయిర్ కెనడాకు చెందిన ఏసీ 2259 విమానం కెనడాలోని హాలీఫాక్స్ విమానాశ్రయంలో శనివారం రాత్రి ప్రమాదానికి గురైంది. సెయింట్ జాన్స్ నగరం నుంచి వచ్చిన ఆ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో ల్యాండింగ్ గేర్ విరిగిపోవడంతో అదుపు తప్పి, ఓ పక్కకు ఒరిగిపోయి రన్‌వేపై కొంత దూరం ప్రయాణించింది. ఈ క్రమంలో విమానం ఎడమ వైపు రెక్క రన్‌వేకు రాసుకోని మంటలు చెలరేగాయి. అయితే, పైలట్ విమానాన్ని నియంత్రించి ఆపగలగడంతో పెను ప్రమాదం తప్పింది. విమానం ఆగిన వెంటనే ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరోవైపు, రాయల్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 797-800 విమానం ఒకటి నార్వేలోని టోర్ప్ శాండీఫ్యూయర్డ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యే క్రమంలో అదుపు తప్పి జారింది. కాగా, నార్వేలోని ఓస్లో నుంచి ఆమ్‌స్టర్‌డమ్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయ్యాక.. విమానం హైడ్రాలిక్ వ్యవస్థ విఫలమైనట్టు గుర్తించారు. విమానాన్ని అత్యవసరంగా టోర్ప్‌కు దారి మళ్లించారు. టోర్ప్‌లో ల్యాండ్ అయ్యే క్రమంలో అదుపు తప్పి రన్‌వేపై జారిన విమానం... రన్‌వేను ఆనుకుని పెంచిన గడ్డిలోకి వెళ్లి ఆగింది. ఆ సమయంలో విమానంలో 182 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా, ఐదుగురు అమెరికా పౌరులతో నేపాల్‌లోని లుక్లా నుంచి కాఠ్‌మాండూకు బయలుదేరిన ఓ ప్రైవేట్ హెలికాప్టర్‌ను ఆదివారం ఉదయం 11 గంటలప్పుడు ఓ పక్షి ఢీకొట్టింది. దీంతో కాఠ్‌మాండూకు 50కిమీల దూరంలో ఉన్న బనేపా ప్రాంతంలో హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం రష్యా చేసిన దాడి వల్లే కజకిస్థాన్‌లో కూలిపోయిందని అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్ ఆదివారం ఆరోపించారు. బుధవారం జరిగిన ఈ విమాన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను ఎదుర్కొనేందుకు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు చేసిన ప్రయత్నంలో భాగంగా తమ విమానం కూలిందని అలియెవ్ పేర్కొన్నారు. అయితే, ఈ విమాన ప్రమాదంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ అజర్‌బైజాన్ అధ్యక్షుడికి శనివారమే క్షమాపణ చెప్పారు.

# క్యాబేజీ తిని 14 ఏళ్ల అమ్మాయి మృతి..
## చలికాలంలో ఈ 5 కూరగాయలు విషం!



**న్యూఢిల్లీ-నవభూమి:** సాయంత్రం అవగానే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల దగ్గర వాలిపోవడం చాలామందికి అలవాటు. గోబీ మంచూరియా, న్యూడిల్స్, ఫ్రైడ్ రైస్ అంటూ లొట్టలేసుకుంటూ తినేస్తారు. రెస్టారెంట్ల నుంచి వీధుల్లో తయారుచేసే వారి వరకూ ఎవరైనా ఈ ఐటమ్స్‌లో పచ్చి క్యాబేజీ తురుమును తప్పకుండా వాడుతుంటారు. సాధారణంగా ఆకుకూర జాతికి చెందిన క్యాబేజీ ఆరోగ్యానికి మంచిదే అయినా చలికాలంలో మాత్రం కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే, ఈ కాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉండటం వల్ల నిల్వ ఉంచిన క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయాల్లో పురుగులు ఎక్కువగా చేరుతుంటాయి. దానికి తోడు పురుగుల మందులతో పండించిన కూరగాయలను కావడంతో.. వాటిని చలికాలంలో తీసుకుంటే ప్రాణాలకే ప్రమాదం కలగవచ్చు. అందుకు రాజస్థాన్‌లో క్యాబేజీ తిని ప్రాణాలు పోగొట్టుకున్న 14 ఏళ్ల అమ్మాయి ఉదంతమే నిదర్శనం.

నిజానికి ఆకుకూరలను ఆరోగ్యానికి అమృతంలా భావిస్తారు. కానీ క్రిమికీటకాల నుంచి కాపాడేందుకు పిచికారీ చేసే క్రిమిసంహారక మందులు వాటిని ప్రాణాలు తీసే విషంలా మారుతుస్తున్నాయి. తాజాగా రాజస్థాన్ శ్రీ గంగానగర్ జిల్లాలో వెలుగు చూసిన 14 ఏళ్ల బాలిక మృతి చెందిన ఘటనే నిదర్శనం. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఆ అమ్మాయి వాళ్ల పొలంలో పండించిన క్యాబేజీ ఆకులను తుంచుకుని తింది. అంతకుముందే వాటిపై పురుగుల పిచికారీ చేయడంతో విషపూరితమైన క్యాబేజీ ఆకులను తిన్నాక ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఆస్పత్రిలో చేరింది. డిసెంబరు 18వ తేదీ నుంచి చికిత్స పొందుతూ డిసెంబర్ 24న ప్రాణాలు కోల్పోయింది. పచ్చికూరగాయాలు తింటే ఆరోగ్యానికి మంచిదని సెలబ్రిటీలు తరచూ చెప్తుంటారు. అదే ఫాలో కావాలని కోరుకునే సామాన్యులకు పురుగుల మందులు వాడకుండా పండించిన కూరగాయలు మార్కెట్లో లభించడం అరుదు. ఇదొక్కటే కాక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనూ మనం కోరుకున్నా విషపదార్థాలు కడుపులోకి వెళు_న్నాయనే అవగాహన అందరికీ ఉండదు. మరి, ఇలా అయితే ఈ పురుగుల మందుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడమెలా అని ఆలోచిస్తున్నారా. రాజస్థాన్ ఘటన తర్వాత పచ్చి కూరగాయల వినియోగంపై సోషల్ మీడియాలో ఇదే చర్చనీయాంశంగా మారింది.

**పురుగుమందుల దుష్ప్రభావాలు:**

ఆహారం ద్వారా కొద్ది కొద్దిగా పురుగుల మందులు కడుపులోకి చేరినపుడు వికారం, వాంతులు, కడుపు నొప్పి, అతిసారం వంటి జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అలర్జీలు, దద్దుర్లు ఏర్పడి చర్మంపై దురద, కంటికి చికాకును కలిగిస్తాయి. అంతే కాదు. పురుగులమందుల అవశేషాలు తరచూ శరీరంలోకి చేరుతుంటే ల్యుకేమియా, లింఫోమా సహా అనేక క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువ.

**అత్యధిక పురుగుమందులు కలిగిన కూరగాయలు ఇవే:**

పురుగులమందుల అవశేషాలతో కలుషితమైన పండ్లు, కూరగాయలపై ఎన్విరాన్‌మెంటల్ వర్కింగ్ గ్రూప్ "డర్టీ డజన్" పేరిట ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో ఈ కింది కూరగాయల సాగుకే ఎక్కువగా పురుగుల మందులు వాడుతున్నట్లు తేల్చింది.

**పాలకూర**

పాలకూరపై పిచికారీ చేసే పురుగుమందులలో ఆర్గానోఫాస్ఫేట్లు ఉంటాయి. ఇలా పండించిన పాలకూరను తినటం వల్ల కాలక్రమేణా నరాల సంబంధిత సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.

# 1978లో ఇండియాకు జిమ్మీ కార్టర్.. ఓ గ్రామానికి ఆయన పేరు.. కార్టర్‌పురి ఎక్కడుందో తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జిమ్మీ కార్టర్.. ఇండియాలో పర్యటించారు. హర్యానాలోని గురుగ్రామ్ విలేజ్‌ను ఆయన సతీసమేతంగా 1978లో విజిట్ చేశారు. ఆ గ్రామానికి కార్టర్‌పురి అని పేరు పెట్టారు. జిమ్మీ కార్టర్ వచ్చి వెళ్లిన తర్వాత ఆ ఆ ఊరు పేరును మార్చారు. కార్టర్ మరణించినట్లు వార్త తెలియగానే ఆ గ్రామ ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆ ఊరి ప్రజలు ప్రత్యేక నివాళి కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు.భారత్‌ను విజిట్ చేసిన అమెరికా మూడవ అధ్యక్షుడిగా కార్టర్‌కు గుర్తింపు ఉన్నది. ఎమర్జెన్సీ రోజులు ముగిసిన తర్వాత ఆ డెమోక్రటిక్ నేత ఇండియాకు వచ్చారు. హర్యానాలోని దౌల్తాపూర్ నసీరాబాద్ గ్రామాన్ని విజిట్ చేశారు. 1960 దశకంలో జిమ్మీ కార్టర్ తల్లి లిల్లియన్ గోర్డీ కార్టర్ .. దౌల్తాపూర్‌లో పీస్ కార్ప్స్ వాలంటీర్‌గా పనిచేశారు. ఈ నేపథ్యంలో జిమ్మీ కార్టర్ తన తల్లి పనిచేసిన ప్రదేశాన్ని విజిట్ చేశారు. అయితే జిమ్మీ కార్టర్ వచ్చి వెళ్లిన తర్వాత ఆ గ్రామానికి కార్టర్‌పురి అని పేరు పెట్టారు.మా ఊరి పేరును హర్యానాలోని మరో పేరుతో పోల్చలేమని, మా ఊరి పేరు ప్రత్యేకమైందని ఓ వ్యక్తి తెలిపాడు. జిమ్మీ కార్టర్ తమ ఊరును విజిట్ చేసిన సమయంలో ఆ వ్యక్తి 18 ఏళ్లు ఉన్నాడు. ఆ రోజు జరిగిన సంఘటనలను ఆయన మీడియాకు వివరించాడు. తొలిసారి ఓ విదేశీ వ్యక్తిని అప్పుడు చూసినట్లు చెప్పారు. తలపై దుపట్టా లేకుండా తొలిసారి ఓ తెల్ల అమ్మాయిని చూశామన్నారు. గ్రామం అభివృద్ధి చెందుతుందని భావించి, కార్టర్ పేరును తమ ఊరికి పెట్టినట్లు చెప్పాడు. కార్టర్‌పురి అని పేరు పెట్టినందుకు.. జిమ్మీ కార్టర్ ఆ తర్వాత తమ పంచాయతీకి లేఖ కూడా రాసినట్లు తెలిపాడు.2002లో జిమ్మీ కార్టర్‌కు నోబుల్ శాంతి బహుమతి దక్కింది. ఆ సమయంలో కార్టర్‌పురి సంబరాల్లో తేలినట్లు ఆ వ్యక్తి గుర్తు చేశాడు. జనవరి మూడవ తేదీన కార్టర్ తమ ఊరును విజిట్ చేశారని, దీంతో ఆ రోజును స్థానికంగా సెలువు దినంగా ప్రకటించామన్నారు. కార్టర్ మరణానికి నివాళిగా ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

# తాలిబన్ల కొత్త రూల్.. వంట గదిలో కిటికీల ఏర్పాటుపై నిషేధం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** అధికారంలోకి వస్తే మంచి పాలన అందిస్తామని చెప్పిన తాలిబన్లు . ప్రస్తుతం అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. 2021 ఆగస్టులో ఆఫ్ఘాన్ ను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకున్నప్పటి నుంచి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మరీ ముఖ్యంగా మహిళలపై అణచివేతను కొనసాగిస్తున్నారు. దేశంలో మహిళల హక్కులను కాలరాస్తున్నారు. తాజాగా మహిళల విషయంలో తాలిబన్లు మరో కొత్త రూల్‌ను తీసుకొచ్చారు. ఇంట్లోని మహిళలు బయటివారికి కనిపించకుండా ఉండేలా కిటికీలు ఏర్పాటు చేయొద్దని పాలకులు ఆదేశించారు.ఇంట్లో మహిళలు తిరిగే వంట గదులు, బావుల వద్ద ఎటువంటి కిటికీలు నిర్మించకూడదని స్పష్టం చేశారు. వారు కనిపించకుండా గోడలు కట్టాలని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మించబోయే ఇళ్లల్లో ఈ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని తాలిబన్ సుప్రీం లీడర్ స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహిళలు బయటకు కనిపించేలా నిర్మాణాలు ఉంటే వాటికి ఈ నిబంధనల ప్రకారం మార్పులు చేయాలని ఆదేశించారు.2021లో ఆఫ్ఘానిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకున్న తాలిబన్లు మహిళలపై కఠిన ఆంక్షలు కొనసాగిస్తున్నారు. పురుషులు వెంట లేకుండా మహిళలు ఇండ్ల నుంచి బయటకు రావడానికి వీల్లేదని, బాలికల సెకండరీ స్కూళ్లు మూసివేయాలని, మహిళలు ఉద్యోగాలు చేయకూడదని ఆదేశించారు. మహిళల ఉన్నత చదువులపై, ఈద్ వేడుకల్లో పాల్గొనడం, జిమ్‌లు, పార్కుల్లోకి మహిళల ప్రవేశంపై నిషేధం విధించారు. ఈ ఆంక్షలపై ఐక్యరాజ్య సమితి ఇప్పటికే పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది స్త్రీలపై దారుణ వివక్ష అని మండిపడింది.

# నెతన్యాహుకు ప్రొస్టేట్ గ్రంథి శస్త్రచికిత్స విజయవంతం.. ప్రకటించిన వైద్యులు

**ఇజ్రాయెల్ -నవభూమి:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు గత కొంతకాలంగా ప్రొస్టేట్ గ్రంథి సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిందే. వాపు కారణంగా మూత్ర నాళ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం శస్త్ర చికిత్స చేయించుకున్నారు. నెతన్యాహుకు జెరూసలెం లోని హడస్సా మెడికల్ సెంటర్‌లో సర్జరీ జరిగింది. శస్త్ర చికిత్స విజయవంతమైనట్లు ఆస్పత్రి వర్గాలు తాజాగా వెల్లడించాయి. ప్రధాని నెతన్యాహు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని వెల్లడించారు. ఆయన ఎలాంటి క్యాన్సర్ బారిన పడలేదని వైద్యులు ప్రకటించారు. అయితే కొన్ని రోజులపాటు వైద్యుల పరిశీలనలోనే ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



## ‘వేర్ ఈజ్ ఎంబీ’... మోహన్ బాబు అమెరికా వెళ్లిపోయారా?

మంచు ఫ్యామిలీ వివాదం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో జర్నలిస్టు తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీంతో.. ముందస్తు బెయిల్ కోసం మోహన్ బాబు హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఆ పిటిషన్ ను కొట్టివేసింది. ఈ మేరకు ఉన్నత న్యాయస్థానం ఇటీవల తీర్పు వెలువరించింది. మరోపక్క జర్నలిస్టుపై దాడి అనంతరం విచారణకు రావాల్సి ఉండగా.. మోహన్ బాబు ఆస్పత్రిలో ఉండటంతో ఆయన విచారణతో పాటు అరెస్టు నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. అయితే.. ఆ గడువు ఇప్పటికే ముగిసింది. మరోపక్క ముందస్తు బెయిల్ కోసం ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టేసింది. దీంతో... మోహన్ బాబును పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో... ప్రస్తుతం మోహన్ బాబు అజ్ఞాతంలో ఉన్నారని అంటున్నారు. అవును... జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్ బాబుపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్ ను హైకోర్టు ఇటీవల కొట్టేసిన సంగతి తెలిసిందే. దీంతో.. మోహన్ బాబును విచారణకు రమ్మని పోలీసులు ఆదేశించగా.. అందుకు కొంత సమయం కావాలని మోహన్ బాబు కోరడం.. ఈ సమయంలో ఇచ్చిన గడువు ముగియడం జరిగిపోయింది!






## సలార్‌లో మిస్ అయినా రాజాసాబ్‌లో నిలిచింది

తమిళ్‌లో స్టార్ హీరోలకు, సూపర్ స్టార్ హీరోలకు జోడీగా నటించడం ద్వారా టాప్ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ మాళవిక మోహనన్. ఈ అమ్మడు చాలా ఏళ్లుగా తెలుగు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టడం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తుంది. తెలుగు లో ఈ అమ్మడు ఒక్క సినిమా చేయకున్నా మంచి గుర్తింపును దక్కించుకుంది. డబ్బింగ్ సినిమాలతో దక్కిన గుర్తింపుతో టాలీవుడ్‌లో మంచి ఎంట్రీకి ఈ అమ్మడు ప్రయత్నాలు చేసింది. సలార్ సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ అమ్మడు కొన్ని కారణాల వల్ల తప్పింది. కానీ అదృష్టం కొద్ది రాజాసాబ్ సినిమాతో ప్రభాస్‌తో కలిసి టాలీవుడ్‌లో అడుగు పెట్టబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది అంది. పవన్, ప్రభాస్‌లతో సందడి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ముద్దుగుమ్మ మాళవిక మోహనన్ మాట్లాడుతూ... నాకు బాహుబలి 1 మరియు బాహుబలి 2 సినిమాలు అంటే చాలా ఇష్టం. అప్పటి నుంచి ప్రభాస్ గారితో వర్క్ చేయాలని కోరుకున్నాను. ఆయన అంటే అమితమైన అభిమానం నాకు ఉంది. అందుకే ఆయనతో వర్క్ చేయడం కోసం ఎదురు చూశాను. అనుకోని అవకాశం అన్నట్లుగా ఒకసారి ప్రశాంత్ నీల్ సర్ సలార్ సినిమాలో నటించాలి అంటూ అడిగారు. తాను సైతం సినిమా కోసం రెడీ అన్నట్లుగా ఎదురు చూశాను, కానీ కొన్ని కారణాల వల్ల సినిమాను చేయలేక పోయాను. కానీ కొన్నాళ్ల తర్వాత మారుతి సర్ కాల్ చేసి రాజాసాబ్ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. ప్రభాస్ సర్‌తో నటించాలి అనే కోరిక రాజాసాబ్ తో తీరింది. ఆ సినిమాలో తన పాత్ర గురించి ఇప్పుడు చెప్పలేను. కానీ సినిమా చాలా బాగుంటుంది అని హామీ ఇచ్చింది. షూటింగ్ దాదాపుగా పూర్తి అయ్యింది అని, తన పోర్షన్ షూటింగ్ సైతం పూర్తి అయ్యిందని చెప్పుకొచ్చింది. త్వరలోనే సినిమా నుంచి మారుతి గారు అప్‌డేట్ ఇస్తారని ఆమె హామీ ఇచ్చారు. ప్రభాస్ కెరీర్‌లో ఇదో స్పెషల్ మూవీగా ఉంటుంది అంటూ యూనిట్ సభ్యులు పదే పదే చెబుతున్నారు. కనుక ఈ సినిమా కచ్చితంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుంది అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరూ చాలా నమ్మకంగా చెబుతున్నారు. రాజాసాబ్ సినిమాలో ప్రభాస్‌తో పాటు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇక హీరోయిన్‌గా మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్ రిద్ధి లు నటిస్తున్నారు. తమన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. సలార్, కల్కి 2898 ఏడీ వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాల తర్వాత ప్రభాస్ నుంచి రాబోతున్న సినిమా ఇదే కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. 2025లోనే రాజాసాబ్ తో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.

## అనుష్క మూవీ సూపర్ అప్‌డేట్



అనుష్క శెట్టి గత సంవత్సరం నవీన్ పొలిశెట్టితో కలిసి ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫలితం పర్వాలేదు అన్నట్లుగా నిలిచింది. టాక్ పాజిటివ్ వచ్చినా వసూళ్లు మాత్రం నిరాశనే మిగిల్చాయి. ఆ సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకుని అనుష్క శెట్టి తన తదుపరి సినిమాను క్రిష్ దర్శకత్వంలో చేస్తున్న విషయం తెల్సిందే. 2024లో అనుష్క నుంచి ఒక్క సినిమా వచ్చే పరిస్థితి లేదు. క్రిష్ దర్శకత్వంలో చేస్తున్న ఘాటీ సినిమాను వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. పవన్, ప్రభాస్‌లతో సందడి ఇటీవలే ఏప్రిల్ 18, 2025 న ఘాటీని విడుదల చేస్తాం అంటూ అధికారికంగా ప్రకటన వచ్చింది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన గ్లిమ్స్ సినిమాపై అంచనాలు పెంచింది. ముఖ్యంగా అనుష్క లుక్, ఆమె కొడవలి పట్టి విలన్ పీక కోస్తున్న విధానం చూసి ప్రతి ఒక్కరూ షాక్ అయ్యారు. బాబోయ్ అనుష్కను ఇలా లేడీ యానిమల్ లుక్‌లో, అటువంటి పాత్రలో చూస్తామని అనుకోలేదని, కచ్చితంగా ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుంది అంటూ అంతా విడుదల తేదీ కోసం వెయిట్ చేస్తున్నారు. ఎట్టకేలకు సినిమా విడుదల విషయంలో క్లారిటీ వచ్చింది. అయితే షూటింగ్ మాత్రం ఇంకా పూర్తి కాలేదు. వచ్చే నెలలో సినిమా క్లైమాక్స్ సన్నివేశాల షూటింగ్ చేపట్టబోతున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. క్రిష్ ఇప్పటికే క్లైమాక్స్ షూటింగ్ ఏర్పాట్లు చేశారని, అనుష్క సైతం క్లైమాక్స్ షూట్ కోసం గత రెండు వారాలుగా సిద్ధం అవుతుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. క్లైమాక్స్ షూట్ పూర్తి అయిన వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేయబోతున్నారు. అనుష్క ఈ సినిమాకు తానే స్వయంగా డబ్బింగ్ చెప్పనున్నారు. కేవలం తెలుగులో మాత్రమే కాకుండా సౌత్‌లో అన్ని భాషల్లో విడుదల చేయడంతో పాటు హిందీలోనూ ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అనుష్క అంటే ఇప్పటికే వీరాభిమానం చూపించే ఫ్యాన్స్ ఎంతో మంది ఉన్నారు. కానీ అభిమానుల కోరిక తీర్చే విధంగా అనుష్క సినిమాలు చేయడం లేదు. ఆమె నుంచి బ్యాక్ టు బ్యాక్ వరుసగా సినిమాలు మరిన్ని వస్తాయి అనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. మలయాళంలో ఈమె ఒక సినిమాను చేస్తుంది. అది ఘాటీ సినిమా తర్వాత విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. అంటే 2025లో అనుష్క నుంచి రెండు సినిమాలు వస్తాయి. ఈ ఏడాది వచ్చిన గ్యాప్‌ను అనుష్క వచ్చే ఏడాదిలో రెండు సినిమాలతో రావడం వల్ల ఫిల్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

## ‘గేమ్ ఛేంజర్’ కోసం రేవంత్ రెడ్డి?




టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్.. బ్లాక్ బస్టర్ హిట్ ఆర్ఆర్ఆర్ తర్వాత సోలోగా నటించిన గేమ్ ఛేంజర్ మూవీ రిలీజ్ కు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఆ సినిమా.. సంక్రాంతి కానుకగా పాన్ ఇండియా స్థాయిలో జనవరి 10వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా నటించగా, తెలుగమ్మాయి అంజలి మరో ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తున్నారు. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందిన ఆ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రొడ్యూస్ చేస్తున్నారు. సినిమా కోసం రూ.350 కోట్లు ఖర్చు పెట్టినట్టు టాక్ వినిపిస్తోంది. అయితే రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న వేళ మేకర్స్ ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు. ఇప్పటికే టీజర్ తో పాటు నాలుగు సాంగ్స్ ను విడుదల చేసిన మేకర్స్.. జనవరి 1వ తేదీన ట్రైలర్ ను రిలీజ్ చేయనున్నారు. ఈ మేరకు నిన్ననే దిల్ రాజు.. విజయవాడలో జరిగిన రామ్ చరణ్ భారీ కటౌట్ రివీల్ ఈవెంట్ లో మాట్లాడుతూ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన డేట్ బట్టి ఆంధ్రలో ఈవెంట్ నిర్వహిస్తామని చెప్పారు. అయితే ఇప్పుడు హైదరాబాద్ లో జనవరి 1వ తేదీన ఈవెంట్ జరగడం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. అందుకు సంబంధిం చిన ఏర్పాట్లు జరుగుతున్నాయని, అనుమతులు తీసుకున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఆ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడలో ఉన్న దిల్ రాజు.. హైదరాబాద్ వచ్చాక రేవంత్ ను ఇన్వైట్ చేయనున్నారని టాక్ వినిపిస్తోంది. కాగా, ఇటీవల దిల్ రాజుకు రేవంత్ రెడ్డి సర్కార్.. ప్రతిష్ఠాత్మకమైన పదవిని కట్టబెట్టింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్ డీసీ) ఛైర్మన్ గా ఇటీవల దిల్ రాజు బాధ్యతలు కూడా స్వీకరించారు.

## గేమ్ ఛేంజర్‌పై మెగాస్టార్ సంచలన ప్రకటన!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘గేమ్ ఛేంజర్’ భారీ అంచనాల మధ్య జనవరి 10న రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే సినిమాని ఓ రేంజ్ లో ఎక్కిస్తున్నారు. పక్కా కమర్శియల్ చిత్రం నెక్ట్స్ లెవల్ రామ్ చరణ్ ని చూస్తారంటూ శంకర్ ధీమా వ్యక్తం చేసారు. ఇక సుకుమార్ అయితే ఏకంగా జాతీయ అవార్డు వస్తుందని అమెరికా వేదికగా ఉద్ఘాటించారు. రైటర్ సాయిమాధవ్ బుర్రా. టాలీవుడ్ లో ఓ గొప్ప చిత్రమవుతుందని ధీమా వ్యక్తం చేసారు. భారతీయుడు, జెంటిల్ మెన్ తరహా కమర్శియల్ సినిమా అని చెప్పుకొచ్చారు. దీంతో సినిమాపై అంచనాలు రెట్టింపు అయిపోయాయి. ఈ నేపథ్యంలో రిలీజ్ గడియలు ఎప్పుడెప్పుడా అని అభిమానులంతా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత దిల్ రాజు ఇది చిరంజీవి మాటగా చెప్పారంటూ ఏకంగా సంచలన ప్రకటనే చేసారు. సినిమాలో రామ్ చరణ్ నట విశ్వరూపాన్ని చూస్తారు. జనవరి 4 లేదా 5 తేదీల్లో ఏపీలో భారీ ఈవెంట్ నిర్వహిస్తాం. పవన్, ప్రభాస్‌లతో సందడి దీనికి సంబంధించి త్వరలోనే పవన్ కళ్యాణ్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చిరంజీవి సినిమా చూసారు. హిట్ ఖాయమని నాకు ఫోన్ చేసి చెప్పారు. ఇదే మాట మీకు చెప్పమని ఫోన్ లో నాకు చెప్పారు- అని అన్నారు. ఈ మాట ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. నేరుగా చిరంజీవే చెప్పినంత బలంగా దిల్ రాజు చెప్పడంతో ఇక అంచనాలు ఇంకే స్థాయిలో ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం ఇదే డిస్కషన్ అన్ని చోట్లా జరుగుతోంది. విజయవాడలో రామ్ చరణ్ లుంగీ ..బనియన్ భారీ కటౌట్ నెట్టింట వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఆ కటౌట్‌ని చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు అభిమానులు తరలి వస్తున్నారు.

## ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ నామినేషన్‌లలో బుమ్రా



**న్యూఢిల్లీ-నవభూమి:** 2024 ఏడాదికి గాను ‘ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ నామినేషన్‌లలో భారత బౌలింగ్ దిగ్గజం జస్ప్రీత్ బుమ్రా కు చోటు దక్కిం ది. ఇంగ్లండ్‌కు చెందిన బ్యాటర్‌లు జోయ్ రూట్ హ్యారీ బ్రూక్ శ్రీలంకకు చెందిన కామిందు మెండిస్‌లతోపాటు బుమ్రా కూడా ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ రేసులో ఉన్నాడు. బుమ్రా 2024లో 13 టెస్టు మ్యాచ్‌లు ఆడి 14.92 సగటు, 30.16 స్ట్రైక్ రేట్‌తో 71 వికెట్లు పడగొట్టాడు. దాంతో టెస్టు క్రికెట్ చరిత్రలో మరే బౌలర్ సాధించలేని ఘనత సాధించాడు. భారత్-ఆస్ట్రేలియా మధ్య కొనసాగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కూడా బుమ్రా అద్భుతంగా రాణిస్తున్నాడు. కేవలం 4 టెస్టు మ్యాచ్‌లలో 30 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఉన్నాడు. 2023లో బ్యాక్ పెయిన్ నుంచి కోలుకుని వచ్చిన తర్వాత బుమ్రా వదిలే బంతుల్లో పదును పెరిగింది. ఇక ఇంగ్లండ్ బ్యాటర్ రూట్ 2024లో 17 టెస్టులు ఆడి 55.57 సగటుతో ఏకంగా 1,556 పరుగులు సాధించాడు. రూట్ ఒక క్యాలెండర్ ఇయర్‌లో వెయ్యికి పైగా పరుగులు రాబట్టడం ఇది ఐదోసారి. ఈ ఏడాది అతను రెండో అత్యధిక స్కోర్ సాధించాడు. అంతకుముందు 2021లో రూట్.. 1,708 పరుగుల స్కోర్ చేశాడు. ఇంగ్లండ్‌కే చెందిన మరో బ్యాటర్‌బ్రూక్ కూడా ఈ ఏడాది 12 టెస్టుల్లో 1,100 పరుగులు చేసి నామినేషన్‌లలో చోటు సంపాదించాడు. బ్రూక్ 2024లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌ల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచాడు. రూట్ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో యశస్వి జైస్వాల్, బెన్ డుకాటీ ఉన్నారు. బ్రూక్ 2024లో ఒక మ్యాచ్‌లో 322 బంతులను ఎదుర్కొని 317 పరుగులు సాధించాడని, అది ఒక అద్భుతమైన ప్రదర్శన అని ఐసీసీ ప్రశంసించింది. ఆ తర్వాత ఏడాదిలో కేవలం 9 టెస్టులు మాత్రమే ఆడి ఏకంగా 74.92 సగటుతో 1,049 పరుగులు సాధించిన శ్రీలంక బ్యాటర్ కామిందు మెండిస్‌కు కూడా ఈ ఐసీసీ అవార్డు నామినేషన్‌లలో చోటు దక్కింది.

## నాలుగో టెస్ట్‌లో ఓటమి..




**న్యూఢిల్లీ-నవభూమి:** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టెస్ట్‌లో భారత జట్టు 184 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ ఓటమితో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ఫైనల్‌కు చేరాలన్న భారత జట్టు అవకాశాలపై దెబ్బ కొట్టింది. ఇప్పటికీ ఫైనల్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నా.. అంత తేలిగ్గా మాత్రం కుదరదు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఓటమి తర్వాత %ఔజ% పాయింట్ల పట్టికలో భారతదేశం మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉన్నది. దక్షిణాఫ్రికా జట్టు పాకిస్థాన్‌ను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ప్రస్తుతం కేవలం రెండోస్థానం కోసం మాత్రమే పోరు కొనసాగనున్నది. ప్రస్తుతం ఫైనల్‌కు చేరేందుక ఆస్ట్రేలియా జట్టుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన టీమిండియాకు మూడోసారి ఫైనల్ ఆడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో 340 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 155 పరుగులకు కుప్పకూలింది. భారత బ్యాటర్లు మూడు సెషన్లలో ఆసిస్ బౌలర్లను దీటుగా ఎదుర్కోలేకపోయారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మెల్‌బోర్న్‌లో టీమిండియా టెస్టులో ఓడిపోయింది. ఇంతకు ముందు 2011లో చివరిసారిగా ఓడింది.

## మానసిక వేదన మిగిల్చింది.. ఓటమిపై రోహిత్ శర్మ



**మెల్‌బోర్-నవభూమి:** మెల్‌బోర్న్‌లో జరిగిన టెస్టులో ఇండియా దారుణంగా ఓడింది. 184 రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఆ టెస్టులో విజయం సాధించింది. ఆ మ్యాచ్ ముగిసిన తర్వాత మీడియాతో కెప్టెన్ రోహిత్ శర్మ మట్లాడాడు. బాక్సింగ్ డే టెస్టులో ఓటమి మానసిక ఆందోళన కలిగించిందన్నాడు. అనుకున్నది చేయలేనప్పుడు మానసిక సంఘర్షణ ఉంటుందని రోహిత్ తెలిపాడు. ఈ సిరీస్‌లో రోహిత్ కూడా సరిగా ఆడలేకపోవడంతో అతనిపై కూడా విమర్శలు అధికమయ్యాయి. ఆరు ఇన్నింగ్స్‌లో అతను కేవలం 31 రన్స్ మాత్రమే చేశాడు. ఓటమి డిస్టర్బింగ్‌గా ఉందని, వ్యక్తిగత లోపాలపై దృష్టి పెట్టాలన్నాడు. బాక్సింగ్ డే టెస్టు నిరాశపరిచిందని, మ్యాచ్‌లు గెలిచేందుకు మార్గాలు ఉంటాయని, కానీ ఆ మార్గాలను అన్వేషించలేకపోయామని రోహిత్ పేర్కొన్నాడు. చివర వరకు పోరాడాలని నిశ్చయించామని, కానీ దురదృష్టవశాత్తు అలా చేయలేకపోయినట్లు చెప్పాడు. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఓ దశలో 90 రన్స్‌కే ఆరు వికెట్లను కోల్పోయింది. కానీ ఆ తర్వాత చివరి వికెట్‌కు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పిన ఆస్ట్రేలియా.. భారీ ఆధిక్యాన్ని కూడా నమోదు చేసింది. ఆ పరిస్థితులను సరిగా వినియోగించుకోలేక పోయినట్లు రోహిత్ తెలిపాడు. విపత్కర పరిస్థితుల్లో చాలా పటిష్టమైన ఆటను ఆడాలన్న ఉద్దేశంతో ఉన్నామని, కానీ అనుకున్న రీతిలో రాణించలేకపోయామన్నాడు. రూమ్‌కు వెళ్లిన తర్వాత ఎలా ఓ జట్టుగా పోరాడాలన్న ఆలోచన చేసినట్లు రోహిత్ చెప్పాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**